


# వినుకొండ వార్త

దినపత్రిక

epaper.vinukondavartha.com

vnkvarta66@gmail.com

సంపుటి : 7 సంచిక : 223 గుంటూరు మంగళవారం 9 డిసెంబర్ 2025 పేజీలు : 8 వెల : రూ. 2.00/-

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం మార్గశిర మాసం హేమంత ఋతువు దక్షిణాయణం తిథి - పంచమి రాహుకాలం - ప. 3.00 నుండి 4.30 వరకు. యమగండం - ఉ. 9.00 నుండి 10.30 వరకు. దుర్ముహూర్తం ఉ. 8.24 నుండి 9.12 వరకు. వర్జ్యము - రా. 9.12 నుండి 10.45 వరకు. అమృత ఘడియలు .. ఉ. 6.17 నుండి 7.49 వరకు

# విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతున్నాం

## ఎన్ని ఇబ్బందులు వచ్చినా సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాం

## ఈ ఏడాది విద్యుత్ చార్జీలు పెంచబోం : సీఎం చంద్రబాబు




అమరావతి, డిసెంబర్ 8: విధ్వంసమైన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ అనేక విజయాలను చవిచూసిందని.. కానీ 2024 విజయం.. నమ్మకం, విశ్వాసం మీద వచ్చిందని తెలిపారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామన్నారు. పరీక్ష రాసినప్పుడు పిల్లలు ఎంత టెన్షన్‌గా ఉంటారో తాము అంతే టెన్షన్‌గా ఉంటామని చెప్పుకొచ్చారు. జీఎస్డీపీ విషయంలో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటున్నామని తెలిపారు. ఈ రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టగలుగుతారా? అనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని.. అయితే సిట్యూయేషన్ చూసి పారిపోమని ప్రజలకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాడు సూపర్ సిక్స్ తీసుకువచ్చామని... అయితే అభివృద్ధికి నిధులు లేవన్నారు. క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్ బాగా తగ్గి అభివృద్ధి లేకుండా పోయిందని వెల్లడించారు. తరువాత అన్ని వ్యవస్థలను గాడిన పెట్టామన్నారు. క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్‌ను బాగా పెంచామని.. సుపరిపాలనకు టెక్నాలజీని అభివృద్ధి చేశామని అన్నారు. ఆగిపోయిన స్కీంలు అన్నింటినీ తిరిగి ప్రారంభించామని ముఖ్యమంత్రి చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమపాళ్లలో చేపట్టామన్నారు. 18 నెలలుగా ప్రతి గంట, ప్రతి క్షణం కష్టపడ్డామన్నారు. 93 స్కీంలను మరలా రివైవ్ చేసినట్లు తెలిపారు. రూ.9000 కోట్ల సోలార్ విండ్ రెన్యూవబుల్ ఎనర్జీ కింద నాటి ప్రభుత్వం డబ్బులు పెంచేసిందని విమర్శించారు. కరెంటు ఛార్జీలు పెంచకుండా వ్యవస్థను నిలబెట్టామన్నారు. కరెంటు ఛార్జీలు ఈ ఏడాది కూడా పెంచమని... వచ్చే ఏడాది పెంచుకుంటామని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలో చాలా చోట్ల గ్రౌండ్ వాటర్ పెంచగలిగామన్నారు. ఏపీ బ్రాండ్ రాష్ట్రంలో పూర్తిగా దెబ్బతిన్నదని.. పరిశ్రమలను వెళ్లగొట్టారని మండిపడ్డారు. విద్యా వ్యవస్థలో ఆంగ్ల మీడియం అని చెప్పి డ్రాపవుట్లను పెంచారన్నారు. ఆలిండియా లెవల్‌లో టాప్ ఫైవ్ ఉన్న ఎడ్యూకేషన్ సిస్టంను టాప్ త్రీ లేదా వన్‌కు తీసుకువస్తామని స్పష్టం చేశారు. భూగర్భ జలాలను పెంచడం కూడా చేశామన్నారు. ఇటీవల జరిగిన ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పెట్టుబడుల గురించి అందరికీ తెలిసిందన్నారు. జీఎస్డీపీ, తలసరి ఆదాయం ఎలా పెరిగిందో చూస్తే రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతోందని అర్థమవుతోందన్నారు. ప్రజలకు ఈ విషయాలన్నీ తెలియాలనే ఉద్దేశంతో అన్నీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ అయిదేళ్లు అధికారంలో ఉందన్నారు. ఇక్కడ సరాసరి జీఎస్టీ 13.5 శాతం సాధించామని... కేంద్ర జీఎస్డీపీ కన్నా ఎక్కువ సాధించామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక 12.02 శాతం వృద్ధి సాధించామని.... ఆల్ ఇండియా లెవల్‌లో 9.8 శాతంగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కాగా.. 2025-26 తొలి అర్థ సంవత్సరం (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్)... అలాగే 2వ త్రైమాసికం (జూలై నుంచి సెప్టెంబర్) ఫలితాలను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. స్థిర ధరల వద్ద నమోదైన ఆర్థిక వృద్ధి, రాష్ట్ర స్థూల ఉత్పత్తి, గ్రాస్ వాల్యూ అడిషన్, వ్యవసాయం, ఉత్పత్తి, సేవా రంగాలు నమోదు చేసిన వృద్ధి గణాంకాలను విడుదల చేశారు. విభజన వల్ల రాష్ట్రానికి వ్యవస్థీకృతమైన నష్టం జరిగిందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. 2019-24 పాలన వల్ల వ్యవస్థలు డీఫంక్ట్ అయ్యాయని... రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోయిందని తెలిపారు. గత పాలకుల విధ్వంస పాలన వల్ల గ్రోత్ రేట్ తగ్గి రూ. 7లక్షల కోట్ల జీఎస్డీపీ కోల్పోయామని వెల్లడించారు. గ్రోత్ రేట్ లేకపోవటం వల్ల రూ. 76,195 కోట్ల ఆదాయం కోల్పోయామన్నారు. గత ప్రభుత్వంలో ఎక్కువ వడ్డీలకు అప్పులు తేవటం వల్ల ప్రజాధనానికి నష్టం కలుగుతోందని చెప్పారు. రుణాల రీ-షెడ్యూలింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బ్రాండ్ తగ్గినప్పుడు వడ్డీ రేటు పెరిగిపోతుందని... తద్వారా రెవెన్యూ జీఎస్డీపీలో రాష్ట్రం చాలా నష్టపోయిందని చెప్పుకొచ్చారు. 25 ఏళ్ల క్రితం చేసిన ఐటీ పాలసీ వల్ల తెలుగు వాళ్ల తలసరి అదాయం గరిష్టస్థాయిలో ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు ఎలా పెంచాలన్నదే ఎప్పుడూ తన ఆలోచన అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.




న్యూఢిల్లీ, డిసెంబర్ 8: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో జరిగిన ఇసుక కుంభకోణం కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎన్జీటీ విధించిన రూ.18 కోట్ల జరిమానాపై జేపీ వెంచర్స్ ఈరోజు (సోమవారం) సుప్రీంలో ఐఏ దాఖలు చేసింది. ఎన్జీటీ విధించిన జరిమానాను తాము చెల్లించాల్సిన అవసరం లేదంటూ సుప్రీంలో జేపీ వెంచర్స్ వాదనలు వినిపించింది. ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు తీసుకున్నది ప్రభుత్వమే కాబట్టి తాము జరిమానా ఎందుకు చెల్లించాలని వాదించింది. కాగా.. చిత్తూరు జిల్లాలోని ఆరణియార్ నదీ పరివాహక ప్రాంతాల్లో బి-2 కేటగిరీలో 18 రీచ్‌లలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినందుకు జేపీ వెంచర్స్‌కు ఎన్జీటీ రూ.18కోట్లు జరిమానా విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎన్జీటీ తీర్పుపై సుప్రీంను జేపీ వెంచర్స్ ఆశ్రయించింది. ఎన్జీటీ విధించిన జరిమానాను సుప్రీంకోర్టులో డిపాజిట్ చేయాలని జేపీ వెంచర్స్‌కు ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అయితే సుప్రీం ఆదేశాలలో సవరణ కోరుతూ తాజాగా జేపీ వెంచర్స్ ఐఏను దాఖలు చేసింది. ఈసీలు ప్రభుత్వమే తీసుకుందని, తాము తవ్వకాలు మాత్రమే చేపట్టినందున జరిమానా ప్రభుత్వమే చెల్లించాలని జేపీ వెంచర్స్ సుప్రీంకు తెలియజేసింది.

ఇప్పటి వరకూ ఈ వాదనను ఎక్కడా వినిపించకుండా కొత్తగా తెరపైకి జేపీ వెంచర్స్ తీసుకొచ్చింది. జేపీ వెంచర్స్ వాదనలకు సమాధానం ఇవ్వాలని ఏపీ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి సుప్రీం కోర్టు వాయిదా వేసింది.

# కొలిక్కిరాని 'కర్నాటకం'

## మరో బ్రేక్‌ఫాస్ట్ సమావేశం ఖాయమే!



బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీలో అధికార మార్పిడిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఢిల్లీలో సోనియా గాంధీ నివాసంలో అధిష్టానం నేతలు సమావేశమయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో కర్ణాటక అంశాన్ని ప్రత్యేకంగా చర్చించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. అయితే సమావేశంలో ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని, రానున్న రోజుల్లో మరోసారి సమావేశమై చర్చిస్తామని తెలిపారు.


కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, అందరూ కలసికట్టుగానే ఉన్నారని కూడా తెలిపారు.

ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య రెండు బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌ల అనంతరం రాష్ట్రంలో సీఎం మార్పు అంశం తాత్కాలికంగా బ్రేకులు పడిన సంగతి తెలిసిందే. **సంక్రాంతికి డీకేకు శుభవార్త!...** 'ఐదేళ్లు నేనే సీఎం' అని చెప్పుకునే స్థాయి నుంచి 'రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదు' అని చెప్పుకునే స్థాయి వరకూ సిద్ధరామయ్య దిగిరావడాన్ని చూస్తే, డీకే సీఎం అవ్వడం దాదాపు ఖాయం అయినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. సంక్రాంతికి డీకేకు హైకమాండ్ శుభవార్త అందించనున్నట్లు కూడా రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. డీకేను ముఖ్యమంత్రిని చేస్తే వచ్చే సాధకబాధకాలపై హైకమాండ్ ప్రధానంగా చర్చించినట్లు కూడా తెలుస్తోంది. తమ నిర్ణయాన్ని వెల్లడించకముందు మరోసారి ఇద్దరి మధ్య సయోధ్య కుదర్చాలని హైకమాండ్ భావిస్తోంది. ఇరువురి మధ్యా మరో బ్రేక్‌ఫాస్ట్ సమావేశం జరిగే అవకాశం ఉందని అంచనా. అనంతరం ఇద్దరిని ఢిల్లీకి పిలిపించి హైకమాండ్ చర్చించనున్నట్లు భావిస్తున్నారు.

## వందేమాతర గేయం పోరాట గేయం కాదు

# ఒక మంత్రం!

## వందేమాతరంపై లోక్ సభలో చర్చ.. కాంగ్రెస్‌పై మోడీ ఘాటు విమర్శలు




150 ఏళ్ల వందేమాతర గీతం ప్రయాణం ఎన్నో ఘట్టాలను దాటుకుంటూ వెళ్లిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. వందేమాతరం రాజకీయ అధికారం కోసం మాత్రమే ఉద్దేశించిన గీతం కాదని భారత దేశాన్ని బానిసత్వ సంకెళ్ల నుంచి విముక్తి కల్పించేందుకు నినదించిన గీతం అన్నారు. ఇవాళ లోక్ సభలో వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలపై చర్చను ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మోడీ వందేమాతరం.. స్వాతంత్ర్య పోరాటంలో భారతీయుల గొంతు అని వందేమాతరం గీతంపై చర్చ చేపట్టినందుకు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. వందేమాతర గీతం స్వాతంత్ర్య సమరయోధులకు ఊపిరిగా నిలిచిందని, భారతదేశాన్ని బానిసత్వ సంకెళ్ల నుంచి విముక్తి కల్పించేందుకు నినదించిన గీతం వందేమాతరం అన్నారు. అలాంటి కోట్ల మందికి స్ఫూర్తి నింపిన ఈ గీతంపై చర్చ జరపడం మనందరి అదృష్టం అని, ఈ చర్చలో పాల్గొనడం నాకు గర్వకారణం అన్నారు. బకించంద్ర చటర్జీ రాసిన వందేమాతరం దేశానికి పునరుజ్జీవాన్నిచ్చిందని 'గాడ్ సేవ్ ద క్వీన్' గీతంతో భారత్‌ను బ్రిటీష్ వారు మనల్ని అణచివేశారు. ఈ గాడ్ సేవ్ ద క్వీన్ గీతానికి పోటీగా వందేమాతరం గర్వంగా నిలబడిందన్నారు. జననీ జన్మభూమిశ్చ అన్న రాముడి మాటలకు మరో రూపం వందేమాతరం అన్నారు. కాంగ్రెస్ పై ఫైర్:ఈ చర్చ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోడీ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ వందేమాతరంపై కాంప్రమైజ్ అయిందని ముస్లిం లీగ్ ముందు కాంగ్రెస్ లొంగిపోయిందని ధ్వజమెత్తారు. సామాజిక సామరస్యం పేరుతో జవహర్ లాల్ నెహ్రూ వందేమాతరాన్ని ముక్కలు ముక్కలు చేశారని, కాంగ్రెస్ ఇప్పటికీ వందేమాతరాన్ని అవమానిస్తోందని ఆరోపించారు. వందేమాతరానికి ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. ఈ చర్చ చరిత్రతో ముడిపడిన అనేక ఘట్టాలను మన కళ్లముందుకు తీసుకొస్తుందని ఇవాళ్టి చర్చలు భవిష్యత్ తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఈ ఉత్సవాలు ఏడాది పొడవునా వేడుకలు జరుపుకొంటున్నామన్నారు. వందేమాతరం అనేది ఒక మంత్రం అన్నారు. 1947 లో దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఎంతో తోడ్పడిందని 2047 వికసిత్ భారత్ నెరవేరాలంటే వందేమాతరం స్ఫూర్తి అవసరం అన్నారు. గంగా, సింధూ, గోదావరి, కావేరి నదుల వెంట ఉన్న సాంస్కృతిక వైభవాన్ని వందేమాతరం చాటిచెప్పిందన్నారు. భారత్ ను విడదీస్తే గానీ ఇక్కడ పాలించలేమని బ్రిటిషన్లు భావించారు. దేశాన్ని ముక్కలు చేయాలని కుట్రలు చేసి దానికి బెంగాల్ ను ఓ ప్రయోగ శాలగా మార్చారన్నారు. అనుకున్నట్టుగానే బెంగాల్ ను విభజిచారు. ఈ విభజన జరిగినా దేశం మొత్తం వందేమాతరం స్ఫూర్తితో కలిసికట్టుగా పోరాడిందన్నారు. అనేక మంది ప్రాణాలు పోతున్నా వందేమాతర నినాదాన్ని ఆపలేదన్నారు. వందేమాతరం ఉద్దేశాన్ని, గౌరవాన్ని మళ్లీ తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వందేమాతరం ఆజాద్ భారత్ కు విజన్ గా మారిందని ఆ తర్వాత స్వదేశీ నినాదానికి స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు.

# ఘనంగా సాయుధ దళాల పతాక దినోత్సవం

## సైనికుల సేవలను కొనియాడిన జిల్లా కలెక్టర్

## రాష్ట్రంలోనే సాయుధ దళాల పతాక నిధుల సేకరణలో గుంటూరు ప్రథమ స్థానం జిల్లాలో ఇప్పటి వరకు రూ.17,67,363 సేకరణ










గుంటూరు, డిసెంబరు 8(వి. ఎన్. కే. వార్త) భారత సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగింది. సాయుధ దళాల పతాక దినోత్సవానికి ముందుగా తన మొదటి విరాళం అందించి పతాక దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సైనికులు వారి ప్రాణాలు త్యాగం చేస్తూ మనల్ని కాపాడుతున్నారన్నారు. ప్రజలు అందరూ కుటుంబాలతో ప్రశాంతంగా జీవిస్తున్నామని అందుకు కారణం సైనికుల త్యాగాలు అన్నారు. సైనికులు కుటుంబాలను వదిలి పెట్టి దేశ సరిహద్దుల్లో సియాచిన్ వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో సైతం రక్షణగా నిలిచి దేశాన్ని రేయింబవళ్ళు కాపాడుతున్నారని చెప్పారు. సైనికుల సేవలు ఎంతగా కొనియాడినా తక్కువేనని పేర్కొన్నారు. అటువంటి సైనికులకు, వారి కుటుంబాలకు ప్రతి వ్యక్తి రుణపడి ఉంటారని, వారికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. మనకు స్వాతంత్ర్యము సిద్ధించినప్పటి నుండి నేటి వరకు సాయుధ దళాలు దేశం లోపల, బయట ఎన్నో సవాళ్లను ఎదుర్కొని విరోచితమైన సేవలు అందిస్తూ దేశ రక్షణకు ఎంతగానో శ్రమిస్తున్నాయన్నారు. దేశ రక్షణలో అసువులు బాసిన వీరజవానులు, వారి పై ఆధార పడిన వారి సంక్షేమం, మాజీ సైనికులు, మాజీ సైనికుల వితంతువుల సంక్షేమంకు డిసెంబర్ 8న జరుపుకొను పతాక దినోత్సవానికి సహాయం అందిద్దామని విజ్ఞప్తి చేశారు. పతాక దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలను, వ్యాపారస్తులు, పారిశ్రామిక వేత్తలు తదితర అన్ని రంగాల ప్రజలువిరివిరిగా విరాళాలు అందించాలని కోరారు. "మీరు అందించిన ఈ సహాయం దేశ రక్షణలో అసువులు బాసిన వీర జవానుల కుటుంబ సంక్షేమం, వారి పునరావాసానికి ఎంతగానో ఉపయోగపడుతుంది" అన్నారు. సైనికులు వారి అవసరాలకు కార్యాలయాలకు వచ్చినపుడు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సమస్యలు పరిష్కారంలో చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్. గుణశీల మాట్లాడుతూ ప్రజలు ఆన్ లైన్ ద్వారా విరాళాలుఅందించవచ్చన్నారు. విరాళాలను డైరెక్టర్, సైనిక సంక్షేమ శాఖ, మధు గార్డెన్స్, విజయవాడ 520 010 వారికి ఆన్ లైన్ ద్వారా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యం జి రోడ్డు, గవర్నర్ పేట, విజయవాడ (16857)కు కరెంట్ అకౌంట్ నెంబరు : 33881128795, ఐ.ఎఫ్.ఎస్.సి కోడ్ (%IFSC Code)††SBIN0016857, MICR Code%. 520002046 ద్వారా గాని లేదా డైరెక్టర్, సైనిక్ వెల్ఫేర్,(%Director, Sainik Welfare%), విజయవాడ పేరు మీద చెక్కును జిల్లా సైనిక సంక్షేమాధికారి, గుంటూరు హిందూ కాలేజీ ఎదురుగా ఉన్న సైనిక సంక్షేమాధికారి కార్యాలయంలో సమర్పించవచ్చన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.17,67,363 సాయుధ దళాల పతాక నిధికి సేకరణ జరిగిందన్నారు. ఇందులో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ రూ.6.40 లక్షలు, మెప్మా రూ.2.05 లక్షలు, వి.ఐ.టి యూనివర్సిటీ రూ.2.50 లక్షలు, ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ రూ.1.30 లక్షలు, డా.పి కళావతి లక్ష రూపాయలు, కోస్టల్ బ్యాంక్ లక్ష రూపాయలు, మాజీ సుబేదార్ నాగమల్లేశ్వర రావు లక్ష రూపాయలు విరాళాలుగా అధిక మొత్తంలో అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఎక్కువ మొత్తంలో విరాళాలు అందించిన డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. విజయ లక్ష్మి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, వి.ఐ.టి రిజిస్ట్రార్ చంద్ర శేఖర్, కోస్టల్ బ్యాంక్ మేనేజర్ షేక్ గౌస్ భాషాకు జిల్లా కలెక్టర్ సత్కరించారు. 2023 అక్టోబరు 17వ తేదీన ఉత్తరాఖండ్ కుమాన్ సెక్టార్ లో ఆపరేషన్ స్నో లెపర్డ్ సైనిక చర్యలలో భాగంగా వెళుతూ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన చిట్టుమడుగుల వాసు కిషోర్ భార్య చిట్టుమడుగుల నవీనను సత్కరించడమే కాకుండా 3 వందల గజాల ఇంటి స్థలంను ఏటుకూరులో మంజూరు చేస్తూ అందజేశారు. జిల్లా సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధులు వినతి పత్రంను జిల్లా కలెక్టర్ కు అందజేస్తూ జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయానికి దారి నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగించాలని, మాజీ సైనికులకు కనీసం 175 గజాల స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, డిప్యూటీ కలెక్టర్ లు గంగ రాజు, లక్ష్మి కుమారి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలుపి.జి.ఆర్.ఎస్ కు 351 అర్జీలు

గుంటూరు, డిసెంబరు 8(వి. ఎన్. కే. వార్త) ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) లో 351 అర్జీలు అందాయి. సోమవారం ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ప్రజలు నుండి అర్జీలు స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులు ప్రతి అర్జీని విధిగా పరిశీలించి తగిన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అందిన వినతులలో కొన్ని వివరాలు ఈవిధంగాఉన్నాయి. గుంటూరు పట్టణం మారుతీనగర్ కు చెందిన షేక్ మదర్ సాహెబ్ వృధాప్య పింఛను మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. గుంటూరు పట్టణం రామిరెడ్డినగర్ కు చెందిన షేక్ ఖైరణ్ అప్కస్ ద్వారా ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. గుంటూరు పట్టణం రెడ్డి పాలెంకు చెందిన జి.నిర్మాల దేవి తనకు ఇంటిని మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. దుగ్గిరాల మండలం చింతలపూడికి చెందిన తిరుపతమ్మ అర్జీని సమర్పిస్తూ ఆక్రమణలు తొలగించుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. తాడికొండ మండలం బండారుపల్లికి చెందిన జాల ఏసయ్య వికలాంగుల పింఛను మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. గుంటూరు పట్టణం కొండయ్య కాలనీకి చెందిన జజ్జురి రమణ వితంతు పింఛను మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. కొలిపర మండలం అత్తోటకు చెందిన ఎస్.పిచ్చయ్య రీ సర్వే చేయాలని కోరుతూ అర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, డిప్యూటీ కలెక్టర్ లు గంగ రాజు, లక్ష్మి కుమారి, శ్రీనివాస్,హౌహౌడి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. విజయ లక్ష్మి, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు, జిల్లా విద్యా శాఖ అధికారి సి.వి. రేణుక, తదితరులు పాల్గొన్నారు.




# గుంటూరు జిల్లా వార్తలు






నగర పాలక సంస్థ, గుంటూరు(వి. ఎన్. కే. వార్త) గుంటూరు నగరంలో వార్డ వారీగా ప్రారంభించి, అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నవభారత్ నగర్, ఎస్వీఎన్ కాలనీ, గోరంట్ల, మేరీ ప్రియ నగర్, కాకాని రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పార్క్ ల అభివృద్ధి, సిసి రోడ్లు, డ్రైన్ల వంటి పలు అభివృద్ధి పనులకు సంబందించి టెండర్ ద్వారా కాంట్రాక్టు లు దక్కించుకొని, ఆయా పనులను కొంత మేర చేసి, అసంపూర్తిగా వదిలివేస్తున్నారని, దీనివలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తమ దృష్టికి తెస్తున్నారన్నారు. అసంపూర్తి పనులు చేసిన కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలు తీసుకోవడంలో ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసి, వార్డ్ ల వారీగా అసంపూర్తిగా చేపట్టిన పనులు, ఆయా కాంట్రాక్టర్లపై తీసుకున్న చర్యలతో కూడిన సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్వీఎన్ కాలనీ పార్క్ లో పెండింగ్ పనులను పూర్తీ చేయాలని, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఎక్విప్మెంట్ మరమత్తు చేపట్టి, ఫాగింగ్ చేపట్టాలన్నారు. మేరి ప్రియ నగర్ లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని, సదరు నగర్ లో పనుల పురోగతిపై ఈఈ నివేదిక ఇవ్వాలన్నారు. జిఎంసి పరిధిలో రోడ్ల మీద ఏర్పడిన గోతుల మరమత్తులకు కేటాయించిన పాట్ హోల్స్ మెషిన్ పనితీరు సక్రమంగా లేదని, ఇప్పటి వరకు మెషిన్ ద్వారా చేపట్టిన పనుల వివరాలను అందించాలని ఆదేశించారు. పర్యటనలోన కార్పొరేటర్ వి.శ్రీరాం ప్రసాద్, డిఈఈలు కళ్యాణరావు, వెంకటరమణ, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.





నగర పాలక సంస్థ, గుంటూరు(వి. ఎన్. కే. వార్త) గుంటూరు నగరపాలక సంస్థ ప్రతి సోమవారం జరిగే పిజిఆర్ఎస్, డయల్ యువర్ కమిషనర్ కి ప్రజల నుండి అందే ఫిర్యాదులు, అర్జీలను క్షేత్ర స్థాయిలో విభాగాదిపతులే పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 26 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీల్లో తక్షణం పరష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. డయల్ యువర్ కమిషనర్ కి అందిన ఆర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా మేయర్ తో కలిసి ప్రజల నుండి అర్జీలు తీసుకొన్న కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పిజిఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. సోమవారం జరిగే కార్యక్రమానికి క్షేత్ర స్థాయి అధికారులు కూడా హాజరైతే సమస్యల పరిష్కారం తేలికవుతుందని పేర్కొన్నారు. అర్జీలు బియండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లడానికి వీలులేదన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు ఆర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా 33 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 13, ఇంజినీరింగ్ విభాగం 9, రెవెన్యూ విభాగం 3, ప్రజారోగ్య విభాగం 7 ఉపా సెల్ విభాగానికి సంబందించి 1 ఫిర్యాదు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ(ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

# అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు, డిసెంబరు 8(వి. ఎన్. కే. వార్త) గుంటూరు న్యాయ సేవాధికార సంస్థ (%DLSA, Guntur%) లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్‌లో (%Legal Aid Defence Counsel System%)లో పనిచేయుటకు అర్హులైన న్యాయవాదుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెండవ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి మరియు న్యాయ సేవాధికార సంస్థ ఇన్ ఛార్జ్ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై. నాగరాజా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ (ఒక పోస్టు) ఒప్పంద ప్రాతిపదికన రెండు సంవత్సరాల కాలానికి లేదా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సవరించిన పథకం %–%2022 మార్గదర్శకాల ప్రకారం నియమించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు గుంటూరు జిల్లా న్యాయస్థాన వెబ్‌సైట్‌ను (%https://guntur.dcourts.gov.in%)µ'సందర్శించాలని కోరారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పోస్టుకు దరఖాస్తు చేయు న్యాయవాదులు క్రిమినల్ లాలో 1 నుండి 3 సంవత్సరాల ప్రాక్టీస్ అనుభవం, మంచి మౌఖిక మరియు లిఖిత కమ్యూనికేషన్ నైపుణ్యాలు, డిఫెన్స్ కౌన్సెల్ (న్యాయవాది)గా నైతిక బాధ్యతలపై సంపూర్ణ అవగాహన, ఇతరులతో సమర్థవంతంగా మరియు ఫలప్రదంగా పనిచేయగల సామర్థ్యం, మంచి రచనా మరియు పరిశోధనా నైపుణ్యాలు, ఐటీ పరిజ్ఞానం మరియు కంప్యూటర్ పనితీరులో నైపుణ్యం కలిగి ఉన్నవారు అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు డిసెంబర్ 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తులను సమర్పించాలని ఆయన అన్నారు. రూ.25 వేలు నెలసరి వేతనం ఉంటుందని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులు కేసులు దాఖలు చేయడం, మెజిస్ట్రేట్ ట్రయల్ కేసుల్లో విచారణలు నిర్వహించడం, రిమాండ్/జామీను మరియు ఇతర వివిధ పనులు చేపట్టడం, లీగల్ ఎయిడ్ పొందిన కేసుల్లో న్యాయ పరిశోధన చేయడం, ఆదేశాల మేరకు జైలు సందర్శనలు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌లకు వెళ్లడం, అరెస్టు ముందు దశలో సహాయం అందించడం, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్/డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్‌లకు లీగల్ ఎయిడ్ కేసుల నిర్వహణలో సహకరించడం, అభియోగ పత్రంలో ఉన్న సాక్ష్యాలను పరిశీలించిన తర్వాత, అలాగే నిందితుడి అభిప్రాయాలు విని, రక్షణ వ్యూహం రూపొందించడంలో సహాయం చేయడం, ఆరోపణలు ఉన్న నేర స్థలాన్ని సందర్శించడం, కుటుంబ సభ్యులతో చర్చలు జరపడం తద్వారా రక్షణ వ్యూహం కోసం అవసరమైన, ప్రభావవంతమైన సమాచారం సేకరించడం, లీగల్ ఎయిడ్ కోరేవారి ప్రశ్నలను పరిష్కరించడం, లీగల్ ఎయిడ్ పొందిన వారి కేసుల పురోగతిని వారికి తెలియజేయడం, లీగల్ ఎయిడ్ కేసుల పూర్తి ఫైళ్లను సిద్ధంగా ఉంచడంలో సహాయం చేయడం, క్రిమినల్ వ్యవహారాలకు సంబంధించిన న్యాయ సందేహాలను ఫోన్ ద్వారా పరిష్కరించడం, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ అప్పగించే ఇతర పనులు, లీగల్ సర్వీసెస్ అథారిటీ అప్పగించే ఏ విధినైనా నిర్వహించాలని చెప్పారు.

# అనాథాశ్రమ పిల్లలకు అమృత హెల్త్ స్కీమ్

గుంటూరు, డిసెంబరు 8(వి. ఎన్. కే. వార్త) ప్రభుత్వ గుర్తింపు పొందిన అనాథాశ్రమాల్లో నివసిస్తున్న అనాథ పిల్లల సంక్షేమం దృష్టా డా.ఎన్టీఆర్ వైద్యసేవ / అమృత హెల్త్ స్కీమ్ ను అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అమృత హెల్త్ కార్డులను చిన్నారులకు జిల్లా కలెక్టర్ అందజేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన 39 మంది లబ్దిదారులకు ప్రత్యేక అమృత హెల్త్ కార్డులు ముద్రించి పంపిణీ చేయడం జరిగిందన్నారుడా. ఎన్టీఆర్ వైద్యసేవ గుర్తింపు పొందిన నెట్వర్క్ ఆసుపత్రుల్లో పూర్తిగా నగదు రహిత (క్యాష్లెస్) వైద్యం అందుతుందని, మొత్తం 3257 శస్త్రచికిత్సలు / చికిత్సా విధానాలకు అర్హత ఉందన్నారు. సంబంధిత అనాథాశ్రమాల ద్వారా సరళమైన రిఫరెల్ విధానం ఉంటుందని చెప్పారు. లబ్దిదారులకు సమయానుకూలంగా, నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనాథాశ్రమాల్లోని అనాథ పిల్లలకు ఉచితంగా అధునాతన వైద్యం అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. వివరాలు, సహాయం కోసం గుంటూరు జిల్లా డా. ఎన్టీఆర్ వైద్యసేవజిల్లాసమన్వయాధికారిను సంప్రదించవచ్చని సూచించారు. అనాథ పిల్లల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మంచి పథకాల్లో అమృత్ ఆరోగ్య పథకం ఒకటని చెప్పారు.




ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, డా. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయ అధికారి విజయ్ పాల్గొన్నారు.




విజయవాడ: దళిత యువకుడు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అజ్ఞాతంలో ఉన్న కీలక నిందితుడు కొమ్మా కోటేశ్వరరావు అలియాస్ కొమ్మా కోట్లు విజయవాడ పటమట పీఎస్‌లో లొంగిపోయాడు. ఇదే కేసులో ఇద్దరు నిందితులు తేలప్రోలు రాము, వజ్రకుమార్ ఇటీవల కోర్టులో లొంగిపోయారు. మరోవైపు కీలక నిందితుడు ఎర్రంశెట్టి రామాంజనేయులను పటమట పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఏ1గా వల్లభనేని వంశీ, ఏ2గా కొమ్మా కోట్లు ఉన్నారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి హైదరాబాద్‌కు తరలించడం అక్కడినుంచి విజయవాడకు తీసుకురావడంలో కొమ్మా కోట్లు కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. ఈ కేసును ఉపసంహరించుకోవాలంటూ సత్యవర్ధన్‌పై వంశీ అనుచరులు తీవ్రంగా ఒత్తిడి తెచ్చి కిడ్నాప్ చేయడంతో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న కొమ్మా కోట్లుతో పాటు మరికొందరు అజ్ఞాతంలో ఉన్నారు. వారిపై ఇటీవల నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యారు. ఈ నేపథ్యంలోనే పటమట పీఎస్‌లో కొమ్మా కోట్లు లొంగిపోయినట్లు సమాచారం.




## మావోయిస్టు పార్టీకి మరొక ఎదురు దెబ్బ.. లొంగిపోయిన అగ్రనేత

మావోయిస్టు పార్టీకి మరొక ఎదురు దెబ్బ తగిలింది. మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు రామ్‌ధేర్ రాజ్ పోలీసులకు ఇవాళ(సోమవారం) లొంగిపోయారు. రామ్‌ధేర్‌తో పాటు మరో 12మంది సాయుధ నక్సలైట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులకు లొంగిపోయారు. రామ్‌ధేర్ ఎంఎంసీ జోన్‌లో సెక్రటరీగా పని చేస్తున్నారు. ఆయనపై రూ.కోటికి పైగా రివార్డ్ ఉంది. రామ్‌ధేర్ కీలక నక్సలైట్ దాడుల్లో పాల్గొన్నారు. రామ్‌ధేర్ రాజ్ ఛత్తీస్‌గఢ్‌లోని నందగావ్‌లోని సీఎం విష్ణుదేవ్ సాయి ముందు లొంగిపోయారు. లొంగిపోయిన నక్సలైట్లలో ఆరుగురు మహిళలు కూడా ఉన్నారు. కాగా, మావోయిస్టుల చర్యలను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మావోయిస్టుల చర్యలను కేంద్ర బలగాలు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నాయి. ఇటీవల ఏపీలోని మారేడుమిల్లిలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత హిడ్మా మృతిచెందారు. హిడ్మాతో పాటు పలువురు మావోయిస్టు కీలక నేతలు ఎన్‌కౌంటర్ అయ్యారు. భద్రత బలగాల చర్యలను మావోయిస్టు పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ క్రమంలోనే రామ్‌ధేర్‌తో పాటు పలువురు నక్సలైట్లు ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయినట్లు సమాచారం.



## సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన షెడ్యూల్ ఖరారు.. పూర్తి వివరాలివే..

అమరావతి, డిసెంబరు 8 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. వచ్చే ఏడాది జనవరి 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దావోస్‌లో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. దావోస్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరుకానున్నారు. చంద్రబాబు బృందంలో మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ ఉన్నారు. ఈ మేరకు సీఎం దావోస్ పర్యటన షెడ్యూల్‌ను ఖరారు చేశారు అధికార వర్గాలు. ఇవాళ(సోమవారం)దావోస్ పర్యటనకు సంబంధించిన ప్రకటన విడుదల చేశారు. అయితే దావోస్ పర్యటనలో పలువురు పారిశ్రామికవేత్తలను కూడా సీఎం కలిసే అవకాశాలు ఉన్నాయి. ఏపీకి కావాల్సిన పెట్టుబడులపై పారిశ్రామిక వేత్తలతో చంద్రబాబు చర్చించే ఛాన్స్ ఉంది. ఏపీ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఇప్పటికే అమెరికాలోని డల్లాస్‌లో లోకేశ్ పర్యటిస్తున్న విషయం తెలిసిందే.

## ఎమ్మెల్యే మాధవి ప్రొటోకాల్ అంశం.. ప్రివిలేజ్ కమిటీ ఏం తేల్చిందంటే



అమరావతి, డిసెంబర్ 8: అసెంబ్లీ కమిటీ హాల్‌లో ప్రివిలేజ్ కమిటీ ఈరోజు (సోమవారం) భేటీ అయ్యింది. ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ పితాని సత్యనారాయణ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి విషయంలో ప్రొటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యంపై కమిటీ విచారించింది. రిమ్స్‌లో క్యాథ్లాబ్ ప్రారంభోత్సవ శిలా ఫలకంలో ఎమ్మెల్యే పేరు లేకపోవడంపై చర్చ జరిగింది. ఈ వ్యవహారానికి సంబంధించి అప్పటి మెడికల్ సూపరింటెండెంట్, డీఆర్వోను కమిటీ ప్రశ్నించింది. గత వాయిదాకు ఇరువురు హాజరుకాకపోవటంపై తీవ్రంగా మందలించింది. ప్రభుత్వం మారిందనే స్పృహ లేకుండా పనిచేస్తున్నారా అని కమిటీ మండిపడింది. తీరు మారకుండా ఎమ్మెల్యేల పట్ల అగౌరవంగా ఉంటున్నారని కమిటీకి మాధవీ రెడ్డి ఫిర్యాదు చేశారు. జరిగిన తప్పును అంగీకరించి కమిటీకి నాటి సూపరింటెండెంట్ క్షమాపణలు చెప్పారు. తప్పు పునరావృతం కాకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. అయితే ఈ వ్యవహారంపై పొంతన లేని సమాధానాలు చెప్పిన నాటి డీఆర్వోపై కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోసారి విచారణకు రావాలని ఇరువురునీ ఆదేశించింది. అలాగే 2019–24 మధ్య ఎమ్మెల్యేగా తనకు జరిగిన ప్రోటోకాల్ ఉల్లంఘనలపై జోగేశ్వరరావు ఇచ్చిన ఐదు ఫిర్యాదులపైనా కమిటీ చర్చించింది. ఐదు ఫిర్యాదులపై నాటి అసెంబ్లీ సిబ్బంది నోటీసులు కూడా పంపకపోవటంపై కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. నాటి ప్రభుత్వ పెద్దల ఒత్తిడికి తలొగ్గి ప్రోటోకాల్ పాటించలేకపోయామని అధికారులు వివరణ ఇచ్చారు. కమిటీని క్షమాపణలు కోరి, తప్పు పునరావృతం కాకుండా చూసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

## సొంత ఇలాకాలో జగన్‌కు గట్టి ఎదురుదెబ్బ

కడప, డిసెంబర్ 8: ఏపీలో అధికారం కోల్పోయినప్పటి నుంచి వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి షాక్‌ల మీద షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. కేవలం 11 సీట్లతో ఘోర ఓటమిని చవిచూసిన జగన్‌కు.. పార్టీ నేతలు కూడా కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత ముఖ్య నేతల నుంచి కిందస్థాయి శ్రేణులు అందరూ కూడా పార్టీని వీడుతున్నారు. ఓటమి మొదలు జగన్‌కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. తాజాగా సొంత ఇలాకాలో జగన్‌కు ఆ పార్టీ నేతలు భారీ షాక్ ఇచ్చారు. పులివెందులలో వైసీపీ నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. వేంపల్లి పట్టణంలో పలువురు నేతలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈరోజు (సోమవారం) పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి సమక్షంలో కొంతమంది వైసీపీ శ్రేణులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందిరికీ బీటెక్ రవి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం కారణంగా ఆగిపోయిన పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. చంద్రబాబు నాయుడు పాలన చూసి పులివెందుల వైసీపీ నేతలు పార్టీలో చేరుతున్నారని బీటెక్ రవి వెల్లడించారు.




## మేము మీలా కాదు.. దేశం కోసమే ఉన్నాం: ప్రియాంక గాంధీ

లోక్‌సభ లో వందేమాతరం గేయంపై వాడి వేడి చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేత, ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా.. ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశ ప్రయోజనాల కంటే ఎన్నికలకే బీజేపీ అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. సభలో పదే పదే అంతరాయాలు, గందరగోళాన్ని సృష్టిస్తూ పాలక పార్టీ ఎన్నికల హడావుడిగా ముందుకు సాగుతోందని.. కానీ, కాంగ్రెస్ జాతీయ విలువల కోసం పోరాడుతుందని ఆమె అన్నారు. దేశ ప్రయోజనాలపై పోరాడేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు ప్రియాంక. 'మీరు ఎన్నికల కోసమే ఇక్కడ కూర్చొన్నారు. కానీ మేము దేశం కోసం ఉన్నాం. ఎన్నికల్లో పరాజయాలనేవి పార్లమెంటులో పార్టీ స్వరం వినిపించకుండా ఆపలేవు. మేము ఎన్నికల్లో ఓడిపోతూనే ఉన్నా.. ఇక్కడే కూర్చుని మీతో పోరాడుతూనే ఉంటాం' అని ప్రియాంక చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వందేమాతరం గేయంపై చర్చించాల్సిన అవసరం ఏముందని కాంగ్రెస్ ఎంపీ ప్రశ్నించారు. ప్రభుత్వం.. ముఖ్యమైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలా చేస్తోందని బీజేపీ ఎంపీలపై ఆమె ధ్వజమెత్తారు. వందేమాతరాన్ని రాజకీయం చేయడం సమర్థనీయం కాదన్న ఆమె.. పశ్చిమ్ బెంగాల్లో రాబోయే ఎన్నికల సందర్భంగానే ఈ అంశాన్ని లేవనెత్తినట్టుందని మండిపడ్డారు. బెంగాల్ ఎలక్షన్స్‌కు ఈ చర్చలతో ఆజ్యం పోస్తున్నారని విమర్శించారామె. వందేమాతరం.. ధైర్యం, త్యాగానికి చిహ్నమని ఈ సందర్భంగా గుర్తుచేశారు ప్రియాంక. 'ఈ జాతీయ గేయం.. మనకు ధైర్యాన్ని గుర్తు చేస్తుంది, ఇది మన ఆత్మలో ఒక భాగం' అని వందేమాతరం ప్రాముఖ్యతను గురించి ప్రియాంక వివరించారు.




ఢిల్లీ: ఇండిగో అంతర్గత సమస్యల వల్లే ఈ సంక్షోభం తలెత్తిందని, పైలట్ రోస్టర్, క్రూ సిబ్బంది సమస్యల వల్లే విమాన సర్వీసుల రద్దు అయ్యాయని కేంద్ర విమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

వీలైనన్ని ఎక్కువ విమాన సంస్థలను ప్రోత్సహిస్తున్నామని, ప్రయాణికుల అసౌకర్యానికి తాను చింతిస్తున్నానని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇండిగో సంక్షోభం గురించి రాజ్యసభలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఎఫ్డీటీఎల్ నిబంధనలను రూపొందించే ముందు అందరితో చర్చించామని, నవంబర్ 1 నుంచి రెండో దశ నిబంధనలు అమల్లోకి తెచ్చామని తెలిపారు. ఎఫ్డీటీఎల్ అమల్లోకి వచ్చిన నెల వరకు సజావుగానే విమాన సర్వీసులు నడిచాయని గుర్తు చేశారు.

డిసెంబర్ 3 నుంచే సమస్య మొదలైందన్నారు. వీలైనన్ని ఎక్కువ విమాన సంస్థలను ప్రోత్సహిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఇండిగో సంక్షోభం కారణంగా 5,86,700 విమాన టికెట్లు రద్దు అయ్యాయని తెలిపారు. టికెట్ ధరలు పెంచకుండా తాము పరిమితులు విధించామని, టికెట్ ధరలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.




విశాఖ: గంగవరం పోర్టు గేటు వద్ద నిర్వాసిత మత్స్యకారులు ఆందోళనకు దిగారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద తమకు ఒక్కొక్కరికి చెల్లించాల్సిన రూ.2 లక్షల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిర్వాసిత మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఇది ఉద్రిక్తతకు దారి తీసింది.

గేట్లను తోసుకుంటూ లోపలికి వెళ్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. గంగవరం పోర్టులోని 499 మంది కార్మికులకు ఒక్కొక్కరికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.2 లక్షలు ఇచ్చేందుకు ఏడాది క్రితం యాజమాన్యం ఒప్పందం చేసుకుంది.
వీటి చెల్లింపుల్లో ఆలస్యం చేస్తున్నారని, పన్నుల రూపంలో డబ్బులు అయిపోయాయని అధికారులు సాకులు చెబుతున్నారని ఆరోపిస్తూ కార్మికులు కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈక్రమంలో సోమవారం కార్మికులంతా మూకుమ్మడిగా గేటు వద్దకు వచ్చారు. దీంతో యాజమాన్యం స్పందించి కార్మిక నాయకులను చర్చలకు పిలిచింది. వివిధ అంశాలపై వారితో అధికారులు చర్చిస్తున్నారు.




## పల్నాడు రోడ్డు ప్రమాదంలో వీడిన మిస్టరీ.. జరిగింది ఇదే

పల్నాడు, డిసెంబర్ 8: జిల్లాలోని చిలకలూరిపేట వద్ద మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. అయితే ఈ ప్రమాదంపై పోలీసులు జరిపిన విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. జాతీయ రహదారిపై ట్రాక్టర్ల లోడుతో వెళ్తున్న కంటైనర్‌కు కారును అడ్డుపెట్టి ఆపే ప్రయత్నం జరిగిందని... కారును అడ్డంపెట్టడం వల్లే కంటైనర్‌ను వెనుక నుంచి మరో కారు ఢీకొట్టినట్లు విచారణలో తేలింది. అయితే నరసరావుపేట డీఎస్పీ ఆఫీస్‌లో పనిచేసే ఏఎస్ఐ కుమారుడు కంటైనర్‌ను ఆపినట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా ఏఎస్ఐ కుమారుడి ఆగడాలను కూడా పోలీసులు బయటపెట్టారు. సదరు ఏఎస్ఐ కుమారుడు.. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ అవతారం ఎత్తి అక్రమవసూళ్లకు పాల్పడుతున్నట్లుగా విచారణలో పోలీసులు తేల్చారు. ఎప్పటిలాగే బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌గా మారి జాతీయ రహదారిపై కంటైనర్‌ను ఆపైన ఏఎస్ఐ కుమారుడు.. ఐదుగురు విద్యార్థుల మృతికి కారకుడిగా నిలిచాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా.. ఈనెల 4న చిలకలూరిపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయ్యప్ప మాల ధరించిన విద్యార్థులు ఒంగోలు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వీరంతా కూడా గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. ఒంగోలుకు కారులో వెళ్తున్న విద్యార్థులు జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు.

వేగంగా దూసుకొచ్చి ఢీకొనడంతో కారు పూర్తిగా కంటైనర్ కిందికి వెళ్లిపోయింది. దీంతో ఐదుగురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. అయ్యప్పమాలలో ఉన్న విద్యార్థులు శబరిమల యాత్రకు వెళ్లేందుకు స్వగ్రామలకు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

# తెదేపా ప్రజా ఉద్యమానికి ప్రతీక...

**ఎన్టీఆర్ చైతన్య రథయాత్ర రాజకీయాల్లో మహా విప్లవం....**
**అన్ని వర్గాలకు రాజకీయాల్లో ప్రాధాన్యం...**
**జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర...**
**వైసీపీ వైఫల్యాలు, తెలుగుదేశం పోరాటం...**
**అధినేత చంద్రబాబుపై నమ్మకంతో ప్రజల మద్దతు...**
**భావజాలం చరిత్రపై ఎమ్మెల్యే ఏలూరి శిక్షణ...**



పర్చూరు:వినుకొండ వార్త:తెలుగు ప్రజల ఆశయాలే టిడిపి పునాది అనిటిడిపి గుర్తు గుడిసె%-%చక్రం%-%నాగలి, పసుపు జెండా, సైకిల్ అన్ని కలిపి తెలుగువారి జీవన విధానం, గ్రామీణ విలువలు, శ్రామికుల గొప్పతనాన్ని ప్రతిబింబిస్తాయని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. సోమవారం తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం, భావజాలం, చరిత్రపై మండల పార్టీ అధ్యక్షులకు స శిక్షణా శిబిరం టిడిపి జాతీయ కార్యాలయం మంగళగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొని ప్రసంగించారు. పసుపు జెండా శుభం%-%సంపదలకు ప్రతీక కాగా, గుడిసె%-%నాగలి%-%చక్రం రైతు%-%శ్రామిక కృషిని సూచిస్తాయని, సైకిల్ సామాన్యుడి పురోగతికి ప్రతీక అని వ్యాఖ్యానించారు.ఒక పార్టీ కాదు%ౌ% అది ఉద్యమం"ు ఎన్టీఆర్ ఆవేశంటిడిపిని ఎన్టీ రామారావు రాజకీయ పార్టీగా కాకుండా తెలుగు ఆత్మగౌరవ ఉద్యమంగా ప్రారంభించారని ఏలూరి గుర్తుచేశారు. ఆనాడు ఉన్నతవర్గాలకు మాత్రమే పరిమితమైన రాజకీయాల్లో అట్టడుగు వర్గాలకు, వృత్తి నిపుణులకు, విద్యావేత్తలకు నాయకత్వ అవకాశాలు ఇచ్చింది ఒక్క టిడిపే అని అన్నారు. జిఎంసి బాలయోగి, ఎర్రన్నాయుడు, తదితరులు%ౌ% అలాగే కెసిఆర్, రేవంత్ రెడ్డి వంటి అనేక మంది నాయకులు టిడిపి వేదిక మీద నుంచి ఎదిగి తెలంగాణలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.1982లో ప్రజల మధ్య నుంచి ఎన్టీఆర్ చేపట్టిన చైతన్య రథయాత్ర తెలుగు రాష్ట్ర చరిత్రలో మలుపు మార్చిందని ఏలూరి తెలిపారు.కాంగ్రెస్ అజేయ శక్తిగా ఉన్న కాలంలో ప్రజల్లో నమ్మకాన్ని కలిగించిందని చెప్పారు.సమాజమే దేవాలయం%-%ప్రజలే దేవుళ్లు" అనే ఎన్టీఆర్ సిద్ధాంతం కూలీలు, రైతులు, మహిళలు, వెనుకబడిన వర్గాల ఆశయాలను కేంద్రీకృతం చేసిన ప్రజా తాత్వికత అని అభివర్ణించారు.టిడిపిని ప్రజలు ఎందుకు ఎన్నుకుంటారంటే.... ప్రాంతీయ ఆకాంక్షలు ం జాతీయ దృక్పథం ఒకే సమయంలో ప్రాంతీయ అభివృద్ధి, జాతీయ బాధ్యతను నిర్వర్తించే పార్టీ టిడిపే అని చెప్పారు.భవిష్యత్ తరాలకు దారి చూపే నాయకత్వాన్ని ఇవ్వడంలో టిడిపి ప్రత్యేకమని తెలిపారు.సమాజ సేవకు అంకితభావంతో పనిచేసే కేడర్ ఉండడం పార్టీ బలం అని పేర్కొన్నారు.జాతీయ రాజకీయాల్లో టిడిపి కీలక పాత్ర1984లో లోక్‌సభలో 30 స్థానాలతో ప్రథమ ప్రాంతీయ ప్రతిపక్షంగా నిలిచిన టిడిపి, నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్, ఎన్డీఏ ప్రభుత్వాల ఏర్పాటులో కీలకపాత్ర పోషించిందని గుర్తుచేశారు. కెఆర్ నారాయణన్, అబ్దుల్ కలాం, ద్రౌపది ముర్ము వంటి వ్యక్తులను రాష్ట్రపతి పదవులకు ఎన్నుకోవడంలో కూడా టిడిపి ప్రధాన భూమిక వహించిందని పేర్కొన్నారు.2019%-%2024: "అంధకారం పాలనలో...వైసిపి ప్రభుత్వంలోని వైఫల్యాలను ఏలూరి స్పష్టంగా వివరించారు. నాసిరకం మద్యం విక్రయం,
కరెంట్ ఛార్జీలు 11సార్లు పెంపు,ఇసుక దందా,పోలవరం పనుల అస్తవ్యస్తం,పరిశ్రమల పారిపోవడం,ఉద్యోగులకు అన్యాయాలు, గంజాయి%-%మాదక ద్రవ్యాల పెరుగుదలఈ పరిస్థితులపై చంద్రబాబునాయుడు బాదుడే బాదుడు, ఇదేం కర్మ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించారని వివరించారు.అక్రమ అరెస్ట్ ు ప్రపంచవ్యాప్తంగా నిరసనలు..చంద్రబాబును అక్రమంగా 52 రోజులపాటు నిర్బంధించటం ప్రజాస్వామ్యంపై దాడి అని ఏలూరి అన్నారు.ప్రపంచవ్యాప్తంగా తెలుగు సాఫ్ట్వేర్ నిపుణులు నిరసనలు తెలియజేసిన విషయాన్ని స్మరించారు. రాష్ట్రవ్యాప్తంగా చంద్రబాబు నిర్వహించిన "రా కదలిరా" సభలు,లోకేశ్ చేపట్టిన 3,132 కి.మీ యువగళం పాదయాత్రప్రజల్లో తిరుగుబాటు స్ఫూర్తిని రగిలించాయని అన్నారు.164 సీట్లు ఎందుకు?ు ప్రజల తీర్పుతరచూ జరిగిన అప్రజాస్వామ్య చర్యలు, పాలన వైఫల్యాల నేపథ్యంలోరాష్ట్ర ప్రజలు విజనరీ నాయకుడు చంద్రబాబునాయుడేరాష్ట్రాన్ని పునర్నిర్మించగలరనే నమ్మకంతోకూటమికి ఘన విజయాన్ని అందించారని ఏలూరి పేర్కొన్నారు.

## కరాటే పోటీల విజేతలకు మెడల్స్ బహూకరిస్తున్న డి.ఎస్.పి పోతురాజు....ఫైటింగ్

**( కుమీతే)ఈవెంట్లో తలపడుతున్న బాలికలు..**
**నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో మెడల్స్ సాధించిన షికోకాయి స్కూల్ విద్యార్థులు...**
**బాపట్ల కరాటే స్కూల్ విద్యార్థుల ప్రతిభ...**



బాపట్ల:వినుకొండ వార్త: నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ గుంటూరు(2025) ఆధ్వర్యంలో జరిగిన 23వ మెగా కరాటే పోటీల్లో బాపట్ల షికోకాయి కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు స్కూల్ నిర్వాహకులు ఎర్ర నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. గుంటూరు లోని ఎన్టీఆర్ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ గుంటూరు(2025) ఆధ్వర్యంలో జరిగిన 23వ మెగా కరాటే పోటీలవివిధ విభాగాల్లో 15 మంది విద్యార్థులకు కటా,కుమితేలో మెడల్స్ సాధించారు. కాగా అండర్ -14 కుమితే విభాగంలో ఆరాధ్య గోల్డ్ మెడల్ సాధించింది. అండర్- 11 కటా విభాగంలో కే.తన్విష్, బి. అక్షర, ఎం. ఇస్రాని గోల్డ్ మెడల్ సాధించారు. ఫైటింగ్ లో టి .అనన్య గోల్డ్, కటావిభాగంలో సిల్వర్ మెడల్ చేజిక్కించుకుంది. ఏ. వైష్ణవ్ సిల్వర్ మెడల్ సాధించాడు. అలాగే అండర్-9 విభాగంలో కటాలో కె. లౌక్య, ఐశ్వర్య బ్రాంజ్ మెడల్ సాధించారు. జి. క్రియాన్ష్, బి. అభిరామ్ బంగారు పతకం సాధించారు. కె. తన్విష్ సిల్వర్ మెడల్ సాధించగా, బి అక్షర గోల్డ్ మెడల్ సాధించింది. అబ్దుల్ అస్లాం కటాలో గోల్డ్ మెడల్ సాధించగా, ఫైటింగ్ లో సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. వి. అదిత్రి దివ్య, టి. ప్రహర్షిత సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రధానోత్సవలో డి. ఎస్. పి పోతురాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో అతి చిన్న వయసులోనే కరాటే పోటీలు నిర్వహించడం వారిలో ఉన్న పోటీ తత్వాన్ని వెలికి తీయటమే అన్నారు. అనంతరం ఆయన విజేతలకు విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. బాపట్ల షికోకాయి కరాటే స్కూల్ నిర్వాహకులు ఎర్ర నాగేశ్వరరావు మాట్లాడుతూ కరాటే పోటీల వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్య సాహసం, ఏకాగ్రత వంటి లక్షణాలు పుణికి పుచ్చుకోవచ్చని అన్నారు. నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల విజేతలకు బహుమతులు అందజేసిన నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కరాటే పోటీల్లో పర్యవేక్షకులుగా వ్యవహరించిన ఉమా, బాబీలకు అభినందనలు తెలియజేశారు. కరాటే పోటీలకు సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ 23వ మెగా పోటీల నిర్వాహకులు సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సహకరించి కరాటే పోటీలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కరాటే పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వమే తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**ధాన్యంలో తేమ శాతాన్ని పెంచి ప్రభుత్వమే కొనుగోలు చేసే ఏర్పాటు చేయాలి**
**ప్రభుత్వానికి వరికూటి అశోక్ బాబు డిమాండ్**

భట్టిప్రోలు వినుకొండ వార్త: వేమూరు నియోజకవర్గ పరిధిలో రైతులు పండించిన ధాన్యము కొనుగోలు ధరను ప్రభుత్వం ప్రకటించినా రైతులకు మద్దతు ధర లభించడం లేదని, సదరు రైతులకు తగు న్యాయం జరపాలని రేపల్లె రెవెన్యూ అభివృద్ధి అధికారిని కలిసి వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు నత్తనడక నడుస్తుందన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆయా గ్రామాలలో అధికార పార్టీ నేతల కనుసన్నల్లో జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధాన్యం తేమ 17% గా ఉన్నందున కొనుగోళ్లలో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం యొక్క తేమ శాతాన్ని 22% శాతంగా పెంచాలని కోరారు. దళారుల వ్యవస్థను కూడా అధికారులు కట్టడి చేయాలని అశోక్ బాబు డిమాండ్ చేశారు. అదే విధముగా సకాలంలో రైతుకు యూరియా అందకపోవటం వలన మరియు తుఫాన్ల వలన కురిసిన వర్షాలకు కారణంగా దిగుబడి తగ్గినందున ధాన్యం కొనుగోలు నిబంధనలను సరళం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వమే రైతుల వద్ద నుండి తడిచిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు జరపాలని,కొనుగోళ్లలో వివక్షత చూపించకుండా ప్రభుత్వం అధికారుల సారధ్యంలో కొనుగోలు కేంద్రాలను నిర్వహించి రైతును ఆదుకోవాలి అశోక్ బాబు కోరారు. ఈ కార్యక్రమంలో



రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గాదె శివరామకృష్ణ రెడ్డి,భట్టిప్రోలు మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరావు, పల్లికోన గ్రామ సర్పంచ్ బొల్లేదు ప్రతాప్, పెద్దిశెట్టి రాంబాబు, బాపట్ల జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ సిరాజుద్దీన్, నాయకులు జల్లి జోషీకాంత్,జంగం వాసు, మోర్ల కోటేశ్వరరావు, చిలకా రత్నబాబు, నూతక్కి జశ్వంత్ రాజ్, చిలుమూరి ప్రశాంత్, పడమటి శ్రీనివాస్, వేల్పూరి నాగేశ్వరరావు, పంతగాని నాంచారయ్య, తదితర నాయకులు, రైతులు ఉన్నారు.

# బాపట్ల జిల్లా వార్తలు

## రోడ్ ప్రమాదాల నివారణే లక్ష్యం గా పనిచేస్తున్న ఎస్ ఐ మర్రి వెంకట శివకుమార్....



పీవీపాలెం:వినుకొండ వార్త:బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమా మహేశ్వరరావు ఉత్తర్వుల ప్రకారం డి ఎస్ పి రామాంజనేయులు ఆదేశాల మేరకు బాపట్ల రూరల్ సర్కిల్ సీ ఐ బి హరికృష్ణ నేతృత్వంలో పిట్టలవాని మండలం చందోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని చందోలు బాపట్ల హైవే పై ఎస్ ఐ మర్రి వెంకట శివకుమార్ వాహనాలు తనిఖీ నిర్వహించారు. హెల్మెట్,వాహన ధ్రువ పత్రాలు, లైసెన్స్ లు లేని వాహన దారులకు చలానా విధించారు. జిల్లా ఎస్ పి ఉమా మహేశ్వరరావు బాపట్ల ఎస్ పి గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి రోడ్ ప్రమాదాల నివారణ చర్యలు చేపడుతున్నారని రోడ్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఆయన ఉత్తర్వులు జారి చేస్తున్నారని, అందరూ కూడా బాధ్యత గా వ్యవహరించి రోడ్ భద్రతా నియమాలు పాటించి రోడ్ ప్రమాదాలు జరగకుండా ఉండేలా చూడాలని ఎస్ ఐ మర్రి వెంకట శివకుమార్ వాహన దారులను కోరారు. రోడ్ ప్రమాదాల నివారణకై పోలీస్ యంత్రాంగం ,ప్రజలలో అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతునప్పటికీ ఎవరు బాధ్యత గా వ్యవహరించడం లేదని ,ఇక పై రోడ్ భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారి పై కఠినం గా చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ మర్రి వెంకట శివకుమార్ అన్నారు వాహనదారులు హెల్మెట్ , సీట్ బెల్ట్ ధరించడం వలన ప్రమాదాల సంభవించినప్పుడు ప్రాణాపాయం నుండి బయట పడవచ్చని, ఎస్ ఐ మర్రి వెంకట శివకుమార్ తెలిపారు. ఈ విషయాలు దృష్టి లో పెట్టుకొని వాహన దారులు బాధ్యత నడుచుకోవాలని రోడ్ భద్రతా నియమాలు పాటించి రోడ్ ప్రమాదాల నివారణకై పోలీస్ వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమం లో పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్వచంద సేవ సంస్థ వారు పాల్గొన్నారు.

## జిల్లా నలుమూలల నుండి వచ్చే ప్రజల సమస్యల పరిష్కార అర్జీల పై అధికారులు వెంటనే స్పందించి పరిష్కారం చూపాలి... జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్...




బాపట్ల:వినుకొండ వార్త: ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లా నలుమూలల నుండి వచ్చే ప్రజల సమస్యల పరిష్కార అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి వాటికి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ప్రజా సమస్యల అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు ఆన్లైన్లో పంపించినప్పటికీ వాటిని కొంతమంది అధికారులు చూడటం లేదని, అట్లు చూడని వారిపై చర్యలు తీసుకోబడతాయని ఆయన అన్నారు. జిల్లా, మండలం, కార్యాలయ లవారీగా ప్రజా సమస్యల అర్జీల పై ఆయన ఆరా తీశారు. మార్టూరు మండలంలో ఎక్కువగా అర్జీలు రావటానికి గల కారణాలపై ఆయన ఆరా తీశారు. అర్జీలను ఫ్రీ ఆడిట్ చేయుటలో కొన్ని మండలాల పనితీరు సరిగా లేదని, వాటికి సంబంధించిన జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ముఖ్య ప్రముఖుల నుండి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో నాణ్యమైన చక్కని ఎండార్స్మెంట్ ద్వారా అర్జీదారునికి అందజేయాలని, అర్జీల ఆడిటింగ్ విషయంలో అర్జిదారునికి అవగాహన కల్పించే విధంగా, అదే సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలపై, కార్యాలయాల పనితీరుపై ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అనేక అంశాలు జోడిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయంలో అధికారులు జాగ్రత్త వహించాలని, అధికారులు వారి శాఖ నిర్వహించే పనులపై సమగ్ర సమాచారాన్ని కలిగి ఉండాలని, ప్రభుత్వం అడిగే ప్రశ్నలకు స్పందించని అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అధికారులందరూ చిత్తశుద్ధితో పనిచేసి అన్ని విషయాలలో జిల్లాను మూడో స్థానంలో, అంతకంటే పై స్థాయిలో ఉంచే విధంగా పనిచేయాలని, అట్లు జరిగన పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోబడునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, పిడి డిఆర్డిఏ లవన్న, జిల్లా అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదస్తులకు రెడ్ క్రాస్ ఆదరణ.



కర్లపాలెం(వి.ఎన్.కే వార్త). ఆరోగ్యంవంతమైన సమాజానికి అందరు కృషి చేయాలి. ఇన కొల్లు పోలీసు రావు .అగ్ని ప్రమాదస్తులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్లపాలెం కొంత ఆదరణ కలిగించినది. వారికి వంటసామాగ్రి ,దుస్తులు అందించారు.సోమవారం మండలం లో పెద పులుగు వారి పాలెం లో జరిగిన అగ్ని ప్రమాదస్తులకు పులుగు సులోచన కుటుంబానికి కర్లపాలెం రెడ్ క్రాస్ సొసైటీ వారు చేయూతనిచ్చారు . రెడ్ క్రాస్ తరఫునుంచి వంట సామాగ్రి కిట్టును, బొంత సామ్యూల్ త్యాగరాజ్ సహకారంతో దుస్తులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారుఈ సందర్భంగా కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీస్ రావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వము తో పాటు ఆపదలో ఉన్న వారికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహాయం చేయాలని ఆయన కోరారు. ఈ సహాయాన్ని బాపట్ల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బి నారాయణ బట్టు సలహా పై అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మందపాటి పరమానంద కుమార్, కోశాధికారి బుర్ల రాజేష్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర రెడ్డి, వై వి నారాయణ, శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు సముద్రాల రెడ్డి. చలపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆరోగ్య సంజీవని ముఖ్యమంత్రి సహాయనిధి - ఆనందబాబు



భట్టిప్రోలు వినుకొండ వార్త: పేద్ద ప్రజల ఆరోగ్య సంజీవని ముఖ్యమంత్రి సహాయనిధి అని మాజీ మంత్రి వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండల పరిధిలో ఇటీవల వైద్య చికిత్సలు చేయించుకున్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అందిన సహాయక బ్యాంకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చుండూరు గ్రామం లోఉయ్యూరు నాగమల్లేశ్వరి 25,437/-,గుమ్మడి నాగలక్ష్మి 20,795/-,ఏటుకూరి జయనందం 7,776/-, మోదుకూరు గ్రామంలో భీమవరపు బ్రహ్మారెడ్డి 37,114/-, తమ్మా చంద్రశేఖరరెడ్డి 8,687/-,పెనుగుదురుపాడు గ్రామంలోదేవరకొండ ఏడుకొండలు 25,905 /-, వేజెండ్ల సాంబశివరావు 62,038 /-,వలివేరు గ్రామంలో ఆరమల్ల వీరారెడ్డి 46,051 /-, గానేపల్లి ప్రజ్ఞశ్రీ 37,627 /-,ఎడ్లపల్లి గ్రామం వల్లేపు కోటేశ్వరమ్మ 25,541 /-,అలపాడు గ్రామంలో గోగరాజు బాలభాస్కర్ 34,228 /- లకుమొత్తం 3,31,199/- మంజూరు చేసి ఉన్నారు.హో మంజూరు అయిన మొత్తాన్ని వారికి,వారి కుటుంబ సభ్యులకుహో చెక్కు రూపంలో నక్కా ఆనంద బాబు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేద ప్రజల ఆరోగ్యం, చిన్నారుల విద్య, రైతన్నల శ్రేయస్సు లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. అంతేకాకుండా సూపర్ సిక్స్ పథకాల ద్వారా మహిళలకు ఉచిత బస్సు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ ల పంపిణీని అమలు చేయడం జరుగుతుందన్నారు. విజన్ ఉన్న నాయకుడిగా చంద్రబాబు భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే యువ నేతగా లోకేష్ రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం పూర్తి ప్రజాభిమానాన్ని కూడగట్టుకుని అధికారంలో కొనసాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ వాసవి విజ్ఞానజ్యోతి...ఆధ్వర్యంలో స్కాలర్ షిప్స్ పంపిణీ..






సత్తెనపల్లి (వి.ఎన్. కె. వార్త)....శ్రీ వాసవి విజ్ఞానజ్యోతి వార్షిక స్కాలర్షిప్స్ పంపిణీ కార్యక్రమం స్థానిక వాసవీ గార్డెన్స్ లో జరిగింది. ఈ సమావేశానికి విశ్రాంత ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వెలుగూరి సుబ్బారాయుడు అధ్యక్షత వహించారు. శ్రీ ఆర్యవైశ్య చలివేంద్రం మాజీ అధ్యక్షులు కొత్త లక్ష్మయ్య జ్యోతి ప్రజ్వలనతో సభ ప్రారంభమైంది. ఆహ్వానితులకు రాఘవేంద్ర బాలకుటీర్ ప్రిన్సిపల్ ఎం. గీతాంజలి స్వాగతం పలుకుతూ... వారిని వేదిక పైకి ఆహ్వానించారు. సంస్థ ఏర్పాటు నుంచి ఇప్పటివరకూ చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించి, భవిష్యత్లో మరింత మంది దాతలు ముందుకు వస్తే స్కాలర్షిప్పుల మొత్తాన్ని మరింత పెంచుతామని అధ్యక్షుడు యేలూరి పద్మాకర మురళీకృష్ణ తెలిపారు. గత సంవత్సరం 2024 వరకూ 209 మంది విద్యార్థులకు రూ.8,71,000ను స్కాలర్షిప్పులుగా అందించామని కార్యదర్శి జమిలి రాధాకృష్ణ తెలిపారు. ఈ సంవత్సరం 45 మంది విద్యార్థులకు రూ.1,76,000 అందిస్తున్నామన్నారు.సన్మాన గ్రహీతలు ప్రముఖ ప్రసూతి వైద్యురాలు షకీలా శ్రీధర్ (సత్తెనపల్లి), సమాజ సేవకులు తటవర్తి రాంబాబు (అమరావతి), ప్రముఖ విద్యావేత్త ఎం.పి వెంకట్రావు (భట్టిప్రోలు), గోశాల అధునీకరణకు శ్రీకారం చుట్టిన శింగరి మధుసూదన రావు (సత్తెనపల్లి) లను ఘనంగా సత్కరించటం జరిగింది. వీరికి పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన యూనియన్ బ్యాంక్ సబ్-మేనేజర్ గుర్రం ఉదయశంకర్ స్కాలర్ షిప్పులు పొందిన వారిని అభినందించారు. వీరు భవిష్యత్తులో అర్జనపరులైన తర్వాత పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు జవ్వాజి రామమోహన రావు, కొర్రప్రోలు బదరీ నారాయణ, తూనుగుంట్ల ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు. కుమారి వాణీ వందన సమర్పణతో సభా కార్యక్రమాలు ముగిశాయి.

# కళ్లతో అభినయం చేతికి ఎముకలేని దాన గుణం సావిత్రి సొంతం

## ఘంటసాల కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు శిఖా శాంసన్



క్రోసూరు ( వి. ఎ న్. కే. వార్త )తన కళ్ళతోనే భావాన్ని పలికించగలిగిన అద్భుతమైన నటనా కౌశలము సొంతం చేసుకున్న నటీమని, తమిళుల చేత నడిగర్ తిలకం అని పిలిపించుకున్న చలనచిత్ర నటి కళాభినేత్రి సావిత్రి అని ఘంటసాల కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు శిఖా శాంసన్ అన్నారు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం క్రోసూరు అమరావతి బస్టాండ్ లోని ప్రయాణికుల ప్రాంగణంలో కళా సమితి ఆధ్వర్యంలో మహానటి సావిత్రి 90 వ జయంతి సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సావిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా మహానటి సావిత్రి జీవిత విశేషాలను శాంసన్ వివరిస్తూ 16 అణాల తెలుగు నటి అంటూ చిన్ననాడే అగ్రతారగా వెలిగిన సావిత్రి గొప్పతనం నట్టంతో మాత్రమే కాదు, ఆకాశమంత గొప్ప మనస్తత్వం ఆమెకు మాత్రమే సొంతం అన్నారు దానధర్మాల విషయంలో ఆమె ఎముకలేని చెయ్యి అని సినీ పరిశ్రమ నేటికి గుర్తు చేసుకుంటుంది అన్నారు ఒకసారి నిండుగా నగలతో ప్రధానమంత్రి లాల్ బహుదూర్ శాస్త్రి కలిసేందుకు వెళ్లిన ఆమె, అక్కడే తాను ధరించిన అన్ని నగల్ని ప్రధానమంత్రి సహాయ నిధికి దానం చేయడం ఆమె గొప్ప మనసుకు, ఔదార్యానికి ఉదాహరణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్, పోతుగంటి శ్రీనివాసరావు, షేక్ జానీ భాష, పోతుగంటి లక్ష్మయ్య, బండారు మైసూర్ , నాగరాజు, సింగర్ మస్తాను, షేక్ జముల తదితరులు పాల్గొన్నారు

# మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకుల ముఖ్య సమావేశం..



వినుకొండ ( వి. ఎ న్. కే. వార్త ): ఆంధ్రప్రదేశ్ చీఫ్ విప్,ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు ఆదేశములతో, వినుకొండ మున్సిపల్ చైర్ పర్సన్ సూచనలతో, స్థానిక పురపాలక సంఘ కౌన్సిల్ హాలు నందు సోమవారం కమిషనర్ అధ్యక్షతన నిర్వహించారు. మినరల్ వాటర్ ప్లాంట్స్ నిర్వాహకుల సమావేశంలో కమిషనర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో గల అందరూ మినరల్ వాటర్ ప్లాంట్స్ నిర్వాహకులు పురపాలక సంఘం నుండి మరియు జిల్లా కార్యాలయాల నుండి అనుమతులు తీసుకొని మాత్రమే ప్లాంట్స్ నిర్వహించవలెను, మరియు ఆర్వో ప్లాంట్, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేల వాటర్ క్యాన్సు ను తరచు శుభ్రం చేయడం, వాటర్ క్యాన్స్ అన్నిటికీ మూతలు ఉండేలా చూడడం, ఫిల్టర్ బ్యాక్ వాష్ ను ప్రతి మూడు నెలలకు ఒకసారి మార్చాల్సిందిగా తెలియజేశారు. టిడిఎస్ ను ప్రతి రోజు రిజిస్టర్ నందు నమోదు చేయవలెను మరియు రా వాటర్ టిడిఎస్ ప్రతి రోజూ చెక్ చేసి నమోదు చేయవలెను, మినరల్ వాటర్ టేస్ట్ కోసం కలుపుతున్న రసాయన లిక్విడ్ వలన జీర్ణకోశ సంబంధిత సమస్యలు వస్తున్నందున ఆ లిక్విడ్ ను కలపకుండా చూడవలయును, ప్రతి మూడు నెలలకు ఒకసారి లాబ్ టెస్ట్ రిపోర్ట్స్ ను తప్పని సరిగా మున్సిపల్ కార్యాలయమునకు అందజేయవలెనని, పరిశుభ్రమైన నీటి తో పాటుగా కాల్షియం, పొటాసియం, తదితర ఖనిజ లవణాలను తగు మోతాదులో కలిగి ఉన్న నీటిని మాత్రమే వినియోగ దారులకు అందించవలెనని, పైన తెలిపిన అన్ని నియమాల ను వారి యొక్క ప్లాంట్ వద్ద బోర్డు నందు ప్రదర్శించాలని తెలియజేశారు, ప్రజలందరూ అనుమతులు ఉన్న వారివద్ద నుండి మాత్రమే మినరల్ వాటర్ కొనుగోలు చేయవలసినదిగా సూచించారు. మున్సిపల్ సిబ్బంది తరచు వాటర్ ప్లాంట్స్ తనిఖీ చేసి అట్లు నిబంధనలు పాటించని వారి యొక్క ప్లాంట్స్ ను మూసి వేయుదురని హెచ్చరించారు. సమావేశములో శానిటరీ ఇన్స్పెక్టర్, షేక్ ఇస్మాయిల్, అసిస్టెంట్ ఇంజనీర్ ఆదినారాయణ, సానిటరీ సెక్రటరీలు, మరియు మేస్త్రులు,పట్టణంలోని మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ కార్యక్రమాలపై సమీక్ష

వినుకొండ (వి. ఎ న్. కే. వార్త): సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న అంతర్జాతీయ రోటరీ సంస్థ లో యువత భాగస్వామ్యం పెంచేందుకు కృషి చేయాలని రోటరీ క్లబ్ 3150 జిల్లా గవర్నర్ డా .ఎస్.వి రాంప్ర సాద్ అన్నారు. అధికారిక పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం వినుకొండ వచ్చారు. వినుకొండ కారంపూడి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో రోటరీక్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ అధ్య క్షుడు యేరువ వెంకటనారా యణ అధ్యక్షతన సభలో డా .రాంప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సేవా కార్యక్ర మాల్లో భాగంగా తొలుత ఎన్నెస్పీ కాలనీలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో దాత గంగినేని రామయ్య రోటరీక్లబ్ సంయుక్తంగా సుమారు రూ.3లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. నూజండ్ల మండలం తెల్లబాడు. పాఠశాలకు ఫ్యాన్ లు పంపిణీ చేశారు. నూతన సంవత్సరం 2026 డైరీ, క్యాలెండర్ ఆవిష్క రించారు. అసిస్టెంట్ గవర్నర్ జె. మురళి, ఏపీ రీజియన్ గవర్నర్ ఎయిడీ పి. రమేష్, వినుకొండ క్లబ్ కార్యదర్శి ఎస్కే బాజీ, ఆర్థిక కార్య దర్శి పొత్తూరి నవీన్ సుధాకర్ , వివిధ విభాగాల జోనల్ చైర్మన్ లు ఆలా శ్రీనివాసరావు , చిరుమామిళ్ళ కోటేశ్వరరావు , ముత్తినేని గిరిబాబు క్లబ్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు పాల్గొన్నారు. అతిథులకు స్వాగతం పలుకుతూ చిన్నారి టి. వైష్ణవి సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది. పుట్టిన రోజు జరుపుకుంటున్న తిరుపతి రాయుడు అనే క్లబ్ సభ్యునిచే గవర్నర్ కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.






# పల్నాడు జిల్లా వార్తలు

## సత్తెనపల్లి శ్రీ వాసవి యువ శక్తి ఆధ్వర్యంలో నాలుగోసారి గోసేవా ఉత్సవం...!!

సత్తెనపల్లి (వి.ఎన్. కె. వార్త)....సత్తెనపల్లి శ్రీ వాసవి యువ శక్తి ఆధ్వర్యంలో నాలుగోసారి గోసేవా ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో నిర్వాహకులు గోశాలలోని శివలింగానికి పూజలు చేశారు. అనంతరం గోపూజ పూర్తయ్యాక గోసేవ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... గోసేవ కార్యక్రమాన్ని ప్రతి నెల తొలి ఆదివారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి బోండా వెంకటేశ్వరరావు, బోండా రామాంజనేయులు, బోండా వాసు, బోండా నరేష్ ఆర్థిక సహకారం అందించారు. గోశాల అధ్యక్షులు పెండ్యాల మల్లేశ్వరరావు గారు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. యువ శక్తి సభ్యులు కొల్లిపర నరసింహారావు,జవ్వాజీ సుబ్బారావు, కుకుట్ల రాదాకృష్ణ,కొత్త రామకృష్ణ, లఘువరపు రమేష్, బి రంజిత్,కాకరపత్తి సుబ్రహ్మణ్యం, జి. మోహన్,రాఘవ, పుల్లారావు, సిహెచ్ అనిల్ పాల్గొన్నారు.



## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యూనియన్ నూతన కార్యవర్గ ప్రమాణం..!!




సత్తెనపల్లి (వి.ఎన్. కె. వార్త).... సత్తెనపల్లి పట్టణం మాడా కళ్యాణ మండపం నందు ఏర్పాటుచేసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యూనియన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. రెడ్ క్రాస్ వారు ఏర్పాటుచేసిన పేదలకు ఉచిత దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వార్డు నాయకులు, పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

వినుకొండ ( వి. ఎ న్. కే. వార్త ): చిలకలూరిపేట వద్ద ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన %B.Tech% విద్యార్థులు యశ్వంత్ సాయి, వాసు కుటుంబ సభ్యులను ప్రభుత్వ చీఫ్ విప్జీవీ ఆంజనేయులు పరామర్శించారు. వినుకొండ నియోజక




✓వర్గం, నూజెండ్ల మండలం, ములకలూరు గ్రామం ఇళ్ల వద్దకు జీవీ వెళ్లి సోమవారం కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ దురదృష్టకర సంఘటన పట్ల తన విచారం తెలియజేశారు. జనసేన నాయకులు నాగశ్రీను రాయల్ ,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీయూ పల్నాడు జిల్లా సీపీఎస్ కన్వీనర్ గా “విజయప్రసాద్”...!!

సత్తెనపల్లి (వి.ఎన్.కె.వార్త)....ఎస్టీయూ పల్నాడు జిల్లా సీపీఎస్ కన్వీనర్ గా జెల్ది విజయప్రసాద్ ఎన్నికయ్యారు. సత్తెనపల్లి మండలం, కంకణా లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జెల్ది విజయప్రసాద్ ను, జిల్లా కేంద్రమైన నరసరావుపేట ఎస్ ఎస్ ఎన్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఎస్ టి యు జిల్లా



వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విజయప్రసాద్ మాట్లాడుతూ... ఎస్ టి యు ఆధ్వర్యంలో ఓ పి ఎస్ సాధన కోసం జరుగుతున్న ఉద్యమాలు జయప్రదం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన సిహెచ్. జోసెఫ్ సుధీర్ బాబుకి, జిల్లా అధ్యక్షులు ఎల్. వి. రామిరెడ్డి కి ధన్యవాదములు తెలియచేశారు.

## జీడిసిసి బ్యాంక్ ఆవరణలో మోకాళ్ళపై నిరసన

వినుకొండ ( వి. ఎ న్. కే. వార్త ): రాష్ట్ర వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగుల ఐక్యవేదిక (జేఏసీ) పిలుపుమేరకు ఉద్యోగుల డిమాండ్స్ నెరవేర్చుటకు ఆందోళన కార్యక్రమాలులలో భాగంగా ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచీల యందు సదరు బ్రాంచ్ పరిధిలోని సహకార సంఘాల సీఈవోలు మరియు సిబ్బంది వారి న్యాయమైన కోరికలు సాధించుకొనుటకు బస్టాండ్ దగ్గరలో గల జీడిసిసి బ్యాంక్ ఆవరణలో ధర్నా చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా కారుమంచి పిఎసిఎస్



సీఈవో మరియు ప్రాథమిక సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వై వి నారాయణ మాట్లాడుతూ 2019, 2024 సంబంధించి వేదన సవరణ చేయాలని, జీవో నెంబర్ 36 ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఎటువంటి నిబంధనలు లేకుండా జీతభత్యాలు ఇవ్వాలని, 2019 తరువాత చేరిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేసి ఉన్నారు. ఈ కార్యక్రమంలో కారుమంచి పిఎసిఎస్ సీఈవో మరియు ప్రాథమిక సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వై వి నారాయణ, పాల్గొని డిమాండ్ చేశారు పల్నాడు జిల్లా యూనియన్ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి పోకా కోటేశ్వరరావు , ఉమ్మడి గుంటూరు జిల్లా యూనియన్ ఉపాధ్యక్షులు జాలాది నాగ ప్రసాద్ మరియు వినుకొండ బ్రాంచ్ పరిధిలోని ఇతర సీఈవోలు మరియు సిబ్బంది ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి ధర్నాకి మద్దతుగా మాజీ విశ్రాంత ఉద్యోగి మాజీ రాష్ట్ర ప్రాథమిక సంఘాల యూనియన్ కార్యదర్శి ప్రేమనాథ్ ప్రకాష్ పాల్గొన్నారు.


## పెద్దల క్రిస్మస్ వేడుకలు

వినుకొండ ( వి. ఎ న్. కే. వార్త ): వినుకొండ పట్టణం ఇమ్మానుయేల్ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో పెద్దల క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ బాప్టిస్ట్ ఫీల్డ్ పాస్టర్స్ కి వినుకొండ స్థానిక సంఘకాపరి రెవ స్పర్జన్ కుమార్ మరియు సంఘ అధ్యక్షులు చాట్ల రామయ్య ఆధ్వర్యంలో చిరు సత్కారంఅర్పించారు .పాస్టర్స్ కి క్రిస్మస్ సందర్భంగా వినుకొండ బాప్టిస్ట్ చర్చ్ లో బాప్టిస్ట్ సంఘాలలో పని చేస్తున్న సంఘ కాపారులకు దాదాపు 25మందికి గూడూరి జాకబ్ గారి జ్ఞాపకార్థం చిరు కనుక గా నూతన వస్త్రాలను వారి కుటుంబ సభ్యులు, గూడూరి జయలీల, గోపినాథ్ నవమణి, డేవిడ్ మిల్కాజ్యోతి, నవీన్ రత్న,పవన్, అందించడం జరిగింది.కార్యక్రమంలో సంఘ సెక్రటరీ ఆశీ వందనం,ట్రెజరర్ సునీల్ కుమార్, వైస్ సెక్రటరీ వినోద్ కుమార్,వైస్ ప్రెసిడెంట్ నాగస్వామి, సంఘాస్తులు మరియు తదితరులు పాల్గొన్నారు.




# వైభవంగా శ్రీ కోదండ రాముని కళ్యాణ మహోత్సవం







వినుకొండ ( వి. ఎ న్. కే. వార్త ): వినుకొండలో చోళరాజులచే నిర్మితమైన ప్రఖ్యాత పుణ్యక్షేత్రం శ్రీ కోదండ రామాలయంలోప్రతినెలా స్వామివారి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్ర పుణ్యదినాన జరుగుచున్న కళ్యాణోత్సవాలలో భాగంగా ఈరోజు అభిషేక కార్యక్రమాన్ని మరియు శ్రీ సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ అనువంశిక అర్చకులు నారాయణన్ రామ్మోహన్ ఆచార్యులు నిర్వహణలో నారాయణం శశాంక్, నారాయణం జయచందు, శ్రీకాంత్ ఆచార్యులు వైఖానస సంప్రదాయంలో కళ్యాణం జరిపించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర వెటర్నరీ చైర్మన్ పారా వెంకట లక్ష్మయ్య మరియు రాయలసీమకు చెందిన %NDA% టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసరెడ్డి, సాఫ్ట్వేర్ నిపుణులు, వ్యాపారి చెన్ను రమేష్ హాజరై స్వామివారికి తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతటి గొప్ప పురాతన క్షేత్రం వినుకొండలో ఉండటం వినుకొండ ప్రజల అదృష్టమని, త్వరలో అభివృద్ధి పనులు పూర్తయి ఒక గొప్పవేదిక కూడా నిర్మాణమై, ఆ వేదిక ద్వారా అనేక ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు, ధర్మ ప్రచారం జరగాలని అభిలషించారు. ఈ కార్యక్రమాలకు తమవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు.

అభివృద్ధి కమిటీ సభ్యులు భాగవతుల రవికుమార్, గజవల్లి నాగపవన్ కుమార్, యడవల్లి శ్రీనివాసశర్మ మరియు దేవస్థాన EO సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో అనేకమంది భక్తులు పాల్గొన్న ఈ కళ్యాణ కార్యక్రమంలో భక్తులందరికీ స్వామివారి కళ్యాణ అక్షతలు, ప్రసాదం మరియు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో దంపతులు శ్రీనివాసరావు-చంద్రలేఖ, శ్రీకాంత్-లావణ్య, మోహన్ సాయి-దుర్గా సాయిప్రియ వారి కుటుంబ సభ్యులు మరియు శ్రీ ముసిరిక వెంకటరెడ్డి, భవనాసి సాంబశివరావు, అమర్నాథ్, కొల్లిపర సుబ్రహ్మణ్యం, గోనుగుంట్ల గంటారావు, కొలిశెట్టి సుబ్బారావు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

## క్రోసూరు పోలీస్ స్టేషన్ ను సందర్శించిన సత్తెనపల్లి డివిజన్ పోలీసు అధికారి హనుమంతరావు

క్రో సూ రు వి ఎన్ కే వార్త సత్తెనపల్లి డివిజన్ పోలీసు అధికారి హనుమంతరావు క్రోసూరు పోలీస్ స్టేషన్ మరియు పెదకురపాడు సర్కిల్ కార్యాలయంలను సందర్శించి వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు, స్టేషన్‌కు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, స్టేషన్ పరిసరాల శుభ్రత, భద్రతా చర్యలు, వసతులు తదితర అంశాలను సుదీర్ఘంగా పరిశీలించారు. అలాగే సర్కిల్ కార్యాలయంలోని పరిపాలనా విధులు, రికార్డుల సంకలన విధానం, సిబ్బంది పనితీరుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న యు ఐ కేసులను వీలైనంత త్వరగా తగ్గించాలని, అన్ని స్టేషన్ రికార్డులను ఎలాంటి ఆలస్యం లేకుండా అప్డేట్ చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పనిచేయాలని ఇన్‌స్పెక్టర్ మరియు సబ్-ఇన్‌స్పెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే నేర నియంత్రణ, ప్రజా భద్రత, బాధితులకు త్వరిత న్యాయం అందే విధంగా దర్యాప్తు వేగంగా పూర్తిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిష్ఠ, పారదర్శకత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా క్రోసూరు మండలంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులపై నిరంతరం నిఘా విధించాలని సత్తెనపల్లి డివిజన్ పోలీసు అధికారి హనుమంతరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రోసూరు పోలీస్ స్టేషన్ లో వార్షిక తనిఖీలు కొరకు వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనడం వలన ఎదురయ్యే చట్టపరమైన శిక్షలు, వ్యక్తిగత భవిష్యత్తుపై వచ్చే ప్రతికూల ప్రభావాలు, కుటుంబాలపై ఏర్పడే మానసిక ఆర్థిక భారం గురించి వివరించారు. రౌడీ షీటర్లు జీవితా మార్పుకు అవకాశాన్ని ఉపయోగించుకుని, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవరచు కోవాలని సూచించారు.

# రెండో విడత 24 షెడ్ల నిర్మాణాల మంజూరు



క్రోసూరు వి ఎన్ కే వార్త కూటమి ప్రభుత్వం పశుపోషకులకు అండగా నిలుస్తుంది. ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల షెడ్లు నిర్మించుకోవటానికి ఆర్థికసాయం చేస్తుంది. పశు సంవర్ధకశాఖ, డ్వామా ఆధ్వర్యంలో క్రోసూరు మండలం లో మొదటి విడతలో 24 షెడ్లకు, రెండో విడతలో మరో 24 షెడ్లకు నిధులు మంజూరై గోకులాలు నిర్మించాలని నిర్ణయించారు. లబ్ధిదారులు పది శాతం నిధులు చెల్లిస్తే మిగిలిన 90 శాతం ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేస్తారు. పశువుల కోసం షెడ్లు నిర్మించుకోవ టం సన్నకారు రైతులకు భారంగా మారిన సమయంలో ప్రభుత్వం సాయం చేస్తుండటం తో రైతులకు ఆర్థిక వెసులుబాటు లభించింది. పశువులకు ఎండ, వానల నుంచి రక్షణ లభిస్తుంది. పాడి ప్రగతి సాధించా లనే లక్ష్యంతో మినీ గోకులాల నిర్మాణంతో పశువుల షెడ్ల నిర్మాణా నికి 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ళ షెడ్లకు 70 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. మొదటి విడత యూనిట్కు గరిష్టంగా రూ.2.07 లక్షలు లబ్ధిదారు లకు లబ్ధి చేకూరింది. రెండో విడతలో రూ.లక్షా౮0 వేలు గరిష్టంగా లబ్ధి చేకూరుతుంది. మండలంలో ఇప్పటివరకు సుమారు 30షెడ్ల నిర్మాణాలు పూర్త య్యాయి. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత మొదటి విడత మంజూరు చేసిన షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రెండో విడత నిర్మా ణాలు చురుగా సాగుతున్నాయి.

**'ఉపాధి'తో పశువులకు నీడ**

**రెండో విడత లబ్ధిదారుల ఎంపికపై కసరతు**

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునంది స్తోంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువుల షెడ్లు నిర్మించుకునేందుకు సాయమందిస్తోంది. డ్వామా, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో తొలి విడత కొన్ని నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన వాటితో కలిపి రెండో విడతలో 24 షెడ్లు నిర్మించాలని నిర్ణయించారు. గ్రామ పంచాయతీకి రెండు చొప్పున లబ్ధిదారులు ఎంపికకు తాజాగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. పశువుల షెడ్ల నిర్మాణానికి 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్లకు 70 శాతం రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. యూనిట్ గరిష్ఠంగా రూ.60,900 నుంచి రూ. 2,07,000 వరకు పెంపకందార్లకు లబ్ధిచేకూర నుంది. ఇందులో 90శాతం పశువుల షెడ్లకే ప్రాధాన్యం కల్పిస్తున్నారు. గతంలో 'గోకులం' పేరుతో అమలు చేసిన పథకాన్ని వైకాపా పాల నలో నీరుగార్చింది. షెడ్లు నిర్మించిన చాలా మందికి రాయితీ సొమ్ము ఇవ్వ కుండా ఇబ్బందులకు గురిచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఏడాది మంజూరు చేసిన షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసి మలి విడతకోసం ప్రతిపాదనలను సిద్ధం చేసింది. షెడ్లలో పశు మూత్రం కోసం ట్యాంకు, నీళ్ల తొట్టె, నామఫలకం తప్పని సరిగా ఉండాలి. ఇవి పూర్తి చేయని వారికి సుమారు రూ. 25 వేలు బిల్లులో కోత పడుతుంది.

# వైసిపి జిల్లా కార్యదర్శిగా నియమితులైన అల్లాభక్షును సన్మానించిన నియోజకవర్గ వైసిపి నాయకులు నిమ్మా విజయసాగర్ బాబు

అమరావతి వి ఎన్ కే వార్త : మండల కేంద్రమైన అమరావతికి చెందిన షేక్ అల్లాభక్షు మైనార్టీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా మండల కేంద్రమైన అమరావతి లో పెదకూరపాడు నియోజకవర్గ వైసిపి నాయకులు నిమ్మా విజయసాగర్ బాబు సోమవారం తన నివాసంలో అల్లాభక్షు ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ సాగర్ బాబు అల్లాభక్షు తో మాట్లాడుతూ వైసిపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నిమ్మా రాము, రామిశెట్టి నాగేశ్వరరావు, ఆకుల రాంబాబు,షేక్ మస్తాన్ వలి, షేక్ యాసిన్, షేక్ మమ్ముసా తో పాటు పలువురు వైసీపీ నాయకులు ఉన్నారు.

# పల్నాడు జిల్లా వార్తలు

## నూజెండ్ల మండలంలో ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సంబరాలు

వినుకొండ ( వి. ఎ న్. కే. వార్త ): నూజెండ్ల మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో ఉన్న ఎం.పి.పి.ఎస్. పాఠశాల ఆవరణ నందు గల భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖాధికారి నలబ్రోలు రవిచంద్ర హాజరై దివ్యాంగుల హక్కులు, వారి సాధికారత మరియు సమాన అవకాశాల కల్పనపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగుల పాత్ర ఎంతో ముఖ్యమని వారికి అవసరమైన సౌకర్యాలు, విద్య, ఉ



పాధి అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని మరియు ప్రతి ఒక్కరూ దివ్యాంగుల పట్ల సానుభూతితో కాక సమానత్వ భావంతో చూడాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణా రావు మాట్లాడుతూ, దివ్యాంగులు తమలో ఉన్న ప్రతిభను వెలికి తీసుకొని అన్ని రంగాల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు రంగారావు, యలమంద రావు మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం, %MRC% సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా టిడిపి పార్టీ యువ నాయకుడు తుమ్మ కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు


అచ్చంపేట వినుకొండ వార్త మండలం తాళ్లచెరువు గ్రామానికి చెందిన టిడిపి పార్టీ యువ నాయకుడు తుమ్మ కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఫోన్ ద్వారా తుమ్మ కిషోర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ పార్టీ అధ్యక్షుడు జంగం



చెవిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు తుమ్మ కిషోర్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి తినిపించారు మరియు టిడిపి పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు తుమ్మ మత్యాస్ రెడ్డి కిషోర్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎస్సి యువ నాయకుడు రేపూడి తామస్ అనిల్ టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు కిషోర్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు

## "భుజం" పట్టిన మానవత్వం

అచ్చంపేట వినుకొండ వార్తఅచ్చంపేట గ్రామస్తులైన పున్నా కోటేశ్వరరావు భార్య పున్నా పార్వతి (65) అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ పరిస్థితులు దయనీయంగా ఉండటంతో, అంత్యక్రియలు నిర్వహించడానికి ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో,, వీరి పరిస్థితిని తెలుసుకున్న సామాజిక కార్యకర్త కమల్ సైదా, అచ్చంపేట ఆర్యవైశ్య సంఘం సభ్యులు గుండా రమేష్, ఏలూరి స్వామి, నూతికట్టు శంకర్ గుప్తా, ప్రజాశక్తి విలేఖరి గుంజి రవి, బ్యాటరీ జానీ, జ్యోతి కృష్ణ,



మీరా కమల్ లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అంత్యక్రియల్లో పాల్గొని బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. కష్టాల్లో ఉన్న వారికి తోడుగా నిలిస్తేనే మానవత్వానికి అర్థం ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవాగుణాన్ని అలవర్చుకోవాలని స్థానికులు వీరిని ప్రశంసించారు. అందరూ ఇలాంటి భావనతో ముందుకు వస్తే సమాజంలో మానవత్వం బలోపేతం అవుతుందని ప్రజలు వ్యాఖ్యానించారు.

## విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖిలు,

**అక్రమంగా తరలిస్తున్న పురుగు మందులు స్వాధీనం.**



పల్నాడుజిల్లా(వి. ఎన్. కే. వార్త )జిల్లా లో పలు పట్టణాల్లో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు విజిలెన్స్ అధికారులు పలు ట్రాన్స్ పోర్ట్ కార్యాలయాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇతర పట్టణాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలిస్తున్న పురుగు మందుల బాక్స్ లు స్వాధీనం చేసుకున్నారు. వినుకొండ కు కూడా అక్రమ పురుగు మందులు రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిసిందని, పురుగు మందులు ఎక్కడ నుంచి రవాణా జరుగుతున్నాయో విచారణ చేపడతామని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

## పీఎం శ్రీ పథకంలో ఎంపికైన ఏపీ మోడల్ స్కూల్లో కళా-హస్తకళా ప్రదర్శన

క్రో సూ రు వి ఎన్ కే వార్త కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠంకంగా పీఎం శ్రీ పథకం 7వ దశలో ఏపీ మోడల్ స్కూల్ ఎంపిక కావడం మా పాఠశాలకు గర్వకారణంగా నిలిచిందని ప్రిన్సిపాల్ మేరీ సుజన్ తెలిపారు. ఈ సందర్భంగా పీఎం శ్రీ కార్యక్రమాల్లో భాగంగా పాఠశాల లో కళా మరియు హస్తకళా ప్రదర్శన 'ను ఘనంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు తాము సృజనాత్మకంగా రూపొందించిన చిత్రాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నమూనాలు, వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులు, సంప్రదాయ కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేలా ఈ కార్యక్రమం ఉపయోగపడింది.



ప్రదర్శనను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రారంభించగా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. పీఎం శ్రీ పథకం ద్వారా విద్యార్థులకు నైపుణ్యాధారిత విద్య సృజనాత్మకత, సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు

## సిపిఐ పార్టీ మాజీ అధ్యక్షుడు పున్న కోటేశ్వరరావు సతీమణి మృతి

అచ్చంపేట వినుకొండ వార్త గత 20 సంవత్సరాలుగా సిపిఐ భారత కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తున్న పున్న కోటేశ్వరరావు సతీమణి పున్న పార్వతి 63 అనారోగ్యంతో మండల కేంద్రమైన అచ్చంపేటలో సోమవారం మృతి చెందారు ఈ సందర్భంగా అచ్చంపేట మండల సిపిఐ కార్యదర్శి ఎస్కే మస్తాన్ బుజ్జి అచ్చంపేట గ్రామ శాఖ కార్యదర్శి సంపంగి ఏడుకొండలు మాదిపాడు గ్రామ సిపిఐ శాఖ కార్యదర్శి ఎస్కే సుభాని సిపిఐ నాయకులు ఎస్.కె మీరస బుడే తదితరులు



కోటేశ్వరరావు ఇంటికి వెళ్లి పున్న పార్వతి మృతదేహాన్ని సందర్శించి మృతదేహంపై పూలమాలలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు మృతదేహాన్నికి సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేసిన వారిలో పల్నాడు జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు బైరాపట్నం రామకృష్ణ పెద్దకూరపాడు నియోజవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు తెలిపినవారిలోవున్నారు

## పురుగు మందులు అక్రమ రవాణా పై పోలీసులు కేసు నమోదు




వినుకొండ(వి ఎన్. కే. వార్త )పల్నాడు నుంచి వినుకొండ కు ఆర్టీసీ కార్గో పార్శిల్ కేంద్రం గా పురుగు మందులు అక్రమ రవాణా పై వ్యవసాయ శాఖ అధికారులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన పై ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ ప్రభాకర్ తెలిపారు.

# సంక్రాంతి నుంచి అన్ని సేవలూ ఆన్ లైన్ లోనేఆర్టీసీలో సేవలు మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకోండిడ్రోన్ సేవలు మరింత విస్తృతపరచాలి

**ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు**







అమరావతి(వి. ఎన్. కే. వార్త) వచ్చే సంక్రాంతి నుంచి రాష్ట్రంలో పౌరులకు అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ దిశగా ఆయా శాఖలన్నీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీజీఎస్ పై సీఎం సోమవారం సమీక్ష నిర్వహించారు. సంక్రాంతి నుంచి ప్రజలకు అన్ని సేవలు ఆన్ లైన్‌లోనే అందజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో సేవలు అందించడం ద్వారా ప్రజలకు సేవలు పారదర్శకంగా అందడంతో పాటు వారిలో ప్రభుత్వ పని తీరు పట్ల సంతృప్త స్థాయి పెరుగుతుం దన్నారు. ఇప్పటికీ కొన్ని శాఖలు భౌతికంగానే సేవలందిస్తున్నాయని అలాంటి శాఖలు వెంటనే తమ పంథా మార్చుకుని ప్రజలకు ఆన్‌లైన్‌లో సేవలందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజలకు కావాల్సిన ప్రభుత్వ సేవలన్నీ, ప్రభుత్వ కార్యాలయాలకు తిరగనవసరం లేకుండా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందజేస్తున్నామని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చెప్పారు. రిజిస్ట్రేషన్ల అనంతరం డాక్యుమెంట్లు కొరియర్ ద్వారా నేరుగా సంబంధిత వ్యక్తుల ఇళ్లకే పంపే ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్టీసీ సేవలు మరింత మెరుగయ్యేలా చూడాలన్నారు. బస్టాండు ప్రాంగణం, పరిసరాలు, టాయ్‌లెట్ల వద్ద పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు ఉండాలని సీఎం అన్నారు. డ్రోన్ సేవలు మరింత విస్తృత పరిచాలని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో డ్రోన్ల ఉపయోగం గణనీయంగా పెరుగుతుందన్నారు. పురుగు మందుల వినియోగం తగ్గించేందుకు డ్రోన్లను ఎలా వాడుకోవచ్చోననే అంశంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్యం నిర్వహణ ద్వారా వ్యాధుల వ్యాప్తి లేకుండా చేయవచ్చని తెలిపారు. కొన్ని జిల్లాల్లో కొంతమంది అధికారులు మంచి కార్యక్రమాల్ని అమలు చేస్తున్నారని... అలాగే కొందరు అవలంభించే మంచి పద్ధతులను గుర్తించి మిగిలిన జిల్లాల్లో కూడా అమలయ్యేలా చూడాలని సీఎం సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ విజయానంద్ వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి మానసిక వికలాంగుడు

**మాజీ ఎమ్మెల్యే బ్రతుకంతా అవినీతిమయం**

**ప్రభుత్వ ఆసుపత్రి ప్రతిష్టను దెబ్బతీసేలా మాజీ ఎమ్మెల్యే కుట్ర చేశాడు**

**సమగ్ర దర్యాప్తు చేసి కుట్ర కోణాన్ని ఛేదిస్తాం**

**వైసిపి ఎప్పటికీ అధికారంలోకి రాదు**

**కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఉన్నాయి**

**నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రెస్ మీట్**



నరసరావుపేట, డిసెంబర్ 08:(వి. ఎన్. కే. వార్త) నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. గోపిరెడ్డిని మానసిక రోగి మరియు మానసిక వికలాంగుడిగా అభివర్ణించిన అరవింద బాబు, అతనిపై అవినీతి ఆరోపణలు గుప్పించారు. ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రి లో జరిగిన సర్జికల్ బ్లేడు సంఘటనను కుట్రగా పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రి పిపి యూనిట్‌లో ఒక మహిళకు సర్జరీ చేసిన సమయంలో తొడలో సర్జికల్ బ్లేడు మిగిలిపోయినట్లు ఆరోపణలు రావడంతో డాక్టర్ మరియు సహాయకుడిని సస్పెండ్ చేశారు. ఈ సంఘటనపై మాట్లాడుతూ అరవింద బాబు “ఇందులో కుట్ర కోణం దాగి ఉంది. ఆ మహిళ భర్త గత వైసీపీ ప్రభుత్వంలో వాలంటీర్‌గా పనిచేశారు. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కావాలని హాస్పిటల్‌పై అభియోగాలు మోపటానికి ఆమెను అడ్డం పెట్టుకుని నిందలు మోపారని ఆరోపించారు. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చారుతనపై గోపిరెడ్డి చేసిన అవినీతి ఆరోపణలను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే అరవింద బాబు “నేను రాజకీయాల్లోకి సేవ చేయడానికి వచ్చాను, ఆస్తులుసంపాదించుకోవటానికి కాదు” అని అన్నారు. గోపిరెడ్డి గత ప్రభుత్వ హయాంలో కరోనా కాలంలో ఇంజక్షన్లను అక్రమంగా అమ్మి 60 కోట్లు సంపాదించాడని ఆరోపించారు. అంతేకాకుండా, జనరిక్ మెడికల్ షాపుల నుంచి డబ్బులు వసూలు చేయడం, ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పేషెంట్లను తన సొంత హాస్పిటల్‌కు తరలించి కోట్లు సంపాదిఒచడం, హాస్పటల్ సిబ్బందిని, డాక్టర్లను ట్రాన్స్ఫర్లు చేయించటం వంటి ఆరోపణలు చేశారు. “కూటమి ప్రభుత్వంలో అటువంటి దుర్మార్గపు పనులు లేవు” అని స్పష్టం చేశారు. గోపిరెడ్డి గురించి మరిన్ని వివరాలు పేర్కొంటూ గత ఎన్నికల సమయంలో వైసీపీలోనే మూడం తులు నాయకులు, కార్యకర్తలు గోపిరెడ్డికి టికెట్ ఇవ్వవద్దని జగన్మోహన్ రెడ్డికి మొరపెట్టుకున్నారు. అధికారం పోయినా అతని బుద్ధి మారలేదు అని అన్నారు. శానిటేషన్ విషయంలో మాట్లాడుతూ “ప్రతిరోజు శానిటేషన్ పనులను సమీక్షిస్తూ, సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నాం. నరసరావుపేట మున్సిపాలిటీ శుభ్రంగా ఉంది అని చెప్పారు. కోడెల ప్రసాద్ రావు స్టేడియాన్ని పరిశుభ్రంగా చేశామని, వాష్ రూములు కట్టించామని, క్రీడాకారులు ఆనందంగా ఉన్నారని తెలిపారు. “వైసీపీ ఎప్పటికీ అధికారం చేపట్టదు, నరసరావుపేటలో గోపిరెడ్డి ఎప్పటికీ ఎమ్మెల్యే కాలేడు” అని ధీమాగా చెప్పారు. సమావేశంలో నాయకుడు గూడూరు శేఖర్, రామకృష్ణ లు మాట్లాడుతూ గోపిరెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. “గోపిరెడ్డి అవినీతి గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉంది. మా ఎమ్మెల్యే అవినీతి చేశాడని చెప్తుంటే ప్రజలు నవ్వుతున్నారు” అని అన్నారు. సదరన్ సర్టిఫికెట్ ల జారిలో రూ.వేలల్లో అక్రమ వసూళ్లు చేసిన చరిత్ర వైసీపీ ది. మా పై బురద జల్లాలనుకోవటం దుర్మార్గం. గతంలో నెలకు 150 డెలివరీ లు ఉంటే మా ప్రభుత్వంలో డెలివరీలు నెలకు 400 వరకు పెరిగాయి అని చెప్పారు. గోపిరెడ్డి అవినీతి చిట్టాను విప్పుతూ “హాస్పిటల్ ముందు నాగేశ్వరావు అనే వ్యక్తిని పెట్టుకుని నెలకు 2 లక్షలు వసూలు చేశాడు. స్కానింగ్‌లను అశ్రిత సాయి స్కాన్ సెంటర్‌కు పంపించి నెలకు 5 లక్షలు సంపాది ఒచాడు. కరోనా సమయంలో బ్లీచింగ్ పౌడర్ బిల్లులతో 30 లక్షలు దోచుకున్నాడు” అని ఆరోపించారు. గర్భిణీలను తన అనుచరుడు శేషిరెడ్డి హాస్పిటల్‌కు తరలించడం, ప్రభుత్వ పరికరాలను సొంత హాస్పిటల్‌కు తీసుకెళ్లడం వంటి ఆరోపణలు చేశారు. “గోపిరెడ్డి 2000 కోట్లు సంపాదించాడు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ గోపిరెడ్డి” అని వ్యాఖ్యానించారు. సమయం వచ్చినప్పుడు మరిన్ని వివరాలుబయటపెడతామని, నోరుఅదుపులోపెట్టుకోవాలని హెచ్చరించారు.

# స్వచ్ఛ సేవలకు.. ఈ-ఆటోలు

కుప్పం : స్వచ్ఛ కుప్పం సాధన దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇళ్ల నుంచి చెత్త, వ్యర్థాలను సేకరించనున్నారు. దీనిలో భాగంగా ఈ ఆటోలను పంపిణీ చేశారు.

**గత పాలనలో మూలకు..**

పారిశుధ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇళ్ల నుంచి నేరుగా చెత్త, వ్యర్థాలు సేకరించాలని గతంలోనే ప్రభుత్వం ఆలోచన చేసింది. గత తెదేపా కాలంలో ఎనిమిదేళ్ల క్రితం కుప్పం, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాలకు బ్యాటరీ ఆటోలు సమకూర్చారు. సంపద కేంద్రాలు ఏర్పాటు చేశారు. వైకాపా వచ్చాక ఆటోలు మూలకు చేరాయి. కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని పంచాయతీల్లో వాహనాలు విక్రయించేశారు. తర్వాత మూడు చక్రాల సైకిళ్లు అందజేసినా వినియోగించలేదు.

**‘కడా’ తరపున అందజేత..**

సీఎం చంద్రబాబు ఆదేశాలతో కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థ (కడా) ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలకు ఈ-ఆటోలు 112 సమకూర్చారు. పాత వాహనాలతో పాటు వీటిని వినియోగించనున్నారు. రోజూ సేకరించే చెత్తను కేంద్రానికి తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయనున్నారు. గ్రామాలకు రోజూ ఉదయం వాహనాలు వెళ్లి చెత్త



సేకరిస్తాయని అధికారులు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

**ఇవీ వివరాలు..**

కుప్పం నియోజకవర్గం: మండలాలు: 4

పంచాయతీలు: 97అందజేసిన

ఈ ఆటోలు: 112 (శాంతిపురం- 23, కుప్పం గ్రామీణ- 29, పురపాలిక- 19, రామకుప్పం- 23, గుడుపల్లె- 18 )

# బాపట్ల జిల్లా వార్తలు

## శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ ఆర్థిక చేయూత

కర్లపాలెం(వి.ఎన్.కే వార్త).శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ బాపట్ల ఆధ్వర్యంలో, సోమవారంలో భాగంగా, కర్లపాలెం ఎమ్ వి రాజుపాలెం చెందిన ఒక దివ్యాంగుడి కుటుంబానికి 10 కేజీలు బియ్యం ఫౌండేషన్ అధ్యక్షులు పెనుమెత్సశివాజీ రాజు అందజేసినారు.



ఈ సందర్భంగా శివాజీ రాజు మాట్లాడుతూ, మా వంతు సహాయంగా బియ్యము, రగ్గులు, నిత్యవసర సరుకులు, అనారోగ్యంగా ఉన్నవారికి ఆర్థిక చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంతెన అంజి రాజు, మంతెన సతీష్ కుమార్ రాజు, రాజశేఖర్ ,కృష్ణ కాంతు, వీరాంజనేయులు ,శివకుమార్ పాల్గొన్నారు

## 38లక్షల యం. పి. నిధులతో భట్టిప్రోలు గ్రామ అభివృద్ధి - సాయిబాబా

భట్టిప్రోలు వినుకొండ వార్త: బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ కృషి చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా పేర్కొన్నారు. భట్టిప్రోలు గ్రామములోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూ. 38 లక్షలు యం. పి. నిధులను బాపట్ల యం.పి. తెన్నేటి కృష్ణ ప్రసాద్ మంజూరు చేసినట్లు తెలిపారు. సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద విలేకర్ల సమావేశములో మాట్లాడుతూ భట్టిప్రోలు గ్రామములో కమ్యూనిటీ భవన నిర్మాణమునకు రూ. 15లక్షలు, పంచాయతీ ఆఫీసు దగ్గరలో వంతెన దగ్గర నుండి లూథరపాల్ ఇంటి వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణమునకు



రూ. 13లక్షలు, భట్టిప్రోలు మార్కెట్ వెనుక జెండా చెట్టు బజారుకు సిమెంట్ రోడ్డు నిర్మాణమునకు రూ. 6లక్షలు, అల్లూరు కాల్వకట్ట మీద సిమెంట్ రోడ్డు నిర్మాణమునకు రూ. 4 లక్షలు మంజూరు చేసినట్లు సాయిబాబా పేర్కొన్నారు. ఈ మేరకు సదరు పనులకు టెండర్లు పిలచినట్లు, త్వరలో వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ ల ఆధ్వర్యంలో త్వరలో శంఖుస్థాపన చేయించి, పనులు ప్రారభించ నున్నట్లు ఆయన తెలిపారు. భట్టిప్రోలు గ్రామ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిన బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ కు సాయిబాబా కృతజ్ఞతలు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, గోనె సంచులు ఉచితంగా ఏర్పాటుపై అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్....



బాపట్ల:వినుకొండ వార్త: ధాన్యం విక్రయించే రైతులకు గోనె సంచులు ఉచితంగా ఇవ్వాలని, గోనె సంచులు తెచ్చుకున్న వారికి అధికారులే నగదు చెల్లించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బందితో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ధాన్యం విక్రయించడానికి రైతులే స్వయంగా గోనె సంచులు తెచ్చుకుంటే ప్రభుత్వం నగదు చెల్లిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. వరి పంటకు సులభతరంగా గోనె సంచులు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రైతులు స్వయంగా గోనె సంచులు తెచ్చుకుంటే ఒక్కొక్క సంచికి రూ. 4.74లు చొప్పున ప్రభుత్వమే నగదు ఇస్తుందన్నారు. గోనెసంచుల గురించి రైతులు చింతించాల్సిన అవసరం లేదన్నారు. బాపట్ల జిల్లాలో ఇప్పటివరకు 2,546 మంది రైతుల నుంచి 15,605 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. 75 కేజీల పరిమాణం ఉన్న ఎనిమిది లక్షల గోనె సంచులను రైతు సేవ కేంద్రాలకు పంపామన్నారు. మరో 14.93 లక్షల గోనె సంచులు మిల్లర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు అవసరమైన అన్ని గోనె సంచులు జిల్లాలో ఉన్నాయని వివరించారు. 76 మిల్లులు ధాన్యం కొనుగోలులో పాల్గొంటున్నాయన్నారు. బ్యాంకు పూచికత కింద రూ. 100 కోట్లు మిల్లర్లు చెల్లించాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ. 43 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాయన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని కలెక్టర్ చెప్పారు. ఈ ఈ సమావేశంలో డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి జమీర్ బాషా, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## బాలల సంక్షేమం విద్యా ప్రమాణాల మెరుగుదల కు కృషి చేస్తున్నాం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శ్రీమతి డాక్టర్ రాయపాటి శైలజ







కమిషన్ చైర్‌పర్సన్ శ్రీమతి డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శ్రీమతి డాక్టర్ రాయపాటి శైలజ మంగళవారం పెద్దపాడు లో దామోదరం సంజీవయ్య బాల సదనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులు, వసతి గృహ అధ్యాపకులు చైర్‌పర్సన్‌కు ఘన స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా బాల్యవివాహాల నివారణ అంశంపై విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చైర్‌పర్సన్ విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని పేర్కొన్నారు. తదనంతరం వసతి గృహంలోని డైనింగ్ హాల్, వంటగది, స్టోర్ రూమ్, విద్యార్థుల పడక గదులను పరిశీలించి అందిస్తున్న సదుపాయాలపై సమగ్రంగా ఆరాతీశారు. విద్యార్థులతో ప మాట్లాడి, ప్రభుత్వం అందిస్తున్న వసతులు, భోజనం, చదువు, పాఠశాల వాతావరణం వంటి అంశాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, బాల సదనాల్లో విద్యతో పాటు బాలల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందన్నారు.. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ల గురించి అవగాహన కల్పిస్తూ,పిల్లలు బయటి ప్రపంచంలో ఎలా మెలగాల, అత్యవసర పరిస్థితుల్లో పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి అని అవగాహన కల్పించడం జరుగుతోందని తెలిపారు. బాల సదనం లో వసతుల కల్పన కోసం కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని,పిల్లలు బాగా చదువుకోవాలని, ధైర్యంగా జీవించాలని ఆమె సూచించారు. వసతి గృహ నిర్వహణపై సంబంధిత అధికారులకు తగు సూచనలు చేస్తూ, పిల్లల శ్రేయస్సును ప్రాధాన్యంగా తీసుకుని, బాగా చూసుకోవాలని ఆమె సూచించారు. పొణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ, బాల సదనం లో 48 మంది పిల్లలు ఉన్నారని, వీరికి మెరుగైన వసతులను కల్పించాల్సిన అవసరం ఉందని, వీటిని కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.. బాల్య వివాహాలు చేయకూడదని, ఈ మేరకు తల్లిదండ్రులకు, పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.. సమాజంలో ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా జీవించేలా ఆడపిల్లలకు చైతన్యం తీసుకు రావాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ రోహిణి, ఐసిడిఎస్ పిడి విజయ తదితరులు పాల్గొన్నారు.

# కొండవీడు సమగ్రాభివృద్ధి రాజధాని అమరావతితో పాటు. జాతీయ పర్యాటకానికే గర్వకారణం : ప్రత్తిపాటి

**కొండవీడు ఘాట్ రోడ్డు జాతీయ రహదారికి అనుసంధానింపు, కోట సమగ్రాభివృద్ధి కార్యాచరణపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన మాజీమంత్రి ప్రత్తిపాటి**

**పొగాకు రైతుల బకాయిలు.... పత్తి కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు,**

**మైనారిటీ బాలికల పాఠశాల నిర్మాణంపై ముఖ్యమంత్రితో చర్చించిన ప్రత్తిపాటి**

**సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రత్యేక విజ్ఞప్తి చేసిన ప్రత్తిపాటి**



అమరావతి సచివాలయం( వీ ఎన్ కే వార్త)ఎకో హెరిటేజ్ మరియు టెంపుల్ టూరిజం అభివృద్ధికి అత్యధిక అవకాశమున్న కొండవీడు కోట సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక చొరవ చూపాలని, కోటకు పూర్వవైభవం తీసుకొచ్చి, రాజధాని అమరావతికే గర్వకారణంగా నిలిచే ప్రధాన పర్యాటక ప్రాంతంగా మార్చి, చిలకలూరిపేట ప్రాంత ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింప చేయాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన మాజీమంత్రి నియోజకవర్గ సమస్యలు, పొగాకు రైతుల బకాయిలు... సీసీఐ పత్తి కొనుగోళ్లలో రైతాంగం ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యల్ని ముఖ్యమంత్రికి విన్నవించడంతో పాటు.. కొండవీడు కోట సమగ్రాభివృద్ధి ప్రణాళికకు సంబంధించిన కార్యాచరణ ఆవశ్యకతను వివరించారు. గతంలో రూ. 100 కోట్లతో రూపొందించిన ప్రణాళికల్ని ఇదివరకే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన ప్రత్తిపాటి.. మరోసారి దానిగురించి ఆయనతో ప్రస్తావించారు. ప్రసాద్.. దేఖో అప్నా దేశ్.. స్వదేశీ దర్శన్ వంటి కేంద్రప్రభుత్వ పర్యాటకాభివృద్ధి పథకాల భాగస్వామ్యంతో కొండవీడు కోటను జాతీయస్థాయి పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చవచ్చని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి మార్గం సుగమం చేయాలని ప్రత్తిపాటి ముఖ్యమంత్రిని అభ్యర్థించారు. గతంలో ఇదే అంశంపై తాను కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు ఇచ్చిన వినతిపత్రాన్ని ప్రత్తిపాటి ముఖ్యమంత్రికి అందించారు.

**జాతీయ రహదారితో అనుసంధానంతో. కోట ప్రాశస్త్యం..విశిష్టత పెరుగుతాయి.**

కొండవీడు కోటకు టీడీపీ హయాంలో నిర్మించిన ఘాట్ రోడ్డును చౌడవరం నుంచి జాతీయరహదారికి (ఎన్.హెచ్-16) అనుసంధానించాల్సి ఉందని, మధ్యలో టన్నెల్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని ప్రత్తిపాటి సీఎంకు వివరించారు. కొండవీడు మార్గాన్ని నేరుగా జాతీయ రహదారితో అనుసంధానిస్తే పర్యాటకుల తాకిడి పెరిగి.. కోట ప్రాశస్త్యం.. విశిష్టతపై ప్రజాకర్షణపెరుగుతుందన్నారు. తద్వారా రాష్ట్రంలో మరో ప్రధాన పర్యాటక ప్రాంతంగా కొండవీడుచరిత్రకెక్కుతుందని ప్రత్తిపాటి సీఎంకు తెలియచేశారు. కొండవీడు ఫెస్టివల్ ను జాతీయస్థాయి పండుగగా అన్నిశాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చంద్రబాబుకు ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు.రూ. 18 కోట్లతో నిర్మించతలపెట్టిన మైనారిటీ బాలికల పాఠశాల నిర్మాణానికి నిధులివ్వండి..గతంలో టీడీపీ హయాంలో చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో రూ. 18 కోట్లతో నిర్మించతల పెట్టిన మైనారిటీ బాలికల పాఠశాల నిర్మాణాన్ని గత ప్రభుత్వం అటకెక్కించిందని, దాంతో ఎప్పుడో పూర్తికావాల్సిన విద్యాలయం నేటికీ కాగితాలకే పరిమితమైందని ప్రత్తిపాటి ముఖ్యమంత్రికి తెలియచేశారు. వీలైనంత త్వరగా పాఠశాల నిర్మాణానికి అవసరమై నిధులు కేటాయించాలని, సదరు విద్యాసంస్థ అందుబాటులోకి వస్తే పల్నాడుతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లోని ముస్లిం, మైనారిటీ బాలికలకు నాణ్యమైన విద్యాబోధనకు ప్రధాన కేంద్రబిందువుగా నిలుస్తుందని ప్రత్తిపాటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియచేశారు.






పల్నాడు జిల్లా, పోలీసు కార్యాలయం, నరసరావుపేట(వి. ఎన్. కే. వార్త).ది.08.12.2025పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ శ్రీ JV. సంతోష్ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక,ఆస్తి తగాదాలు,మోసం మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 134 ఫిర్యాదులు అందాయి.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదుల కు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతి న పరిష్కరించడానికి కృషి చేయాలని శ్రీ అడిషనల్ ఎస్పీ సూచించారు. నరసరావుపేట టౌన్ అరండల్ పేట నివాసి అయిన ఫిర్యాది టిఫిన్ బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నట్లు, కొన్ని నెలల క్రితం ఫిర్యాది తమ్ముడు (బాబాయి కొడుకు) ఫిర్యాదుతో మంచి సత్సంబంధాలు, రాకపోకలు ఉండటంతో గతంలో ఫిర్యాది వద్ద ఉన్న కొన్ని బంగారు ఆభరణాలు(72 గ్రాములు) బ్యాంకులో పెట్టి కొంత డబ్బు అప్పుగా తీసుకుని కొన్ని నెలల తర్వాత అప్పుగా తీసుకున్న డబ్బులు చెల్లించి బంగారు ఆభరణాలు తిరిగి ఇచ్చినట్లు, ఇది గమనించిన ఫిర్యాది తమ్ముడు ఆయన భార్య ఇద్దరు ఒకరోజు ఫిర్యాది ఇంటికి వచ్చి మేము ఒక స్థలాన్ని కొనుగోలు చేయాలనిఅనుకు ంటున్నాము. అది చాలా తక్కువ రేటుకు వస్తుంది. అక్కడ ఇల్లు కట్టుకుంటాము. కొంత డబ్బు తక్కువగా ఉంది కనుక ఫిర్యాది వద్ద ఉన్న బంగారం ఆభరణాలు ఇస్తే అవి తాకట్టు పెట్టి,డబ్బులు తీసుకొని స్థలాన్ని కొనుగోలు చేస్తాము. కొన్ని నెలల్లోనే తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు విడిపించి అప్పగిస్తామని నమ్మించినట్లు, దానికి గాను ఫిర్యాది మరియు ఫిర్యాది భర్త సరే అని ఒప్పుకొని ఎలాంటి కాగితాలు వ్రాసుకోకుండా కేవలం నోటి మాటలు నమ్మి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు (72 గ్రాముల బంగారం) వారికి అప్పగించినట్లు, ఆభరణాల విలువ ఇప్పటి మార్కెట్ రేటు ప్రకారం సుమారు పది లక్షల రూపాయలు ఉంటుందని, అదే ఫిర్యాది జీవనానికి ఆధారమని, ఫిర్యాది దగ్గర బంగారు వస్తువులు తీసుకున్న తర్వాత నుండి వారికి ఫోన్లు చేస్తే స్విచ్ ఆఫ్ వస్తున్నట్లు,కాగా వారు నరసరావుపేట లోని ప్రకాష్ నగర్ లో అద్దెకు ఉండే నివాసాలకు వెళ్లి విచారించగా వారు మకాం మార్చి వెళ్లిపోయినట్లు గా తెలుసుకున్నట్లు, ఎటు వెళ్లినారో ఇప్పటివరకు తెలియనందున వారి గురించి విచారించి తనకు న్యాయం చేయవలసిందిగా శ్రీ అడిషనల్ ఎస్పీ ని కలిసి ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. నరసరావు పేట కు చెందిన ఫిర్యాది తన కూలి డబ్బులతో మార్గదర్శి నందు చిట్ వేసినట్లు,సదరు చిట్ తాలూకా 13,96,000/- రూపాయలు ఫిర్యాదు అకౌంట్ నందు జమ అయినట్లు, ఫిర్యాదుకు పరిచయస్తురాలు ఇంటికి వస్తూపోతూ ఉండగా చీటీ పాట తాలూకా డబ్బులు వచ్చాయని తెలిసి ఆమె ఫిర్యాది తో వేరే వారికి డబ్బులు ఇవ్వాలని, వారు ఒత్తిడి చేస్తున్నారని, వారికి చెల్లించే వడ్డీ ఇస్తాను అని సదరు డబ్బులు ఇవ్వమని ఫిర్యాది పరిచయస్తురాలు మరియు ఆమె భర్త ఫిర్యాది తో ప్రాధేయపడగా ఫిర్యాది తనకు తెలిసిన పరిచయస్తురాలు అనే నమ్మకంతో ఈ డబ్బులు మరియు ఆమె ఇంట్లో గల1,04,000/- రూపాయలు కలిపి 15 లక్షల రూపాయలు ఇచ్చినట్లు దానికి గాను షూరిటీగా ఆమె ఫిర్యాది కి ప్రోనోటు రాసి ఇచ్చి, దానికి షూరిటీ గా చెక్కు ఇచ్చినట్లు, అయితే సదరు పరిచయస్తురాలు ఫిర్యాది కు ఇచ్చిన ప్రోనోటు మీద ఒక రకంగా సంతకం పెడితే ఫిర్యాది కు ఇచ్చిన చెక్కు నందు ఒక రకంగా అనగా చెక్కు మరియు నోటు చెల్లకుండా సంతకాలు చేసినట్లు, ఆ తదుపరి ఫిర్యాది ఎన్నిసార్లు డబ్బులు అడిగినను డబ్బులు ఇవ్వకుండా ఆమె మరియు ఆమె భర్త ఇరువురు బెదిరింపులకు పాల్పడుతున్నందున అనుమానం వచ్చిన ఫిర్యాది తన వద్ద ఉన్న ప్రోనోటు మరియు చెక్కు చూపించగా ఆమె రకరకాలుగా సంతకాలు చేసినట్లుగా చెప్పి అవి చెల్లవని చెప్పినట్లు, సదరు విషయమై పరిచయస్తురాలిని మరియు ఆమె భర్తను అడగగా వారు ఫిర్యాదిని బెదిరిస్తూ మేము కావాలనే చెక్కులు, నోట్లు చెల్లకుండా నీకు సంతకాలు చేశామని, నీకు చేతనైనది చేసుకోమని, దిక్కున చోట చెప్పుకో అనితిట్టినట్లు,మంచి మాటలతో నమ్మించి, మోసగించి ఫిర్యాది వద్ద డబ్బులు తీసుకొని కావాలనే దురుద్దేశం పూర్వకంగా మోసగించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవలసిందిగా శ్రీ అడిషనల్ ఎస్పీ ని కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన ఫిర్యాది కి ది.06/08/2019 వ తేదీన బెల్లంకొండ మండలం

పాపాయ పాలెం గ్రామానికి చెందిన వ్యక్తితో పెద్దల సమక్షంలో వివాహం జరిపించినట్లు, తదుపరి కొన్నాళ్లు కాపురం సజావుగా జరిగినట్లు, పది నెలల క్రితం భార్యాభర్తల మధ్య కొన్ని మనస్పర్థలు కారణంగా చిన్నచిన్న గొడవలు జరిగినట్లు, దానికి గాను ఫిర్యాది అత్తమామలు ఫిర్యాది కు సంతానం కలుగలేదనే కారణంతో తరచూ మానసికంగా వేధిస్తూ నీకు సంతానం కలగలేదు కనుక మా కుమారునికి వేరొక పెళ్లి చేస్తామని, ఎక్కువ కట్నం ఇచ్చే వాళ్ళు ఉన్నారని, ఫిర్యాదిని తిడుతూ కొడుతూ చాలా రకాలుగా వేధించి, కొట్టి ఇంటి నుండి పంపి వేసినట్లు, ఫిర్యాది తల్లిదండ్రులు, గ్రామ పెద్దల సహకారంతో ఫిర్యాది అత్తమామల తో మాట్లాడి కాపురానికి పంపుదామని ఎన్నిసార్లు ప్రయత్నాలు చేసినప్పటికినీ మాకొద్దు అని, ఫిర్యాది మంచిది కాదు అని ఫిర్యాది భర్తకు వేరొక అమ్మాయితో పెళ్లి చేస్తామని అత్తమామలు బెదిరించుచున్నందుకు గాను న్యాయం చేయవలసిందిగా ఫిర్యాది శ్రీ అడిషనల్ ఎస్పీ ని కలిసి అర్జీ ఇవ్వడం జరిగిందిఫిర్యాది యలమంద గ్రామంలో నివసిస్తున్నట్లు, ఫిర్యాది కి ఇద్దరు సంతానము.వారిలో ఒక అబ్బాయికి 16 సం. ఫిర్యాది కుమారుడు మరియు అతని స్నేహితుడు కలిసి నరసరావుపేట కు వెళ్లి తిరిగి వస్తుండగా సుమారు 6:15 నిమిషాల సమయంలో యలమంద బైపాస్ రోడ్డు వద్ద ఫిర్యాది ఊరికి పోవు మార్జిన్ లో భారత్ పెట్రోల్ బంక్ మూల మీద ఫిర్యాది కుమారుడు మరియు తన స్నేహితుడు నిలుచుని ఉండగా AP 07 TM 5805 టిప్పర్ డ్రైవర్ అతి వేగంగా,అజాగ్రత్తగా,హారన్ కొట్టకుండా వచ్చి రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఫిర్యాది కుమారుడిని గుద్దగా రక్త గాయం అయ్యి చనిపోగా నరసరావుపేట రూరల్ వారు కేసు నమోదు చేసినట్లు, RTO నరసరావుపేట ఆఫీస్ వారు MVI రిపోర్టు జారీ చేసినట్లు, సదరు కేసుని ఫిర్యాది నరసరావుపేట 13 వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ నరసరావుపేట నందు కేస్ ఫైల్ చేసినట్లు, సదరు కేసు నందు ఇన్సూరెన్స్ కంపెనీ అయిన సుందరం జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, సదరు టిప్పర్ ఓనర్ ఇన్సూరెన్స్ ఉంది అని ఫిర్యాది కి, పోలీసు వారికి, ఆర్టీవో నరసరావుపేట వారికి ఇన్సూరెన్స్ కాపీ ఇచ్చినట్లు, ఫిర్యాది నరసరావుపేట కోర్టు నందు ఇన్సూరెన్స్ కంపెనీ వారిని రెస్పాండెంట్ 3, పార్టీగా జాయిన్ చేసినట్లు, శ్రీ కోర్టు వారు ట్రయల్ కండక్ట్ చేయగా సదరు ఇన్సూరెన్స్ ఫేక్ ఇన్సూరెన్స్ అని తేలగా ఫిర్యాది తిరుమల స్టోన్ క్రషర్స్ ఓనర్ కు ఫోన్ చేసి అడగగా దానికి మీకు చేతనైనది చేసుకో, ఇంకొకసారి ఫోన్ చేస్తే నిన్ను చంపుతాను అని బెదిరించినందుకు గాను ఫిర్యాది శ్రీ అడిషనల్ ఎస్పీ ని కలిసి అర్జీ ఇవ్వడం జరిగింది.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ అడిషనల్ ఎస్పీ శ్రీ లక్ష్మీపతి గారు,మహిళా పోలీస్ స్టేషన్ DSP M.వెంకటరమణ పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్తలు

## స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలి... ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు









వినుకొండ, వి ఎన్ కే వార్త:వినుకొండ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల పాఠశాల ఉపాధ్యాయులతో ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులోని వై కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యను అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మంత్రి నారా లోకేష్ విద్యార్థుల భవిష్యత్ చాలా ముఖ్యమనీ చిన్న నాటి నుంచే వారికి మంచి విద్యను అందించాలని ఉద్దేశంతో ఈ యొక్క కార్యక్రమం ఏర్పాటు చేశారనీ తెలిపారు.

అనంతరం ప్రతి ఒక్క మండల టీచర్ల వద్దకు వెళ్లి వారి గ్రామాల్లో ఉన్న పాఠశాలలు యొక్క మౌళిక సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి పాటశాలలోని విద్యార్థులు స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఈ సందర్భంగా తెలియచేశారు.

## నిమ్మగడ్డ లక్ష్మీప్రసాద్ సేవలు మరువలేనివి





మాచర్ల, వి ఎన్ కే వార్త సత్యసాయి సేవసమితి ద్వారా ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలను అందించిన, స్వర్గీయ నిమ్మగడ్డ లక్ష్మీప్రసాద్ సేవలు మరువలేనివని, సత్యసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ అక్కినేని అనిల్, సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపల్ వై రమాదేవి అన్నారు. సోమవారం లక్ష్మీ ప్రసాద్ నాలుగో వర్ధంతి కార్యక్రమంను, శ్రీ సత్యసాయి విద్యావిహార్ నందు ఘనంగా నిర్వహించారు.ముందుగా పాఠశాల ఆవరణలో ఉన్న లక్ష్మీప్రసాద్ విగ్రహానికి అధ్యాపకులు విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా అక్కినేని అనిల్, జక్కా శ్రీనివాసరావు, రమాదేవి మాట్లాడుతూ, లక్ష్మీప్రసాద్ మొదటి నుంచి సమాజానికి తనవంతుగా సేవ చేయాలనే సంకల్పంతో మాచర్ల పట్టణంలో సత్యసాయి విద్యావిహార్ ను స్థాపించి, పేద మధ్య తరగతి విద్యార్థులకు ఉచిత ఇంగ్లీష్ మీడియం విద్యను అందించిన విద్యాదాత అని కొనియాడారు. అదే స్ఫూర్తితో ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా పాఠశాలను కొనసాగిస్తామన్నారు. పలువురు అధ్యాపకులు విద్యార్థులు లక్ష్మీప్రసాద్ వ్యక్తిత్వాన్ని సేవలను కొనియాడుతూ ఆయనతో తమకున్న జ్ఞాపకాలను పంచుకున్నారు.

## నరసరావుపేటలో డిస్ట్రిక్ట్ లెవల్ పారా ఒలింపిక్స్ క్రీడలుముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద



నరసరావుపేట, డిసెంబర్ 8:(వి. ఎన్. కే. వార్త) పల్నాడు జిల్లాలోని నరసరావుపేటలో శంకర భారతిపురం జడ్పీహెచ్ఎస్ స్కూల్లో డిస్ట్రిక్ట్ లెవల్ వన్డే స్పోర్ట్స్ పారా ఒలింపిక్స్ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు . నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొని, సమగ్ర శిక్ష వికలాంగుల పారా ఒలింపిక్స్ క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి దాదాపు 300 మంది వికలాంగ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ సమాజంలో మానసిక వికలాంగులు ఎక్కువ శాతం ఉన్నారని అన్నారు. “వారి కన్నా శారీరక వికలాంగులు చాలా ఉన్నతులు” అని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో భవిత సెంటర్ల ప్రాధాన్యతను వివరిస్తూ ఇవి వికలాంగుల అభివృద్ధికి కీలకమని తెలిపారు. “భవిత సెంటర్ల ద్వారా వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఉమ్మడి కూటమి ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కోసం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ ఫలాలు ఎంతో ముఖ్యమైనవి” అని ఆయన వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 6,000 మంది వికలాంగ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. 28 మండలాల్లో భవిత సెంటర్లు ఉన్నాయని, వీటి ద్వారా వికలాంగులకు అవసరమైన సేవలు అందిస్తున్నామని చెప్పారు.తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎస్ఎస్ఎన్ కళాశాల కమిటీ అధ్యక్షులు కపిలవాయి విజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పారా ఒలింపిక్స్ క్రీడాకారులకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే క్రీడా ప్రాంగణాన్ని ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరుపుకునేందుకు అనుమతి ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే కార్యక్రమం ప్రజల వద్దకు ప్రవీణ్

**పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్**





అమరావతి వి ఎన్ కే వార్త : ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడం కోసమే ప్రజల వద్దకు ప్రవీణ్ కార్యక్రమం చేయడం జరుగుతుందని పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం పెదకూరపాడు మండల పరిధిలోని లగడపాడు గ్రామంలో ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు - 100 గ్రామాలు కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. 12 వ రోజు లగడపాడు గ్రామంలోని ప్రజల సమస్యలను స్వయంగా ఎమ్మెల్యే ప్రవీణ్ అడిగి తెలుసుకున్నారు.త్వరితగతిన సమస్యలు పరిష్కారం అయ్యేలా పని చేయాలని అధికారులను ఎమ్మెల్యే ప్రవీణ్ ఆదేశించారు.

గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బంది అధికారులతో ఎమ్మెల్యే ప్రవీణ్ సమావేశమై గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా 100 రోజులు 100 గ్రామాల పర్యటన కొనసాగుతుందన్నారు.ప్రజలకు వచ్చిన ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేలా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పెదకూరపాడు మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, లగడపాడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, బాధ్యత మరియు వినియోగదార్ల రక్షణ కోసం ఏపీ రెరా నిబద్ధతతో పనిచేస్తుంది




గుంటూరు, డిసెంబర్ 08(వి. ఎన్. కే. వార్త) రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, బాధ్యత మరియు వినియోగదార్ల రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రెరా) నిబద్ధతతో పనిచేస్తుందని ఏపీ రెరా ఛైర్ పర్సన్ ఆరే శివారెడ్డి తెలిపారు సోమవారం రాయపూడిలోని సిఆర్డిఏ కార్యాలయం ఎదుట నాలుగవ బ్లాకులో ఎపి రెరా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఏపీ రెరా ఛైర్ పర్సన్ ఆరే శివారెడ్డి మాట్లాడుతూ ప్రతి రియల్ ఎస్టేట్ ఏజెంట్, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో స్థలాలు, అపార్ట్మెంట్లు లేదా భవనాల అమ్మకం, కొనుగోలు లేదా మార్కెటింగ్ వ్యాపారంలో పాల్గొనడానికి ముందు తప్పనిసరిగా ఏపీ రెరా అధికారిక వెబ్ సైట్ %www.rera.ap.gov.in% ద్వారా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రాజెక్టుల నమోదు కోసం సూచించిన పత్రాలను వివరాలను అందించిన వెంటనే నిర్దేశిక కాల పరిమితిలో అనుమతి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రియల్ ఎస్టేట్ ( నియంత్రణ మరియు అభివృద్ధి) చట్టం ద్వారా ఇంటి కొనుగోలుదారులకు సురక్షితమైన, నమ్మకమైన మరియు పారదర్శకమైన స్థిరాస్తి లావాదేవీలు అందించబడతాయన్నారు. రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్ రంగంలోని వ్యాపారులకు, లేఅవుట్లో స్థలాలు, అపార్ట్మెంట్లో ప్లాట్లు కొనుగోలుదారులకు రెరా అథారిటీ, అధికారులు స్నేహపూర్వక వాతావరణం లో అవసరమైన సహకారం అందిస్తుందన్నారు. స్థిరాస్తి వ్యాపారులమోసపూరితమైన వాగ్దానాలపైన వినియోగదారులు రెరా కు ఫిర్యాదు చేస్తే విచారించి సత్వరమే పరిష్కార దిశగా చర్యలుతీసుకుంటామన్నారు. రియల్ ఎస్టేట్ ( నియంత్రణ మరియు అభివృద్ధి) చట్టం పై రియల్ ఎస్టేట్ రంగంలోని స్టేక్ హోల్డర్స్ కు విస్తృత స్థాయిలో అవగాహన కోసం ఏపీ రెరా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ప్రతినెల ఒక జిల్లాలో 2025 డిసెంబర్ పది నుంచి 13 జిల్లాలలో 2026 డిసెంబర్ వరకునిర్వహించనున్నామని వివరించారు. ఈ అవగాహన కార్యక్రమ తిరుపతి జిల్లా నుంచిప్రారంభిస్తున్నామన్నారు. స్థిరాస్తి రంగంలోని వ్యాపారులు వారి వినియోగదారులతో స్నేహపూర్వకంగా వ్యాపార లావాదేవీలునిర్వహించాలని, సాధ్యం కాని హామీలను ఇచ్చి మోసపూరితంగా వ్యవహరించరాదని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశించిన కాల పరిమితి లోపే నిర్మాణాలను వినియోగదారులకు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థిరాస్తి వ్యాపారుల ప్రయోజనాల కోసం బిల్డింగ్ రూల్స్ లోను, లేఅవుట్లు ఏర్పాట్లు లోను అనేక నిబంధనలను సరళతరం చేస్తూ సమూల మార్పులు తీసుకువచ్చిందన్నారు. వినియోగదారులను మోసగించే స్థిరాస్తి వ్యాపార సంస్థలపై ఏపీ రెరా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజల జీవితకలల సౌధాన్ని పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాలతో నిర్మించి అందించాలన్న ప్రభుత్వం లక్ష్యాలకు అనుగుణంగా రెరా అథారిటీ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని. ఇటువంటి బాధ్యతను అప్పగించిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. ఏపీ రెరా డైరెక్టర్ కె నాగ సుందరి మాట్లాడుతూ రాష్ట్రంలో జనవరి 2025 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టు నమోదు కోసం 1011 దరఖాస్తులు అందగా వాటిలో 731 కి అనుమతులు మంజూరు చేశామని, మిగతావి అవసరమైన పత్రాలు కోసం సమాచారం అందించడం జరిగిదన్నారు. ఏపీ రెరా నూతన పాలకవర్గం ఏర్పడిన గత రెండు నెలల్లో 214 ప్రాజెక్టులు, 27 మార్కెటింగ్ ఏజెన్సీల ఎజెంట్స్ రిజిస్టర్ జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 500 చదరపు మీటర్లు , 8 యూనిట్స్ కి మించి ఉన్న అపార్ట్మెంట్స్ మరియు అన్ని లేఅవుట్ ప్రాజెక్టు లు నూరు శాతం రెరా లో కచ్చితంగా నమోదు చేసుకోవాలన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం అవసరమైన పత్రాలు వివరాలు అందించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన ప్రాజెక్టులు క్లోజర్ కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే 115 ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేయటం జరిగిందన్నారు. ప్రాజెక్టుల పురోగతి ప్రతి మూడు నెలలకు ఒకసారి సమర్పిచాలన్నారు. ఇప్పటివరకు రెరాలో నమోదు కాని ప్రాజెక్టులకు, దరఖాస్తులు షార్ట్ ఫాల్స్ ఉన్న వారికి, నిర్దేశిత కాల పరిమితిలో పూర్తి చేయని ప్రాజెక్టులకు నోటీసులు జారీ చేయడంజరుగుతుందన్నారు. స్థిరాస్తి వ్యాపారులపై వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం జరుగుతుందని, వారానికి రెండుసార్లు గురువారం, శుక్రవారం బెంచి నిర్వహించి సమస్యల పరిష్కార దిశగా చర్యలుతీసుకుంటున్నామన్నారు. ఇప్పటికీ 285 ఫిర్యాదులపై ఆర్డర్స్ జారీ చేయడం జరిగిందన్నారు. రెరాలో ప్రాజెక్టుల నమోదుకు, ఫిర్యాదులు అందించేందుకు అవసరమైన సహకారం కోసం ప్రత్యేకంగా రేరా కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు.

సమావేశంలో ఏపీ రెరా సభ్యులు ఏ. జగన్నాధ రావు, ఎం. వెంకటరత్నం, డి. శ్రీనివాసరావు, యు.ఎస్.ఎ ల్.ఎన్ కామేశ్వరరావు, జె కులదీప్ పాల్గొన్నారు.

# స్క్రబ్ టైఫస్' వలన మరణాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలి





గుంటూరు, డిసెంబర్ 8(వి. ఎన్. కే. వార్త) జిల్లాలో స్క్రబ్ టైఫస్' జ్వరాల వలన మరణాలు సంభవించకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ వైద్య ఆరోగ్యశాఖ ను సమన్వయం చేసుకుంటూ పంచాయతీ, రెవెన్యూ శాఖలు ముందస్తు జాగ్రత్త చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు సోమవారం కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్క్రబ్ టైఫస్' జ్వరాల నివారణ, ముందస్తు జాగ్రత్త చర్యలు, హౌసింగ్ , ఉపాధి హామీ పథకం పనులు, గ్రామ వార్డు సచివాలయ సేవలు తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పీహెచ్సీ వైద్యులు. ఎంపీడీవోలు, తహశీల్దార్లు, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో చిగ్గర్ మైట్ (కీటకం) ప్రభావం కుట్టడం వల్ల స్క్రబ్ టైఫస్' జ్వరాల వస్తాయని, గత కొన్ని సంవత్సరాలుగా ఈ జ్వరాలు నమోదు అవుతున్న, ప్రస్తుతం దీని వలన తీవ్ర అనారోగ్యం, మరణాలకు దారి తీస్తుందని అని చెప్పారు. దట్టమైన చెట్లు, వ్యవసాయ భూముల పక్కనే నివపించే వారిపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని, చిన్న నల్ల మచ్చ (దద్దురు మాదిరిగా) శరీరంపై కనిపించి, జ్వరం వచ్చినట్లయితే స్క్రబ్ టైపస్ గా అనుమానించవచ్చునని తెలిపారు. జ్వరం వచ్చి మూడు రోజుల వరకు తగ్గకుంటే జీ జీ హెచ్ కు వచ్చి రక్త పరీక్షలు చేయించుకునేలా అవగాహనకల్పించాలన్నారు. ఈ జ్వరాలకు ఉపయోగించే మందులు ఉప ఆరోగ్య కేంద్రాల్లో (హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్) అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్క్రబ్ టైపస్ జ్వరలపై పూర్తిస్థాయిలో ప్రజలు అవగాహన కలిగించేలా గ్రామాల్లో సచివాలయ ఉద్యోగుల ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించేలా ఎంపీడీవోలుపర్యవేక్షించాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచించిన విధంగా నివారణ, ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రజలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ అధికారులు నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలునిర్వహించాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణానికి సంబంధించి గతం లో లే అవుట్లలో ఆప్షన్ 3లో ఇళ్ళు నిర్మించిన కాంట్రాక్టర్ల పనులను పరిశీలించి డీవియేషన్లు ఉంటే వాటిని సరిచేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించని కాంట్రాక్టర్లపై చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద 3డీ మోడల్ లో గృహాల నిర్మాణానికి అనువుగా ఉన్న లేఔట్లను గుర్తించాలన్నారు, ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేసిన పశువుల పాకలు వచ్చే వారం నాటికి నూరు శాతం గ్రౌండ్ చేసి డిసెంబర్ 15 నాటికి పూర్తి అయ్యేలా ఎంపీడీవోలు నిరంతరంపర్యవేక్షించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో జరిగే సర్వేల రోజువారీ వివరాల డైరీ సచివాలయ ఉద్యోగులు నిర్వహించేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు.

సచివాలయ ఉద్యోగులు అందిచే పీజీఆర్ఎస్ అర్జీల ఎండార్స్మెంట్ లపై ఉద్యోగి పేరు , సచివాలయం వివరాల రబ్బర్ స్టాంప్ వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయుల ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరు శాతం మెరుగుపరిచేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారుజిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా.విజయలక్ష్మిమాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ జ్వరాల లక్షణాలు, చికిత్స, అనుసరించాల్సిన ఇతర పద్ధతులను వివరించారు. పొలం పనులకు వెళ్లే వారు రబ్బరుతో తయారుచేసే షూలు ధరిస్తే మంచిదని, పాత మంచాలు, పరుపులు, దిండ్లు వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవడం మంచిదన్నారు, నివాసం ఉండేచోట ఎలుకలు సంచరించకుండా చూసుకోవాలన్నారు.నేలపై నిద్రించే సమయంలో దుప్పట్లుఉపయోగించాలన్నారు. రాత్రి వేళల్లో ఒంటిని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించటం తదితర ముందస్తు జాగ్రత్త చర్యలను పాటించాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో వి జ్యోతి బసు , సీపిఓ శేషశ్రీ, జిల్లా హౌసింగ్ పీడీ ప్రసాదు, డ్వామా పీడి శంకర్ పాల్గొన్నారు.

# గుంటూరు జిల్లా వార్తలు

## స్వీయ-అభివృద్ధి, వ్యక్తిత్వ నిర్మాణానికి యువజనోత్సవాలు దోహదం.








నాగార్జున యూనివర్సిటీ( వి ఎన్ కే వార్త )ఆకాశమే హద్దుగా ఎదగాలి క్రీడలు, సాంస్కృతిక అంశాలు జీవితంలో భాగం కావాలి సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు గొప్ప అవకాశం.ఇన్చార్జి ఉపకులపతి ఆచార్య కే. గంగాధర్ రావువిద్యార్థులలో నాయకత్వం, పరస్పర సహకారంతో పాటు స్వీయ-అభివృద్ధి మరియు వ్యక్తిత్వ నిర్మాణానికి యువజన ఉత్సవాలు దోహదపడతాయని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధర రావు అన్నారు.ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల యువజన ఉత్సవాల ప్రారంభ కార్యక్రమం సోమవారం జరిగింది. వర్సిటీ క్రీడా మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక ద్వారా వర్సిటీ యువజన ఉత్సవాలను ఆచార్య కంచర్ల గంగాధర రావు ప్రారంభించి మాట్లాడుతూ....విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలు ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని సూచించారు. వనరులను సద్వినియోగంచేసుకొని ఆకాశమే హద్దుగా విద్యార్థులు ఎదగాలని కోరారు. తరగతి గదిలో విద్య, పరిశోధన అంశాలపై ప్రావీణ్యం సంపాదించిన, తమలో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు యువజన ఉత్సవాలు సహకారం అందిస్తాయని చెప్పారు.

యువతలో జాతీయ సమైక్యత, మత సామరస్యం, సోదరభావం, ధైర్యం మరియు సాహసం అనే భావనను ప్రచారం చేయడం ఈ యువజనోత్సవం లక్ష్యం గా ఉండాలని కోరారు.


విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ మిమిక్రీ కళాకారుడు కాసుల కృష్ణంరాజు మాట్లాడుతూ నేటి యువతకు స్ఫూర్తి ప్రదాతగా స్వామి వివేకానంద నిలుస్తారని అన్నారు. ఈరోజు మనది కాకపోతే, రేపు మనది అవుతుందని స్వామి వివేకానంద చెప్పిన సూక్తులను ఆయన వివరించారు.యువ విద్యార్థుల సృజనాత్మక శక్తి మరియు ఉత్సాహాన్ని ప్రదర్శించడానికి యువజన ఉత్సవాలు కేంద్ర బిందువుగా నిలుస్తాయని చెప్పారు. అనంతరం పలు సినీ హీరోల డైలాగులను అనుకరించారు.వర్సిటీ రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్ మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు సాంస్కృతిక కార్యక్రమాలు తోడ్పాటునఅందిస్తాయన్నారు. అన్ని రంగాల్లో విద్యార్థులు రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యా పరిశోధన అంశాలతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలకు విశ్వవిద్యాలయం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారురిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ వర్సిటీ ప్రతిష్ట ను పెంచే విధంగా విద్యార్థులు అడుగులు వేయాలని కోరారు. అంకిత భావం కలిగి, సోదర భావంతో మెలిగి సమాజానికిమార్గదర్శకులుగా నిలవాలని చెప్పారు. యువజన ఉత్సవాలలో వివిధ పోటీలలో మాదే ప్రథమ బహుమతి అన్నట్లు పోటీ పడాలని చెప్పారు.పాలకమండలి సభ్యులు ఆచార్య కే సుమంత్ కుమార్ మాట్లాడుతూ.. యువజన ఉత్సవాలు ప్రతి విద్యార్థి జీవితంలో ఒక మైలు రాయిగా, జ్ఞాపకంగా ఉండాలని కోరారు. క్రమశిక్షణతో, కళాత్మక నైపుణ్యంతో ముందుకు సాగాలని చెప్పారు. యువజన ఉత్సవాలు ప్రతి ఒక్కరిలో ఉత్తేజం నింపాలని తెలిపారు. విజయాన్ని ఒక్కసారిగా అందుకోలేరని, ఓటమి విజయానికి తొలి మెట్టుగా భావించాలని సూచించారు.యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ మాట్లాడుతూ.. మూడు రోజులపాటు కనుల పండుగగా జరిగే యువజన ఉత్సవాలలో

మ్యూజిక్, డాన్స్, లిటరరీ ఈవెంట్స్, థియేటర్, ఫైన్ ఆర్ట్స్ వంటి అంశాలలో పోటీలు జరుగుతున్నాయని చెప్పారు. సుమారు 22 కళాశాలల నుండి 400 మంది విద్యార్థులు యువజన ఉత్సవాలలో ఆయా పోటీలకు హాజరయ్యారనిచెప్పారు.వర్సిటీ ఆర్ట్స్ అండ్ లా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం. సురేష్ కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. వీరయ్య, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి పి ఎస్ పాల్ కుమార్, ఫార్మసి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య తేజో మూర్తి తదితరులు ప్రసంగించారు.కార్యక్రమంలో ఆచార్య ఎన్ వి కృష్ణారావు, ఆచార్య ఎం త్రిమూర్తి రావు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 17న జిల్లాకు అంచనాల కమిటీ రాక

గుంటూరు, డిసెంబరు 8 (వి. ఎన్. కే. వార్త) రాష్ట్ర శాసన సభ అంచనాల కమిటీ ఈ నెల 17వ తేదీన జిల్లాలో పర్యటించనుంది. 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు చేరుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 2019 - 20, 2020 - 21, 2021 - 22 ఆర్థిక సంవత్సరాల బడ్జెట్ అంచనాలపై సమీక్షిస్తారు. అనంతరం బయలుదేరి విజయవాడ వెళతారు. అంచనాల కమిటీ కోనసీమ జిల్లా మండపేట శాసన సభ్యులు వి. జోగేశ్వర రావు అధ్యక్షులుగా, శాసన సభ్యులు భూమ అఖిల ప్రియ, నిమ్మక జయకృష్ణ, బండారు సత్యానంద రావు, కందుల నారాయణ రెడ్డి, మద్దిపాటి వెంకట రాజు, డా. పార్థసారథి వాల్మీకి, పాసిం సునీల్ కుమార్, ఏలూరి సాంబశివరావు., శాసన మండలి సభ్యులు డా.వి.వి.సూర్యనారాయణ రాజు, వరుదు కల్యాణి సభ్యులుగా పర్యటించనుంది.

## పొన్నూరు రూరల్ ఎస్సై కిరణ్ ను వీఆర్‌కు పంపిన జిల్లా ఎస్పీ



గుంటూరు (వి. ఎన్. కే. వార్త)గుంటూరు జిల్లా పొన్నూరు రూరల్ ఎస్సై కిరణ్ బాబును జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం వీఆర్ కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమ రేషన్ బియ్యం వ్యాపారులకు సహకరిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. గతంలో ఆదివారం పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు కానిస్టేబుల్స్ ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

## నేడు వర్చువల్ గా డ్రగ్ స్టోర్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాలను ప్రారంభించనున్న వైద్య శాఖ మంత్రి

గుంటూరు, డిసెంబరు 8:(వి. ఎన్. కే. వార్త) రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మంగళవారం రాష్ట్రంలోని డ్రగ్ స్టోర్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాలను వర్చువల్ గా ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళగిరి ఎపిఐఐసి 6వ అంతస్తులో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాలను మంగళవారం ఉదయం 10.30 గంటలకు మంత్రి ప్రారంభిస్తారని అన్నారు.

## 12న డిఫెన్స్ పెన్షన్ ఔట్ రీచ్ కార్యక్రమం

గుంటూరు, డిసెంబరు 8(వి. ఎన్. కే. వార్త) డిఫెన్స్ పెన్షన్ ఔట్ రీచ్ కార్యక్రమం ఈ నెల 12వ తేదీన జరుగుతుందని జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్. గుణశీల తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిస్టం ఫర్ పెన్షన్ అడ్మినిస్ట్రేషన్ రక్ష (స్పర్ట్) అవగాహని కార్యక్రమం సికింద్రాబాద్ సి.డి.ఎ ద్వారా బాపట్ల కొత్త బస్ స్టాండ్ దగ్గర టిటిడి దేవస్థాన కళ్యాణ మండపంలో 12వ తేది ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రక్షణ సేవ పెన్షనర్లు, రక్షణ పౌర పెన్షనర్లు, కుటుంట పెన్షనర్లకు (స్పర్ట్) సంబంధించిన ఫిర్యాదులు, ప్రశ్నలు రక్షణ ఖాతాల విభాగం అధికారులు, సిబ్బంది పరిష్కరిస్తారని చెప్పారు. పెన్షనర్లు మాన్యువల్, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను కూడా సమర్పించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమములో ఆర్మీ రికార్డ్స్ నుండి (AOC & EME Records) సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారని, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలలో నివసిస్తున్న రక్షణ శాఖ పెన్షనర్లు అందరూ తమ ఒరిజనల్ మిలిటరీ డిశ్చార్జ్ సర్టిఫికేట్, పెన్షన్ పేమెంట్ ఆర్డర్, పెన్షన్ పాస్ బుక్, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, తమ కుటుంబ సభ్యుల వివరములు, తమ పెన్షన్ కు లింక్ చేసిన మొబైలు తీసుకొని రావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమె సందేహాలను, ఫిర్యాదుల ను నివృత్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 0863-2225853, 8688817827 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని వివరించారు.

## గనుల దారుల్లో ఘోరీలు

డోన్ : ఖనిజ గ్రామాల్లో 'దారి'ఇంగా మారాయి. వాహనాలు అధిక బరువుతో ఖనిజాలు తీసుకెళ్తుండటంతో రోడ్లు దెబ్బతింటు న్నాయి. మోకాలి లోతు గుంతలు, రహదారులపై కడ్డీలు తేలి పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. డోన్, బనగానపల్లి నియోజకవర్గాల పరిధిలో గనులెక్కువ. జిల్లా పరిధిలో వెయ్యి వరకు క్వారీలు ఉన్నాయి. ప్రత్యేకించి నాపరాళ్లు, ఇనుప ఖనిజం, సిలికా, క్వార్ట్జ్, డోలమైట్ గనులు ఉన్నాయి. ఇక్కడ ముడి ఖనిజాన్ని తీసి పరిశ్రమలకు తరలిస్తారు. పౌడర్, సిమెంటు పరిశ్రమలకు కావాల్సిన ముడిసరకును వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి తీసుకొస్తారు. ఇక్కడ తయారైన సిమెంటు, పౌడర్‌తోపా టు నాపరాయి, పాలిష్ బండలను దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు.ప్యాపిలి నుంచి బనగానపల్లి మార్గంలో ఓ సిమెంటు పరిశ్రమకు సంబంధించి నిత్యం వంద వరకు లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. 52 కి.మీ. మేర దూరం ఉన్న ఈ రహదారి ప్యాపిలి నుంచి గార్లదిన్నె వరకు చాలాచోట్ల దెబ్బతింది. ఈ రోడ్డుపై 35 నుంచి 40 టన్నుల బరువుతోనే వాహనాలు వెళ్లాలి.. కానీ 55 నుంచి 65 టన్నుల వరకు తీసుకెళ్తున్నారు. దీంతో రహదారి మొత్తం అధ్వానంగా మారింది.

**నిధులు మళ్లించిన వైకాపా**

గనుల తవ్వకాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితమయ్యే 10-25 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు డీఎంఎఫ్ నిధులు వినియోగించుకోవాలని జీవో నంబరు 36 చెబుతోంది. మంచినీరు, విద్య, వైద్య సేవలు, రోడ్లు తదితర పనులకు వినియోగించు కోవాలి.గత వైకాపా ప్రభుత్వంలో డీఎంఎఫ్ నిధుల వినియోగానికి అవరోధాలు ఎదురయ్యాయి. డబ్బుల వినియోగంపై ఆంక్షలు పెట్టడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నిధులు మంజూరైనా అప్పటి ప్రజాప్రతినిధులు ఇతర ప్రాంతాలకు మళ్లించారు. 'కూటమి' ప్రభుత్వం చక్కదిద్దాలని వాహనదారులు విన్నవిస్తున్నారు.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే**కోవెలకుంట్ల-మయలూరు మార్గంలో చెన్నైకు సిమెంట్ లారీలు వెళ్తుంటారు. అధిక సామర్థ్యంతో ముడిసరకును తీసుకెళుండటంతో రహదారి బాగా దెబ్బతింది. ప్యాపిలి-బనగానపల్లి మార్గంలో గార్లదిన్నె వద్ద అధ్వానంగా మారింది. వెంగళాంపల్లె గ్రామ సమీపంలో గుంతలు పడి కంకర తేలింది. వెంకటాపల్లె, ఎన్.రంగాపురం వద్ద రహదారిపై కడ్డీలు తేలాయి.పసుపల గ్రామ సమీపంలోనూ రహదారి పలుచోట్ల గుంతలు పడింది. యాగంటిపల్లె, పాతపాడు సమీపంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.బేతంచెర్ల నుంచి సిమెంటునగర్ మీదుగా తమ్మరాజుపల్లెకు వెళ్లే రహదారిలో 6.5 కి.మీల దారి పలుచోట్ల దెబ్బతింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

# అండగా ఉంటాం.. అడ్డంగా కట్టేయ్!

చిత్తూరు : భవన నిర్మాణాల క్రమబద్ధీకరణకు నిర్దేశించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్)కు మార్గదర్శకాలు వెలువడక మునుపే ప్రజాప్రతినిధుల అనుచరుల పైరవీలు, అధికారుల సహకారంతో పట్టణాల్లో అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారు. బీపీఎస్ అమలుకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ త్వరలో మార్గదర్శకాలను విడుదల చేయనుంది. 2025 ఆగస్టు 31కి మునుపు అనుమతులు తీసుకోకుండా చేపట్టిన నిర్మాణాలకు ఈ పథకం వర్తిస్తుంది. సెప్టెంబరు 19న బీపీఎస్‌కు మంత్రివర్గ ఆమోదం లభించాక పట్టణాల్లో అదనపు అంతస్తుల నిర్మాణం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 300పైగా భవనాలు అనుమతులకు విరుద్ధంగా, అసలు అనుమతులే లేకుండా నిర్మించినట్లు సమాచారం. పట్టణాల శివారు ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటోంది.

**ఫోన్ చేయిస్తూ.. నిర్మిస్తూ..**

చిత్తూరు నగరపాలక సంస్థ కావడంతో.. ఇక్కడ భవన నిర్మాణ అనుమతులకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములు రూ.లక్షల్లో ఉండటంతో



యజమానులు రాజకీయ నేతలతో అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. ప్రభుత్వానికి ఫీజులు ఎగ్గొట్టి యథేచ్ఛగా అదనపు అంతస్తుల్ని నిర్మిస్తున్నారు.

**నగరంలో ఎక్కడెక్కడంటే..**

నగరంలో ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా, రీడ్స్‌పేటలో, లక్ష్మీనగర్‌కాలనీలో నిర్మిస్తున్న కొన్ని భవనాల్లో అదనపు అంతస్తులకు ఎలాంటి అనుమతి తీసుకోలేదు. మురకంబట్టులో రెండు భవనాలు, మిట్టూరులో రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లకు అనుమతుల్లేవని సమాచారం. ఉడిపి హోటల్ సమీపంలోని ఓ భవనంలో ఓ అంతస్తును అక్రమంగా నిర్మిస్తున్నారు. కాసులు అందితే చాలు.. ఎలాంటి నిర్మాణాలైనా చేసుకోండంటూ నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగంలో ఇద్దరు ఇన్‌ఛార్జి భవన ఇన్‌స్పెక్టర్లు భవన యజమానులకు సూచిస్తున్నట్లు సమాచారం. పట్టణ ప్రణాళిక విభాగం ఉన్నతాధికారులు హైరోడ్డు, గాంధీరోడ్డు విస్తరణ పనుల్లో తలమునకలై ఉండగా.. కిందిస్థాయి సిబ్బంది అందినకాడికి దోచుకుంటున్నారు. కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం: శుభప్రద, పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ-2, చిత్తూరు

బీపీఎస్ పథకానికి విరుద్ధంగా నిర్మించే అదనపు అంతస్తుల్ని నియంత్రించడానికి చర్యలు చేపడతాం. ఇదే అంశంపై వార్డు సచివాలయ ప్రణాళిక కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం.

# దారులు పూడ్చేసి.. నిధులు ఊడ్చేసి

నంద్యాల : హంద్రీ నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాలువ నుంచి ఎక్కువ నీటిని తరలించడంలో భాగంగా చేపట్టిన పూడికతీత పనులు రైతుల పాలిట శాపంగా మారింది. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా నీటిని తరలించేందుకుగాను తొమ్మిది ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటుచేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 80 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. ప్రధాన కాలువ ద్వారా ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలతోపాటు వైఎస్సార్ కడప జిల్లా, చిత్తూరు జిల్లాకు సైతం నీటిని తరలించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 3,850 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలని ప్రతిపాదించి కాలువ విస్తరణకు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది మొదట్లో గుత్తేదారుడికి పనులు అప్పగించారు. 1వ కి.మీ. నుంచి 9వ కి.మీ. వరకు పూడిక తొలగించారు. ఇక్కడే అసలు సమస్య ప్రారంభమైంది.

**తవ్వి.. ఇష్టానుసారంగా పడేసి..**

నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు-వడ్డెమాను మధ్య హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వలో పూడికతీత పనులు ఈ ఏడాది మొదట్లో ప్రారంభించారు. 9 కి.మీ. పొడవునా తీసిన పూడిక మట్టిని కొంత కాల్వ గట్టుపైనే వేశారు. నిబంధనల ప్రకారం ఈ మట్టిని జలవనరుల శాఖకు చెందిన రిజర్వు స్థలంలో వేయాలి. అది దూరంగా ఉండటంతో



కాలువలో నుంచి తీసిన పూడికను ఎక్కడికక్కడ వేసుకుంటూ వెళ్లిపోయారు. రైతులు పొలాలకు వెళ్లే మార్గంలోనూ వేశారు. వాహనాలు, ఇంధనం ఖర్చు కలిసివస్తుందన్న ఉద్దేశంతో గుత్తేదారుడు ఇష్టానుసారంగా పడేశారు. పొలాలకు వెళ్లే మార్గంలో అడ్డుగా వేయడంతో వడ్డెమాను గ్రామానికి చెందిన 100 ఎకరాలకు దారి కరవైంది. ప్రస్తుతం దిగుబడులు తీసుకెళ్లే మార్గం లేక రైతులు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

**అదనపు వ్యయం**

పొలాలకు వెళ్లే దారులకు అడ్డుగా పూడిక మట్టి వేయడంతో దీనిని తొలగించేందుకు రైతులు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనిపై జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమే. కాలువ వెంబడి పలు ప్రాంతాల్లో ఇష్టానుసారంగా పూడిక మట్టి వేయడంతో నిత్యం సమస్యలు ఎదురవుతున్నాయి.

# గుంతల దారి.. పడతారు జారి

నందికొట్కూరు : రహదారుల నిర్మాణాన్ని గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులు చేయించలేదు. ఫలితంగా ఎక్కడ చూసినా రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మరింతగా దెబ్బతిన్నాయి. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ, పీఆర్ గ్రామీణ రహదారులు రూపు కోల్పోయాయి.మరమ్మతులు చేయక..నందికొట్కూరు-పగిడ్యాల బీటీ రహదారి గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై ఒక్క వాహనం వెళ్లాలంటేనే ఇరుకుగా ఉంటుంది. ఎదురుగా వాహనాలు వస్తే ఇబ్బందులే. నందికొట్కూరు-బ్రాహ్మణకొట్కూరు కేజీ (కర్నూలు-గుంటూరు) మార్గం మీదుగా ఓర్వకల్లు పారిశ్రామికవాడకు పైపులైను ఏర్పాటుచేస్తున్నారు. పనులు పూర్తి చేసినా రోడ్డుకు మరమ్మతులు చేయకుండా అలానే వదిలేశారు. రూ.2 కోట్లు కేటాయించినా..నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. మిడుతూరు నుంచి గార్గేయపురం వెళ్లే రహదారి 15 కి.మీ. ఉంది. ప్రారంభం నుంచి చివరి వరకు అడుగడుగునా గోతులే. ఈ రహదారి మరమ్మతులకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి.

# తెగుళ్లు, ధరలు.. దానిమ్మతో దిగాలు



తాడిమర్రి : సరిగ్గా నెల రోజుల క్రితం విపణిలో దానిమ్మ మంచి ధరలు పలికాయి. టన్ను రూ.1,35,000 నుంచి 1,50,00 వరకు అమ్ముడయ్యాయి. దీంతో సాగు చేసిన రైతులు ఎంతో సంతోషపడ్డారు. రెండు నెలలపాటు ధరలు స్థిరంగా ఉంటాయని అందరూ ఆశపడ్డారు. వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. వాతావరణంలో మార్పుల కారణంగా ధరలు అమాంతం పడిపోయాయి. ఎంతలా అంటే టన్ను ఏకంగా రూ.70 వేలకు పడిపోయింది. అది కూడా కాయకు ఎటువంటి మచ్చలు లేకపోతే, పెద్ద పరిమాణంలో ఉంటేనే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 18 వేల ఎకరాల్లో దానిమ్మ పంట సాగులో ఉంది.

**చీలికలు.. మచ్చలు**

సాధారణంగా దానిమ్మ పంటకు నీటి శాతం తక్కువగా ఉండాలి. ముఖ్యంగా కోతకు వచ్చే సమయంలో నీటిని ఎక్కువగా వినియోగించరు. వాతావరణం పొడిగా, సూర్యరశ్మి ఉంటే...కాయల పరిమాణం బాగా వృద్ధి చెందుతుంది. వారం రోజులుగా ముసురు, చిరుజల్లుల కారణంగా కాయలకు తెగులు వ్యాపిస్తోంది. బ్లైట్ అనే తెగులుతో కాయకు మచ్చపడి సగానికి చీలుతోంది. ఆంత్రాక్నోస్ సోకితే మచ్చలు ఎక్కువగా పడుతున్నాయి. దీన్ని సకాలంలో గమనించకపోతే తోటంతా వ్యాపించి రైతులకు కోలుకోని దెబ్బస్తుంది.

మార్కెట్‌లో దొరికే పురుగు మందులను పిచికారీ చేసి రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. తెగులు సోకిన కాయలను రైతులు తొలగించేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాయలు నాణ్యంగా లేవని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. గతంలో ఒప్పందం చేసుకున్న వారు అప్పటి ధర చెల్లించలేమంటున్నారని రైతులు వాపోతున్నారు. దిగుబడి ఉంటే, ధరలు ఉండవు... మంచి ధరలున్నప్పుడు దిగుబడి ఉండటం లేదని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

**ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి**

చెన్నై, బెంగళూరుతోపాటు ఇతర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున దానిమ్మ ధరలు తగ్గాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. కొద్ది రోజుల్లోనే ధరలు పెరుగుతాయని అంటున్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బ్లైట్, ఆంత్రాక్నోస్ తెగుళ్ల నివారణకు కార్బన్డజిమ్ ఒక గ్రాము, ఎం45 అనే మందు 2.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

చంద్రశేఖర్, శ్రీసత్యసాయి జిల్లా ఉద్యాన శాఖాధికారి

# అనుమతి గోరంత.. దోపిడీ కొండంత!



పుట్టపర్తి: ప్రగతి పేరుతో ప్రకృతి వనరులను ఇష్టారాజ్యంగా ధ్వంసం చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తూ పరోక్షంగా తోడ్పాటునందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. వందల ఏళ్లనాటి కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు ఇస్తుంది. గుత్తేదారులు నాణ్యమైన రహదారులు నిర్మించాల్సి ఉంటుంది. నిధులు మిగిలించుకునేందుకు కొందరు అక్రమ దారులు ఎంచుకుంటున్నారు.

జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నల్లమాడ వద్ద జరుగుతున్న పనులకు అవసరమైన నాణ్యమైన ఎర్రమట్టి కోసం గుత్తేదారు సంస్థ రెవెన్యూ, గనులశాఖలకు దరఖాస్తు చేసుకుంది. నల్లమాడలో సర్వే నంబరు 1368లో 2.45 ఎకరాల్లో 25వేల మెట్రిక్ టన్నుల వరకు తవ్వుకోవడానికి తాత్కాలిక అనుమతి ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం సదరు సంస్థ రాయల్టీ ఛార్జీల కింద రూ.3.25 లక్షలు చెల్లించింది. మట్టిని బెంగళూరు- విజయవాడ ఎకనమిక్ కారిడార్‌లోని వానవోలు నుంచి వక్రకుంట వరకు జరుగుతున్న పనులకు వాడాలని తాత్కాలిక అనుమతి పత్రంలో పేర్కొన్నారు. మట్టిని ప్రస్తుతం నల్లమాడ వద్ద జరుగుతున్న పనులకు వాడుతున్నారు.

**ఒకటే.. తోలుడు**

వాస్తవానికి అనుమతి తీసుకున్న ప్రాంతం చుట్టూ హద్దురాళ్లు పాతాలి. అందులోనే తవ్వకాలు జరపాలి. ప్రస్తుతం ఆ ప్రాంతానికి వెళ్లి చూస్తే కళ్లు బైర్లుకమ్మాల్సిందే. కనీసం 50 ఎకరాలకు పైగానే కొల్లగొట్టేశారు. 3 మీటర్ల లోతుతో ముళ్లకంపలు, ఎర్రమట్టితో కప్పబడిన చిన్న దిబ్బని మాత్రమే తాత్కాలిక అనుమతి పత్రంలో పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పెద్దకొండ దర్శనమిస్తుంది. పుట్టపర్తి నుంచి నల్లమాడకు వెళ్లే రహదారి పక్కనే ఇంత జరుగుతున్నా.. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

**అధికారుల తాత్సారం**

మట్టి తవ్వకానికి అనుమతి ఇచ్చిన ప్రాంతం పక్కనే పుట్టపర్తి వ్యవసాయ మార్కెట్‌యార్డు స్థలం ఉంది. స్థలాన్ని పరిశీలించిన అనంతరం పక్కనే యథేచ్ఛగా జరుగుతున్న దోపిడీ విషయాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పూల శివప్రసాద్ గనులు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించలేదు. మరుసటి రోజు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మూడ్రోజులైనా చర్యలు లేవు. మరోవైపు తవ్వకాలు జోరుగా సాగుతూనే ఉన్నాయి.

**తనిఖీలు చేస్తాం** నల్లమాడ వద్ద గుట్టను పరిమితికి మించి తవ్వుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. సంయుక్తంగా తనిఖీలు చేయాలని నిర్ణయించాం. ఎంత మొత్తంలో తవ్వేశారో గుర్తించి అందుకనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటాం. ఓబుళరెడ్డి, గనులశాఖ ఏడీ, మనోజ్‌కుమార్, ఇన్‌ఛార్జి తహసీల్దార్

# నెట్టికంటయ్యా.. మురుగు తొలగేదెన్నడయ్యా!



గుంతకల్లు : రాయలసీమలోనే నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి ప్రత్యేకత ఉంది. వ్యాసరాయలు ప్రతిష్ఠించిన క్షేత్రాల్లో అత్యంత ప్రధానమైనది కావడం విశేషం. ఇంతటి ప్రాధాన్యమున్న ఆలయాన్ని దాతల సహకారంతో ప్రగతి పనులు చేపడుతున్నారు. అన్నీ బాగానే ఉన్నా.. కసాపురం గ్రామానికి చెందిన ప్రధాన మురుగు కాలువ కోవెల అభివృద్ధికి అవరోధంగా మారింది. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి క్షేత్ర సందర్శనకు వచ్చే వందలాది మంది భక్తులు మురుగు గుండా వెళ్లాల్సి వస్తోంది.

కసాపురం గ్రామంలో దాదాపు 1500 ఇళ్లు, 3 వేల జనాభా ఉన్నారు. గృహాల నుంచి వచ్చే మురుగు బయటకు వెళ్లడానికి ప్రత్యేకంగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడంతో ఆలయ సమీప పరిసరాల్లో మురుగు పారుతోంది. గతంలో చిన్నపాటి కాలువను ఆలయం వెనుకభాగంలో గోడకు ఆనుకుని ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు మురుగుతో ఇబ్బంది పడుతున్నారు.

**రూ.2 కోట్లు దారి మళ్లాయి!**

కసాపురం గ్రామంలో మురుగు సమస్య పరిష్కారానికి నాలుగేళ్ల కిందట ప్రభుత్వం కాలువ నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించింది. ఆయా పనులకు అప్పటి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి భూమి పూజ చేశారు. తరువాత ప్రభుత్వం నిధులను దారి మళ్లించడంతో పనులు ప్రారంభం కాలేదు. ఫలితంగా మురుగుతో గ్రామప్రజలే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు నానా అగచాట్లు పడుతున్నారు.

**సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం**

ఆలయ పరిసరాల్లోకి మురుగు రాకుండా దారి మళ్లించడానికి తగిన చర్యలు తీసుకుంటాం. ఈమేరకు ప్రణాళిక రూపొందిస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటాం.

వెంకటేశ్వరుడు, సహాయ కార్యనిర్వహణాధికారి

# పరిహారం ఇవ్వక.. లీజు సొమ్ము అందక

పుట్టపర్తి: తమ ప్రాంతంలో పెద్ద జలాశయం వస్తుందని సంబరపడిపోయారు. తాము కొంత త్యాగంచేస్తే ఇతర రైతులకూ మేలు జరుగుతుందని తలంచారు. తమకున్నది కొంతే అయినా ప్రజాప్రయోజనం ఆశించి భూమిని ఇచ్చేశారు. లీజుపేరుతో తీసుకొన్న పొలంలో అధికారులు కట్ట నిర్మించేశారు. అయినా నేటికీ ప్రాజెక్టు పూర్తవలేదు. దీంతో జిల్లేడుబండ జలాశయ నిర్వాసితులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. జిల్లేడుబండ జలాశయ నిర్మాణ పనులు రూ.680 కోట్లతో 2021, డిసెంబరులో ప్రారంభమయ్యాయి. తెలంగాణకు చెందిన గుత్తేదారు సంస్థ పనులను దక్కించుకుంది. ముదిగుబ్బ మండలంలోని గుడ్డంపల్లితండా, బుక్కపట్నం మండలంలోని గోపాలపురం గ్రామాలకు చెందిన 30ఎకరాల భూములు కట్ట నిర్మించే ప్రాంతంలో ఉన్నాయి. అందులో వేరుసెనగ, చీనీ, మామిడి ఇతరత్రా పంటలు సాగులో ఉన్నాయి. భూములు లీజుకిస్తే ఎకరాకు ఏడాదికి రూ.30వేల చొప్పున చెల్లిస్తామని, ముంపు భూములన్నింటికీ పరిహారం వచ్చినప్పుడు మీకు కూడా ఇస్తామని గుత్తేదారు చెప్పారు. ఈమేరకు రైతులతో అగ్రిమెంటు తీసుకుని భూములను తీసుకున్నారు. పంటపొలాలన్నీ తొలగించి ఆ ప్రాంతమంతా మట్టితో కప్పి 7.92 కిలోమీటర్ల మేర కట్ట నిర్మించారు.



**కొందరికే...**

అగ్రిమెంటు ప్రకారం మూడేళ్లు రైతుల ఖాతాల్లో లీజు నగదు జమ చేశారు. తర్వాత కొందరికి జమ కాలేదు. జలాశయ ముందు భాగంలో కట్ట నిర్మాణానికి ఖర్చయిన సుమారు రూ.వందకోట్ల వరకు బిల్లులను గుత్తేదారు పూర్తి చేసుకున్నారు. పరిహారంపై వైకాపా ప్రభుత్వం నుంచి స్పష్టత ఇవ్వకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. తర్వాత ప్రభుత్వం మారడంతో గుత్తేదారు వెనక్కివెళ్లిపోయారు. ఇప్పుడు రైతులకు లీజు డబ్బులు, పరిహారం చెల్లించలేదు. తిరిగి సాగు చేసుకుందామంటే భూములన్నీ కట్టనిర్మాణంలో కలిసిపోయాయి.

ఇటీవల రైతులు.. మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించేలా అధికారులను పంపుతామని, ముంపు బాధితులకు న్యాయం చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు.

**అందరికీ న్యాయం జరిగేలా చూస్తాం** భూములు కోల్పోయినవారికి లీజు ప్రకారం గుత్తేదారు ఏటా నగదు చెల్లిస్తున్నారు. జలాశయం ముంపు భూములకు పరిహారం కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాము. త్వరలోనే పరిహారం అందేలా తగిన చర్యలు తీసుకుంటాం ఖైలేష్, ఏఈ, నీటిపారుదల శాఖ

# మీ డబ్బు.. మీ హక్కు

విశాఖపట్నం: జిల్లాలో వినియోగించని బ్యాంకు ఖాతాల్లో రూ.195 కోట్ల డబ్బు పోగుబడి ఉందంటే నమ్ముతారా? అవును ఇది వాస్తవం. ఆయా బ్యాంకుల అధికారులు దీన్ని ధ్రువీకరించారు. పదేళ్లు, అంతకు మించి లావాదేవీలు జరగని ఖాతాల్లో ఉన్న నగదును బ్యాంకులు తిరిగిచ్చేస్తున్నాయి. ఈ మేరకు ఆర్‌బీఐ ఆదేశాలిచ్చింది. ఇలా ఏళ్ల తరబడి నిర్వహించని ఖాతాలను డీఈఏఎఫ్ (డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్) అని పిలుస్తారు. ఏయే బ్యాంకుల్లో ఎన్ని ఖాతాలు అలాంటివి ఉన్నాయి, వాటిల్లో ఎంత నగదు ఉందో వివరాలు తెప్పించుకుంది. ఇందులో భాగంగా డిసెంబరు నెలాఖరు వరకు జిల్లాలో అన్ని చోట్ల ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఆ నగదును వెనక్కి ఇస్తారు.

**ఎవరిని సంప్రదించాలంటే..** ఖాతా ఉన్న బ్యాంకు మరోదాంట్లో విలీనమై ఉంటే ఆ బ్యాంకును సంప్రదించొచ్చు.ఆధార్, పాస్‌పోర్టు, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పించాలి.పరిశీలన అనంతరం బ్యాంకు ప్రతినిధి ధ్రువీకరించిన తర్వాత ఆ మొత్తం అక్కడే పొందొచ్చు.ఖాతాదారు మృతి చెందితే సంబంధిత కుటుంబ సభ్యులు మరణ ధ్రువీకరణ పత్రం అందజేయాలి

**ఇలా తెలుసుకోవచ్చు..:**

జిల్లాలో డీఈఏఎఫ్ ఖాతాలు 6.22 లక్షలు ఉండగా, వాటిల్లో రూ.195 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయని ఎల్‌డీఎం శ్రీనివాస్ తెలిపారు.. నిర్వహణలో లేని ఖాతాలను ఆ బ్యాంకు వెబ్‌సైట్ లింకులోనూ తెలుసుకోవచ్చు. అదేవిధంగా ఆర్‌బీఐ యూడీజీఏఎం పోర్టల్ %https://udgam.rbi.org.in% లోనూ చూడొచ్చు.ఆ డబ్బు తీసుకోండి..: వినియోగించని బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును సంబంధిత వినియోగదారులు సులభంగా పొందొచ్చు. రిజర్వ్‌బ్యాంకు కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులు ఉపయోగించుకోవాలి. జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో ఆరు లక్షలకుపైగా ఖాతాల్లో డబ్బులు ఉండిపోయాయి. దీనికి సంబంధించి ఇటీవల సిరిపురం ఎస్బీఐ బ్యాంకులో ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాం.శ్రీనివాస్, ఎల్‌డీఎం, విశాఖ

# బొమ్మల పరిశ్రమపై కదలిక

నక్కపల్లి: పారిశ్రామికంగా జిల్లాను పరుగులు పెట్టిస్తున్న కూటమి ప్రభుత్వం మరో పరిశ్రమ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది. మంత్రి వంగలపూడి అనిత చొరవతో నక్కపల్లి మండలంలో బొమ్మల తయారీ కంపెనీ స్థాపనకు అడుగులు పడుతున్నాయి.

పరిశ్రమల నిమిత్తం గతంలో సేకరించిన భూముల్లో బల్క్‌డ్రగ్ పార్కు, ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటవుతున్నాయి. వీటికి అనుమతులు వచ్చాయి. బల్క్‌డ్రగ్‌కు ప్రధాని మోదీ ఈ ఏడాది జనవరిలో శంకుస్థాపన చేశారు. స్టీల్ ప్లాంట్‌కు తొలి విడతలో 2020 ఎకరాలు కేటాయించారు. రెండో విడతలో మరో మూడు వేల ఎకరాలు ఇవ్వనున్నారు. పరిశ్రమ ఏర్పాటులో భాగంగా క్యాప్టివ్ పోర్టు, టౌన్‌షిప్ నిర్మించనున్నారు.

'పాల్స్ ప్లష్' బొమ్మల పరిశ్రమ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. దీనిపై కొద్ది నెలల కిందట సీఎం ఆదేశాలతో మంత్రి అనిత సంబంధిత కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులతో మాట్లాడి సమన్వయం చేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు సుమారు వెయ్యి ఎకరాల భూమి అవసరమవుతుందని ప్రతిపాదించారు. ఉపమాక, ఎన్.నర్సాపురం, నల్లమట్టిపాలెం, బుచ్చిరాజుపేట తదిరత ప్రాంతాల్లో కేటాయించాలని నిర్ణయించడంతోపాటు ప్రాథమికంగా భూమిని గుర్తించారు. దీనిపై కలెక్టర్ తదితరులతో మంత్రి చర్చించారు.

బొమ్మల పరిశ్రమ ఏర్పాటైతే మహిళలకు వేలాదిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. సుమారు 25 వేల మందికి అవకాశం ఉంటుందని మంత్రి అనిత పలు సందర్భాల్లో ప్రకటించారు. విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో బొమ్మల తయారీ పరిశ్రమ అధ్యక్షుడు అజయ్ సిన్హా ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.




హైదరాబాద్: తెలంగాణలో ట్రంప్ మీడియా టెక్నాలజీస్ సంస్థ భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఫ్యూచర్‌సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమిట్ వేదికగా సంస్థ డైరెక్టర్ ఎరిక్ ఈ మేరకు ప్రకటించారు. వచ్చే పదేళ్లలో రూ.లక్ష కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు.

**తెలంగాణ విజన్‌లో భాగస్వాములయ్యేందుకు సిద్ధం: సీఐఐ మాజీ ఛైర్మన్...** ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరం ఆలోచన అభినందనీయమని సీఐఐ మాజీ ఛైర్మన్ దినేశ్ అన్నారు. తెలంగాణ ఇప్పటికే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఉందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలను ఒకే వేదికపైకి రప్పించడం గొప్ప విషయమని, తెలంగాణ విజన్‌లో భాగస్వాములయ్యేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

**రూ.25వేల కోట్లతో గ్రీన్ డేటా సెంటర్: కరణ్ అదానీ...** తెలంగాణ విజన్‌ను ఈ సమిట్ ప్రతిబింబిస్తోందని అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ఎండీ కరణ్ అదానీ అన్నారు. తెలంగాణలో ఇప్పటికే అదానీ గ్రూప్ పెట్టుబడులు పెట్టిందని చెప్పారు. "గ్రీన్ డేటా సెంటర్స్, రెన్యువబుల్ ఎనర్జీలో ఇప్పటికే పెట్టుబడులు పెడుతున్నాం. సిమెంట్ రంగంలో కూడా అదానీ గ్రూప్ పెట్టుబడులు పెడుతోంది. డిఫెన్స్, ఏరోస్పేస్ పార్క్‌ను ఏర్పాటు చేసింది. దేశంలో తొలిసారిగా యూఏవీ టెక్నాలజీ హైదరాబాద్‌లో రూపొందిస్తున్నాం. హైదరాబాద్‌లో తయారయ్యే యూవీలను సైన్యానికి అందిస్తాం. ప్రపంచమార్కెట్‌లోనూ విక్రయిస్తాం. రూ.25వేల కోట్లతో 48 మెగావాట్ల గ్రీన్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తాం. లాజిస్టిక్స్‌లో రాష్ట్రాన్ని అగ్రపథాన నిలిపేందుకు అదానీ గ్రూప్ ప్రయత్నిస్తోంది. రూ.4వేల కోట్లతో రహదారి సౌకర్యాలు కల్పించనున్నాం. రాష్ట్రంలో జిల్లాలను కలిపే రహదారులను అదానీ గ్రూప్ నిర్మిస్తోంది. రూ.2వేల కోట్లతో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసింది" అని కరణ్ అదానీ పేర్కొన్నారు.




హైదరాబాద్: అభివృద్ధి, పెట్టుబడుల విషయంలో బెంగళూరుతో హైదరాబాద్ నగరం పోటీపడుతోందని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ఈ రెండు మహానగరాలూ ప్రపంచంతో పోటీపడుతున్నాయన్నారు. ఫ్యూచర్‌సిటీలో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో ఆయన ప్రసంగించారు. తర్వాత తరానికి ఏం కావాలో ఈ ప్రభుత్వం ఆలోచించిందని అన్నారు. తెలంగాణ, సౌత్ ఇండియా అభివృద్ధికి కర్ణాటక సహకరిస్తుందన్నారు. "దేశ ఐటీ ఎగుమతుల్లో బెంగళూరు 40 శాతం కలిగి ఉంది. చిన్న రాష్ట్రమైనప్పటికీ తెలంగాణ కూడా గొప్ప వాటా కలిగి ఉంది. కాలిఫోర్నియా వంటి నగరాల్లో 13 లక్షల భారత ఇంజినీర్లు పని చేస్తున్నారు" అని శివకుమార్ తెలిపారు.




హైదరాబాద్: దశాబ్ద కాలంగా భారత్‌కు విదేశీ పెట్టుబడులు భారీగా పెరిగాయని కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్రం పాటిస్తున్న పారదర్శకత, జవాబుదారీతనం వల్లే పెట్టుబడులు పెరిగాయన్నారు. ప్రపంచ కంపెనీలకు వేదికగా భారత్ మారిందన్నారు. ఫ్యూచర్‌సిటీలో నిర్వహించిన తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమిట్‌లో ఆయన ప్రసంగించారు. "సెల్‌ఫోన్ల ఉత్పత్తిలో భారత్ ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది. గత దశాబ్దకాలంగా భారత్‌లో ఎన్‌హెచ్‌ల నిర్మాణం 70శాతం పెరిగింది. పదేళ్ల క్రితం 240కి.మీ ఉన్న మెట్రో రైల్ నెట్‌వర్క్ ఇప్పుడు 1013 కి.మీకి పెరిగింది" అని పేర్కొన్నారు.

**పక్కా విజన్, ప్రణాళికతో ముందుకెళ్తున్నాం: శ్రీధర్‌బాబు...** కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనకు రెండేళ్లు పూర్తయిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఉత్పత్తి, నిర్మాణ రంగాల్లో అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామన్నారు. "అనేక విభాగాల్లో తెలంగాణ దూసుకెళ్తోంది. మౌలిక వసతుల కల్పనలో మనమే ముందున్నాం. వచ్చే పదేళ్లపాటు త్వరగా అభివృద్ధి చెందాలనే దిశగా చర్యలు చేపడుతున్నాం. దేశంలోనే తొలిసారిగా ఏఐ విలేజ్ నిర్మిస్తున్నాం. స్పష్టమైన లక్ష్యంతో.. ధైర్యంగా, వేగంగా అడుగులు వేస్తున్నాం. క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నాం. మాకు విజన్ ఉంది. తగిన ప్రణాళిక ఉంది" అని శ్రీధర్‌బాబు అన్నారు.




## కత్తులతో పొడిచి.. తుపాకీతో కాల్చి.. హైదరాబాద్‌లో రియల్టర్ దారుణహత్య


హైదరాబాద్: నగరంలోని మల్కాజిగిరిలో దారుణం చోటుచేసుకుంది. జవహర్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో రియల్టర్ వెంకటరత్నం (46)ను దుండగులు అతి కిరాతకంగా హతమార్చారు. స్కూటీపై వెళ్తున్న రియల్టర్‌ను వెంబడించి మరీ హత్య చేశారు. నడిరోడ్డుపై కత్తులతో పొడిచి తుపాకీతో కాల్చి చంపేశారు. సాకేత్ కాలనీ ఫోస్టర్ బిల్లా బాంగ్ స్కూల్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటరత్నంపై ధూల్‌పేట్‌లో రౌడీషీట్ ఉన్నట్లు గుర్తించారు. గతంలో జంట హత్యల కేసులో ఆయన నిందితుడిగా ఉన్నారు.

ప్రత్యర్థులే చంపి ఉంటారా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ హత్యపై మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ మాట్లాడుతూ క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ బృందాలతో విచారిస్తున్నట్లు తెలిపారు. వెంకటరత్నం తల, మెడ, పొట్ట భాగాల్లో దారుణంగా నరికారని చెప్పారు. హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణంగా తెలుస్తోందన్నారు.

## కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై హరీష్ రావు సంచలన కామెంట్స్



హైదరాబాద్, డిసెంబర్ 8: రెండేళ్ళ కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రతి రోజు ప్రజా దర్బార్‌లో ప్రజలను కలుస్తా అన్నారని.. ఆ గొప్పలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్ అంటూ వ్యాఖ్యలు చేశారు. జల్సాలకు, విందులకు పెళ్లిళ్లకు, సీఎల్పీ మీటింగ్‌లకు ప్రజా భవన్‌ను వాడుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రైవేట్ లిమిటెడ్ పాలన అంటూ దుయ్యబట్టారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రేవంత్ రెడ్డి ప్రజలకు వేదన, రోదన మిగిల్చారన్నారు. రేవంత్ పాలనలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని విమర్శించారు. రెండేళ్ల పాలనలో ఆదాయం ఎందుకు తగ్గిందో చూసుకోవాలన్నారు. ఆర్గనైజ్డ్ కరప్షన్ పాలన రేవంత్ కుటుంబం, మంత్రులది అంటూ కామెంట్స్ చేశారు. కరప్షన్ ఎలా చేయాలో కాంగ్రెస్ పాలన చూసి నేర్చుకోవాలంటూ ఎద్దేవా చేశారు. వ్యవస్థీకృత అవినీతికి కాంగ్రెస్ అధిష్టానం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలన ప్రజలకు మొండి చేయి చూపించిందని... అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం విజన్, విధానం ఏంటో ఎవరికి ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, అభివృద్ధి, సంక్షేమం ఏమీ చేయలేదని మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. విజయోత్సవాలు కాదు.. అపజయోత్సవాలు జరుపుకోవాలన్నారు. బిల్లులు అడిగితే విజిలెన్స్ విచారణ, ఏసీబీ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై పగబట్టి.. బ్లాక్ మెయిల్ పాలన చేస్తున్నారన్నారు. ఒక్క ఊరిలో కూడా పూర్తి రుణమాఫీ కాలేదని తెలిపారు. మొత్తం రుణమాఫీ అయ్యిందంటే తాను రాజీనామాకు సిద్ధం.. మీరు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. రైతులకు బేడీలు వేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ రైతు సంక్షోభ ప్రభుత్వమన్నారు. జాబ్ నోటిఫికేషన్ ఇవ్వలేదు కానీ.. మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. తాగుబోతుల తెలంగాణ వైపు రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా పెద్ద కాంట్రాక్టర్ల బిల్స్ క్లియర్ అవుతున్నాయని మాజీ మంత్రి హరీష్ రావు కామెంట్స్ చేశారు.



## ఐఏఎస్ ఆమ్రపాలికి హైకోర్టులో చుక్కెదురు

హైదరాబాద్: ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఆమెను తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులపై ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది.

ఆమ్రపాలిని ఏపీకి కేటాయిస్తూ అక్టోబర్‌లో కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీవోపీటీ) ఉత్తర్వులు జారీ చేసింది. దాన్ని ఆమె క్యాట్‌లో సవాల్ చేశారు. దీంతో ఆమ్రపాలిని తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఆదేశాలు జారీచేసింది. ఆ ఉత్తర్వులను డీవోపీటీ మళ్లీ హైకోర్టులో అప్పీల్ చేసింది.

విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. క్యాట్ ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఆమ్రపాలి తరఫు న్యాయవాదికి ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.

## కూకట్‌పల్లి అభివృద్ధిపై కవిత షాకింగ్ కామెంట్స్



హైదరాబాద్, డిసెంబర్ 8: హైదరాబాద్‌కు కూకట్‌పల్లి కామధేనువుగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. సోమవారం కూకట్‌పల్లిలో పర్యటించిన కవిత... వై జంక్షన్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... మేడ్చల్ జిల్లా పర్యటనలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో తమ పర్యటన సాగుతోందన్నారు. ఇక్కడ 2 వేల కోట్ల రూపాయల విలువైన భూములను ప్రభుత్వం అమ్మిందని... కానీ కూకట్‌పల్లి నియోజకవర్గం కోసం కనీసం రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ అని గొప్పగా పెడుతున్నారని.. కానీ కూకట్‌పల్లిలో కనీస వసతులు లేవన్నారు. ఇక్కడ ఒక్క స్టేడియం కూడా లేదని విమర్శించారు. అసలు హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీ అని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. జేఎన్టీయూ మెట్రో స్టేషన్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఉందన్నారు. కూకట్‌పల్లి అంటే ఒక మిని ఇండియా మాదిరిగా ఉందన్నారు. కానీ ఇక్కడ పేదవాళు రెంట్‌కు ఇళ్లు తీసుకునే పరిస్థితి కూడా లేదని చెప్పుకొచ్చారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే వచ్చి ఓట్లు అడుగుతున్నారని.. ఓట్లు లేనప్పుడు వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకోవటం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. పాలక పక్షం పట్టించుకోవటం లేదని.. ప్రతిపక్షం అడగటం లేదన్నారు. అందుకే జాగృతి బాధ్యతను భుజాన వేసుకొని ప్రశ్నిస్తోందని తెలిపారు. కూకట్‌పల్లిలో భూములు అమ్మడే కాదు.. ఇక్కడ అభివృద్ధిపై కాంగ్రెస్ శ్రద్ధ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు.

## ప్రత్యేక ఆకర్షణగా రోబో... సీఎంకు హాయ్ అంటూ పలకరింపు




హైదరాబాద్, డిసెంబర్ 8: భారత్ ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ప్రారంభమైంది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే ఈ గ్లోబల్ సమ్మిట్‌లో రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వచ్చిన అతిథులకు స్వాగతం పలకడంతో పాటు గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాలను అందరికీ వివరిస్తోంది రోబో. ఇక గ్లోబల్ సమ్మిట్‌కు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా రోబో హాయ్ అంటూ పలకరించింది. తిరిగి ముఖ్యమంత్రి కూడా రోబోకు హాయ్ చెబుతూ ముందుకు సాగారు. గ్లోబల్ సమ్మిట్‌లో ఈ రోబో అందరినీ ఆకట్టుకుంటోంది.

అలాగే గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం పరిశీలించారు. ముఖ్యమంత్రితో సినీ నటుడు నాగార్జున కూడా ఉన్నారు. గ్లోబల్ సమ్మిట్ ఆరంభ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ రంగాలకు చెందిన దేశ, విదేశాల ప్రముఖులు హాజరయ్యారు. తెలంగాణ రైజింగ్‌పై ప్రత్యేకంగా రూపొందించిన సాంగ్‌ను వేదికపై ప్రదర్శించారు.

## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన జూ. ఎన్టీఆర్.. వ్యక్తిగత హక్కుల రక్షణ కోరుతూ పిటిషన్

న్యూఢిల్లీ: ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ తన వ్యక్తిగత హక్కులకు రక్షణ కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన తరపున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కామర్స్ సైట్స్, సోషల్ మీడియా వేదికల్లో కంటెంట్.. ఎన్టీఆర్ వ్యక్తిగత హక్కులను ఉల్లంఘించేలా ఉందని న్యాయవాది సాయి దీపక్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరా కీలక ఆదేశాలు జారీ చేశారు. జూనియర్ ఎన్టీఆర్ పిటిషన్‌ను ఐటీ నిబంధనలు -2021 కింద ఈ-కామర్స్ వేదికలు, సోషల్ మీడియా కంపెనీలు ఫిర్యాదుగా పరిగణించాలని పేర్కొన్నారు. మూడు రోజులలోపు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదుపరి విచారణను డిసెంబర్ 22కు వాయిదా వేశారు. గతంలో ప్రముఖ నటులు నాగార్జున, బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్, ఐశ్వర్యరాయ్ తదితరులు కూడా ఇదే విధమైన రక్షణను కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తమ ఫొటోలు, పేర్లు, వీడియోలను అనుమతి లేకుండా ఇతరులు వినియోగించరాదని కోర్టు ద్వారా ఆదేశాలు పొందారు. తాజాగా జూనియర్ ఎన్టీఆర్ కూడా ఇదే తరహా రక్షణ కోరుతూ కోర్టును ఆశ్రయించారు. వాణిజ్య అంశాల్లో కూడా తన వ్యక్తిగత హక్కులను ఉల్లంఘించరాదని పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వినియోగం విస్తృతమైన నేటి జమానాలో పెడ పోకడలు మితిమీరిన విషయం తెలిసిందే. సెలబ్రిటీలపై ట్రోలింగ్ విపరీతంగా పెరిగిపోయింది. ప్రముఖుల ఫొటోలు, ప్లేరు, ఇతర వివరాలతో కొందరు సోషల్ మీడియాలో ఇష్టారీతిన పోస్టులు పెడుతున్నారు. ఏఐని వినియోగిస్తూ కొత్త సమస్యలను సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో సెలబ్రిటీలు న్యాయపరమైన రక్షణలు కోరుతూ కోర్టులను ఆశ్రయిస్తున్నారు.



## చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్లు..!

ఇండస్ట్రీ ఏదైనా హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన మొదటి సినిమాతోనే సూపర్ హిట్ దక్కించుకోవడం అనేది చాలా అరుదుగా జరుగుతూ ఉంటుంది. ఒకవేళ అలా మొదటి సినిమాతోనే సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంటే ఆ హీరోయిన్ వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం రాదు. వరుస సినిమా ఆఫర్లు దక్కించుకుని కెరీర్‌లో దూసుకు పోవడం మనం చూస్తూ ఉంటాం. ఆ తర్వాత కెరీర్ గురించి పక్కన పెడితే వరుసగా నాలుగు అయిదు సినిమాలకు సైన్ చేయడం మనం చూస్తూ ఉంటాం. కానీ అర్జున్ రెడ్డి వంటి బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న హీరోయిన్ షాలిని పాండే పాపం కెరీర్ పరంగా ఏమాత్రం ముందుకు సాగలేక పోయింది. షాలిని పాండే మొదటి సినిమా హిట్ అయినా ఆ తర్వాత నుంచి ఆఫర్లు పెద్దగా రాలేదు. ఆ సినిమాలో ఆమె పోషించిన పాత్ర కారణంగా ఆఫర్లు రాలేదా... మరేదైనా కారణమా అనే విషయమై ఇప్పటికీ చర్చ జరుగుతూనే ఉంది.

**అర్జున్ రెడ్డి హీరోయిన్‌కి ఆఫర్లు...** అందంతో పాటు, ప్రతిభ ఉన్న నటి అయినప్పటికీ షాలిని పాండేకు దక్కాల్సిన గుర్తింపు, స్టార్‌డం దక్కలేదు అని ఆమె అభిమానులు అంటూ ఉంటారు. సోషల్



మీడియాలో ఆమెను ఫాలో అయ్యే లక్షల మంది ఆమెకు ఇంకాస్త మెరుగ్గా సినిమా ఆఫర్లు రావాల్సింది అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తారు. ముందు ముందు అయినా ఈ అమ్మడికి వరుస ఆఫర్లు వస్తాయి అనే విశ్వాసంతో ఎదురు చూస్తున్నారు. సోషల్ మీడియాలో ఆమె రెగ్యులర్‌గా షేర్ చేసే అందాల ఆరబోత ఫోటోలు, వీడియోల కారణంగా ఎప్పటికప్పుడు వైరల్ అవుతూనే ఉంటుంది. ఆ సమయంలో ఈమెకు కచ్చితంగా హీరోయిన్‌గా మంచి భవిష్యత్తు ఉందని చాలా మంది అనుకుంటూ ఉంటారు. తీరా చూస్తే సినిమా ఆఫర్లు కనుమరుగు అవుతూ ఉంటాయి. కనీసం చిన్న సినిమాల్లో నటించే అవకాశాలు రాకపోవడంతో ఈ అమ్మడు ఆఫర్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**సోషల్ మీడియాలో అందాల ఫోటోలు...** సోషల్ మీడియాలో ఎప్పటి మాదిరిగానే తాజాగా మరో అందమైన ఫోటో షూట్ ను షాలిని పాండే షేర్ చేసింది. వైట్ డ్రెస్‌లో సాధారణంగానే అమ్మాయిలు మరింత అందంగా కనిపిస్తూ ఉంటారు. షాలిని పాండే విభిన్నమైన ఈ వైట్ ఔట్ ఫిట్‌ను ధరించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి నిరూపితం అయ్యింది. క్లీవేజ్ షో చేస్తూ చూపు తిప్పనివ్వకుండా అందంగా కనిపిస్తున్న షాలిని పాండే ఈ ఔట్ ఫిట్ లో అంతకు మించి అన్నట్లుగా ఉందని పలువురు అంటూ ఉన్నారు. ఇక ఈ ఫోటోల్లో షాలిని కాస్త బక్క చిక్కినట్లు గా అనిపిస్తుంది. అందుకే నెటిజన్స్ ఈ అమ్మడు చిక్కినా అందంగానే ఉంది అన్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు. చక్కన్నమ్మ చిక్కినా అందమే అంటూ మరికొందరు సోషల్ మీడియా ద్వారా ఈ ఫోటోలు షేర్ చేస్తూ తెగ కామెంట్స్ చేస్తూ వైరల్ చేస్తున్నారు.

## రుక్కు కోసం స్టార్స్ వెయిటింగ్..?

కన్నడ భామ రుక్మిణి వసంత్ ఇప్పుడు సూపర్ ఫామ్ కొనసాగిస్తుంది. కన్నడలో అమ్మడు చేస్తున్న సినిమాలు సూపర్ హిట్ అవ్వడమే కాదు ఆమెకు సౌత్ లో బీభత్సమైన క్రేజ్ తెచ్చాయి. కాంతారా చాప్టర్ 1లో కనకావతి రోల్ లో అమ్మడి పర్ఫార్మెన్స్, గ్లామర్ అన్నీ రుక్మిణికి మరింత పాపులారిటీ తెచ్చాయి. అందుకే అమ్మడికి వరుస ఆఫర్లు వస్తున్నాయి. ఆల్రెడీ ఈ అమ్మడు ఎన్ టీ ఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్ ప్రాజెక్ట్ లో నటిస్తుంది. ఈ సినిమాలో రుక్మిణికి కూడా మంచి రోల్ దక్కినట్టు తెలుస్తుంది.

**టాలీవుడ్ లో వరుస స్టార్ హీరోలతో రుక్మిణి వసంత్..** రుక్మిణి వసంత్ ఎన్టీఆర్ తర్వాత టాలీవుడ్ లో వరుస స్టార్ హీరోలతో జత కట్టే ఛాన్స్ ఉందని తెలుస్తుంది. అమ్మడికి తెలుగులో కూడా సూపర్ క్రేజ్ ఏర్పడింది. రష్మిక, పూజా హెగ్డే లాంటి వాళ్లను వెనక్కి నెట్టి రుక్మిణి ప్రస్తుతం ట్రెండింగ్ లో ఉంటుంది. అందుకే స్టార్స్ కూడా ఆమెకే



ఓటేస్తున్నారు. రుక్మిణి వసంత్ ఎన్ టీ ఆర్ సినిమా రిలీజ్ అవ్వడమే ఆలస్యం నెక్స్ట్ లిస్ట్ లో అల్లు అర్జున్, రామ్ చరణ్ కూడా ఉన్నారని తెలుస్తుంది. సుకుమార్ చరణ్ కాంబినేషన్ సినిమాలో రుక్మిణి వసంత్ నే హీరోయిన్ గా తీసుకునే అవకాశం ఉందని తెలుస్తుంది. ఇక అల్లు అర్జున్, అట్లీ మూవీ తర్వాత నెక్స్ట్ సినిమాకు యూత్ లో మంచి ఫాలోయింగ్ ఉన్న రుక్మిణి వసంత్ నే తన సినిమాలో తీసుకోవాలనే ప్లానింగ్ ఉందట. సో రుక్మిణి ఈ కొత్త జోడీలు ఫ్యాన్స్ కి సూపర్ ఎంటర్టైన్మెంట్ అందిస్తాయి. ఐతే రుక్మిణి వసంత్ కేవలం స్టార్ హీరోలతోనే కాదు తెలుగులో మంచి లవ్ స్టోరీస్ చేయాలని ఆడియన్స్ కోరుతున్నారు.

**సప్త సాగరాలు దాటి సినిమాలో ప్రియ పాత్రలో..** సప్త సాగరాలు దాటి సినిమాలో ప్రియ పాత్రలో అలరించిన రుక్మిణి తెలుగులో కూడా అలాంటి లవ్ స్టోరీస్ ని చేస్తే బెటర్ అని భావిస్తున్నారు. కమర్షియల్ సినిమాలు చేసినా ఆమె మార్క్ నటనతో ఆకట్టుకుంటే మాత్రం రుక్మిణి నెక్స్ట్ టాలీవుడ్ బిగ్ స్టార్ అయ్యే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. తెలుగులో నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమా చేసింది కానీ అది ఎలా వచ్చిందో అలానే వెళ్లింది. అందుకే ఎన్ టీ ఆర్ సినిమాతో అమ్మడు గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలని ఫిక్స్ అయ్యింది. కన్నడలో పాపులారిటీ ఉన్న రష్మిక తెలుగులో కాస్త ఫామ్ రాగానే అక్కడ సినిమాలు తగ్గించింది ఐతే రుక్మిణి మాత్రం తెలుగు సినిమాలు చేసినా కూడా కన్నడ ఛాన్స్ లను మాత్రం అసలు వదిలేదని అంటుంది. మరి అమ్మడు అక్కడ ఇక్కడ ఎలా బ్యాలెన్స్ చేస్తుంది అన్నది చూడాలి.




## రాజా సాబ్ పై అవతార్ ఎఫెక్ట్.. అందుకే అక్కడ అలా..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబినేషన్ లో రూపొందుతున్న మూవీ ది రాజా సాబ్. హారర్ కామెడీ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఆ సినిమా.. వచ్చే ఏడాది జనవరిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. సంక్రాంతి పండుగ కానుకగా వరల్డ్ వైడ్ గా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో సందడి చేయనుంది. ఇప్పటికే సినిమాపై ఆడియన్స్ లో భారీ అంచనాలు క్రియేట్ అవ్వగా.. వాటిని అందుకుంటామని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందుకు తగ్గట్టే హార్డ్ వర్క్ కూడా చేస్తున్నారు. అయితే సినిమాను 2026 జనవరి 9వ తేదీన ఐమాక్స్ వెర్షన్‌తో సహా అన్ని ఫార్మాట్ లలో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుందని ఇప్పటికే తెలిపారు. ఇప్పటికే సినిమాకు సంబంధించిన టీజర్, గ్లింప్స్ కూడా ఐమ్యాక్స్ లో రిలీజ్ చేశారు.

దీంతో మూవీ ఐమ్యాక్స్ వెర్షన్ కోసం అంతా వెయిట్ చేస్తున్నారు. అయితే ఓవర్సీస్ లో ఆ ఫార్మాట్ లో ఇప్పుడు రాజా సాబ్ సినిమా రిలీజ్ అవ్వడం లేదని తెలుస్తోంది. ఈ మేరకు డిస్ట్రిబ్యూషన్ సంస్థ పోస్ట్ పెట్టింది. ఓవర్సీస్ ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ప్రత్యంగిరా సినిమాస్.. విదేశాల్లో రాజాసాబ్ ను రిలీజ్ చేయనుంది. అయితే ఇప్పుడు ఓవర్సీస్ లో ఐమ్యాక్స్ ఫార్మాట్ లో రాజా సాబ్ రిలీజ్ అవ్వడం లేదని సోషల్ మీడియాలో తెలిపింది. అవతార్ 3, ఐమ్యాక్స్ మధ్య నాలుగు వారాలు ప్రత్యేక ఒప్పందం ఉండడమే అందుకు కారణంగా వెల్లడించింది. అందుబాటులో ఉన్న అన్ని PLF, DBOX, ఇతర ప్రత్యేక ఫార్మాట్ ల్లో సినిమా చూడండని కోరింది. అయితే ఆ ఫార్మాట్ లు కూడా నాలుగు వారాల పాటు అవతార్ 3తో ఒప్పందం చేసుకుని ఉన్నాయని, కానీ ఎప్పటిలాగే వీలైనన్ని ఎక్కువ ప్రత్యేక ఫార్మాట్ షోలను పొందేందుకు తాము తీవ్రంగా కృషి చేస్తున్నామని ప్రత్యంగిరా తెలిపింది. నిజానికి.. అవతార్ -3 మూవీ డిసెంబర్ 19వ తేదీన రిలీజ్ కానుంది. రాజా సాబ్.. జనవరి 9వ తేదీన విడుదల అవ్వనుంది. రెండింటికి మధ్య నాలుగు వారాల కన్నా తక్కువ గ్యాప్ ఉంది. కాబట్టి ఇప్పటికే అవతార్ మేకర్స్.. ఐమ్యాక్స్ తో ఒప్పందం చేసుకోవడంతో రాజా సాబ్ పై ఆ ఎఫెక్ట్ పడింది. ఐమ్యాక్స్ ఫార్మాట్ లో రిలీజ్ కావడానికి వీలు లేకుండా పోయింది. దీంతో కొందరు ఓవర్సీస్ ఫ్యాన్స్ నెట్టింట నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

## రియాలిటీ చెడకుండానే విజువల్ మాయాజాలం



భారతదేశంలో నెవ్వర్ బిఫోర్ అని చెప్పుకునేలా ఒక భారీ చిత్రం 2027లో విడుదలకు వస్తుంది. ఇది వార్నర్ బ్రదర్స్ సినిమాలాగా, కామెరూన్ సినిమాలాగా ఆశ్చర్యపరుస్తుందని అభిమానులు బలంగా నమ్ముతున్నారు. ఇది ఏ సినిమానో ఈపాటికే అర్థమై ఉంటుంది. కచ్చితంగా అది ఎస్.ఎస్.రాజమౌళి తెరకెక్కిస్తున్న వారణాసి. సూపర్ స్టార్ మహేష్ - ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రలలో నటిస్తున్న ఈ సినిమాని ఇండియానా జోన్స్ లైన్స్ లో అత్యంత భారీగా రూపొందిస్తున్నారు. ఈ చిత్రం కోసం దాదాపు 900కోట్ల మేర బడ్జెట్ ని ఖర్చు చేస్తున్నారని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. అడవులు, కొండలు కోనల్లో ఈ సినిమా కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తూ దర్శకధీరుడు అంచనాల్ని మరింత ఎక్కువగా పెంచారు. ఇప్పుడు ఎంపిక చేసుకున్న కాన్వాసు, బడ్జెట్ దృష్ట్యా కూడా ఈ సినిమా రాజమౌళి తెరకెక్కించిన అన్ని ఇతర చిత్రాల కంటే అత్యంత భారీతనంతో కళ్లు మిరుమిట్లు గొలిపే ట్రీట్ ఇస్తుందని అంచనా వేస్తున్నారు. ఇలాంటి సమయంలో రాజమౌళి అనుయాయుడు అయిన దర్శకరచయిత దేవకట్టా ఓ మాట చెప్పారు. ఇది ఈగ, బాహుబలి, ఆర్.ఆర్.ఆర్ లను మించి విజువల్ మాయాజాలంతో కట్టి పడేస్తుందని, కాన్వాస్ మరో లెవల్ లో ఉంటుందని చెబుతున్నారు. అంతేకాదు, విజువల్ గ్రాఫిక్స్, ఎఫెక్ట్స్ తో తెరకెక్కించినా ఎక్కడా వాస్తవికత చెడకుండా లాజిక్స్ మిస్ కాకుండా ఉంటుందని దేవకట్టా చెప్పారు. అంతేకాదు సన్నివేశాల్లో ఎమోషన్ కూడా ఎక్కడా డ్రాప్ అవ్వదని అన్నారు. మొత్తానికి వారణాసి గురించి దేవకట్టా చెబుతున్న విషయాలు మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఈసారి బడ్జెట్, స్కేల్ దృష్ట్యా ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ మార్కెట్ ని దృష్టిలో పెట్టుకుని నిర్మించారని కూడా అర్థం చేసుకోవచ్చు. ఆస్కార్ విన్నింగ్ సినిమా తీసిన డైరెక్టర్ గా అతడి పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతోంది. గోల్డెన్ గ్లోబ్స్, హాలీవుడ్ క్రిటిక్స్ పురస్కారాలను కూడా తెచ్చిన ఘనత జక్కన్నకే చెందుతుంది. భారతదేశంలో ఇప్పటివరకూ ఏ ఇతర దర్శకుడికి చేతకాని దానిని కూడా తనకు మాత్రమే సాధ్యమవుతుందని నిరూపించాడు. అందుకే వారణాసి చిత్రంపై ఇప్పుడు అత్యంత భారీ అంచనాలేర్పడ్డాయి. ఇటీవల విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ ఇంటర్నెట్ లో చాలా రికార్డులను బ్రేక్ చేసిన సంగతి తెలిసిందే.

## రకుల్ స్విమ్ సూట్ హొయలు.. ఇది నెవ్వర్ బిఫోర్ లుక్

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రకుల్ ప్రీత్ సింగ్, గ్లామర్ విషయంలో ఎప్పుడూ తగ్గేదే లేదని నిరూపిస్తోంది. ఫిట్?నెస్?కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఈ బ్యూటీ, తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో సోషల్ మీడియాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెంచేసింది. ప్రముఖ మ్యాగజైన్ కవర్ పేజీ కోసం ఆమె ఇచ్చిన పోజులు కుర్రాళ్ళ మనసులను దోచేస్తున్నాయి. ఈ ఫొటోషూట్‌లో రకుల్ నీలి రంగు స్విమ్ సూట్ తరహా డ్రెస్ లో దర్శనమిచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ డ్రెస్‌లో ఆమె గ్లామర్ ను హైలెట్ చేస్తూనే తన చూపులతో కూడా ఎట్రాక్ట్ చేసింది. ఆమె గ్లామర్ హొయలు చూసేవారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. స్విమ్మింగ్ పూల్ పక్కన నిలబడి, తీక్షణమైన చూపులతో ఆమె విసిరే గ్లామర్ బాణాలకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు.





ఈ లుక్‌ను మరింత ఎలివేట్ చేయడానికి రకుల్ బంగారు ఆభరణాలను ఎంచుకుంది. మెడలో లేయర్స్‌గా ఉన్న గోల్డ్ చైన్స్, చేతికి బ్రాస్లెట్స్, వేళ్లకు రింగులు ధరించి రాయల్ లుక్?ను సొంతం చేసుకుంది. మోడ్రన్ అవుట్‌ఫిట్‌కి ట్రెడిషనల్ టచ్ ఇస్తూ ఆమె చేసిన ఈ ప్రయోగం ఫ్యాషన్ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కెరీర్ పరంగా చూస్తే రకుల్ ప్రస్తుతం ఫుల్ స్వింగ్‌లో ఉంది. ముఖ్యంగా బాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీగా గడుపుతోంది. త్వరలో రాబోతున్న ఒక సినిమాలో ఆమె పాత్రపై భారీ అంచనాలు ఉన్నాయి. పెళ్లి తర్వాత కూడా గ్లామర్ షోలో ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, మరింత రెట్టింపు ఉత్సాహంతో దూసుకుపోతోంది. సోషల్ మీడియాలో ఈ ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. లీడింగ్ లేడీ అనే ట్యాగ్‌తో మ్యాగజైన్ ఆమెను కవర్ పేజీపై ప్రచురించడం ఆమె క్రేజ్‌కు అద్దం పడుతోంది. ఫిట్?నెస్, అందం, అభినయం కలగలిసిన రకుల్, రాబోయే రోజుల్లో ఇంకెన్ని సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

## వాళ్లిద్దరి బాండింగ్ ఎంత స్ట్రాంగ్ అంటే?

బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా-రైటర్ జహీర్ ఇక్బాల్ ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ జంట ధాంపత్య జీవితం సంతోషంగా సాగిపో తుంది. అయితే సోనాక్షి...జహీర్ ని పెళ్లి చేసుకోవడం ఇంట్లో ఇష్టం లేదనే కథనాలు తెరపైకి వచ్చాయి. కొన్ని రకాల అసమానతలు కారణంగా సోనాక్షి కుటుంబ సభ్యులకు ఇష్టం లేనట్లు వార్తలొచ్చాయి. ఈ వివాహం ఎంతో నిరాడం బరంగా జరిగింది. ఇరు పెద్దల సమక్షంలోనే వివాహం జరిగింది. ఈ వేడుకలో సోనాక్షి సోదరుడు కనిపించలేదు. దీంతో సోనాక్షి పెళ్లికి తల్లిదండ్రులు అంగీకరించినా? సోదరుడికి ఇష్టం లేదన్నది ప్రధానంగా హైలైట్ అయింది.

**ప్రేమలో ఉన్నప్పుడే కలహాలు:** ఇదంతా పక్కన బెడితే ఆ జంట ఇప్పుడు ఎంతో అన్యోన్యంగా ఉంది. అయితే ఈ జోడీ ప్రేమలో ఉన్న సమయంలోనే అన్నిరకాల ఎడబాట్లు చూసేసింది. మూడేళ్ల ప్రేమలో ఎన్నో గొడవలు జరిగినట్లు సోనాక్షి గుర్తు చేసుకుంది. ఒకర్ని ఒకరు తిట్టు కోవడం నుంచి కొట్టు కోవడం వరకూ మనస్పర్ధల వరకూ వెళ్లారు. కానీ విడిపోవాలి అనే ఆలోచన రానివ్వలేదంది. ఆ సమయంలో కపుల్స్ థెరపీకి వెళ్దామని జహీర్ సలహా ఇవ్వడంతో రెండు సిట్టింగ్స్ లోనే ఇద్దరి మధ్య తలెత్తిన అన్ని వివాదాలకు ఫుల్ స్టాప్ పడిందంది.



అన్ని విషయాలను నెగిటివ్ గా చూడకూడదన్నది అర్దమైందంది.

**ఆ రెండింటినీ బ్యాలెన్స్ చేయాలి:** ఏ విషయాన్ని ఎలా ట్రీట్ చేయాలి? అని తెలిసినా కొన్ని క్షణాలు పాజిటివ్ గా ఆలోచించడం కంటే నెగిటివిటీనే బ్రెయిన్ కోరుకునేదంది. అప్పుడే సరైన నిర్ణయా లు తీసుకున్నామంది. నెగిటివ్..పాజిటివిటీని రెండింటిని బ్యాలెన్స్ చేసినప్పుడే జీవితం సంతోషంగా ఉంటుందని తన అనుభవాన్ని చెప్పుకొచ్చింది. దీంతో సోనా క్షి-జహీర్ ల బాండింగ్ ఎంత బలంగా మారిందన్నది ఈ సన్నివేశంతో తేటతెల్ల మవుతోంది. ప్రేమ పేరుతో లివ్ ఇన్ రిలేషన్ షిప్స్ లో ఉండటం..కొన్నాళ్ల తర్వాత విడిపోవడం ఎంతో మంది జీవితాల్లో చూసినదే.

**టాలీవుడ్ లోనూ లాంచ్ అయింది:** పెళ్లి అయిన తర్వాత కూడా విడిపోవడం అన్నది సెలబ్రిటీ లైఫ్ లో సహజంగా మారిపోయింది. చిన్న చిన్న కారణాలతోనే బంధాలు వీగిపోతున్నాయి. మనస్ప ర్ధలు, సరైన సఖ్యత లేకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వీటన్నింటిని సోనాక్షి-జహీర్ దంపతులు దాటుకుని వచ్చిన నేపథ్యంలో? ఆ బంధం మరింత బలంగానూ మారుతుందన్నది విశ్లేషకుల మాట. ఇక సోనాక్షి కెరీర్ సంగతి చూస్తే? అమ్మడు బాలీవుడ్ లో ఇంకా స్టార్ లీగ్ లో చేరలేదు. నటిగా అనుకున్నంత గుర్తింపు దక్కలేదు. ఇటీవలే జటాధర సినిమాతో తెలుగులోనూ లాంచ్ అయిన సంగతి తెలిసిందే.

Printed by Yendluri Srinivasa Rao, Published by Yendluri Srinivasa Rao, Owned by Yendluri Srinivasa Rao, Printed at Sri Kanaka Bhargav Offset Printers, D.No.3-1514/1, Anjaneya Colony, Reddypalem, Guntur -1, Published at D.No. 30-679, Opp. Keerthi Deluxe, Enugupalem Road, Vinukonda, Guntur Dist., Cell:94407 29604, Editor: Yendluri Srinivasa Rao, RNI Registration No.: APBIL/2018/76841